www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 68 సంచిక : 216 | మంగళవారం 29-01-2019 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | వెల: రూ.4.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

రైతుకు మళ్లీ గాలం



బీజేపీ సర్కారు గత హామీలు తుంగలోకి

- మద్దతు ధరకు దిక్కే లేదు
- రైతుబంధు మాదిరి పథకానికి పదును
- లోక్‌సభ ఎన్నికల్లో గట్టెక్కేందుకు కాషాయ మూక ఎత్తులు

న్యూఢిల్లీ

నాలుగున్నరేళ్లుగా ప్రజానుకూల నిర్ణయాలు తీసుకోని మోడీ సర్కారు... రెండు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు ఉన్న తరుణంలో తాయిలాలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ఆయన ప్రభుత్వం చివరిసారిగా ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. అయితే, మోడీ సర్కారు దృష్టి అంతా మెజారిటీ ఓటుబ్యాంక్ గ్రూప్‌పైనే ఉన్నది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో మూడు కీలక రాష్ట్రాల్లో (మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్)లో అధికారాన్ని కోల్పోయిన బీజేపీ.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఆ పరిస్థితి రాకూడదని జాగ్రత్తలు పడుతున్నది. మూడు రాష్ట్రాల్లో రైతులు మెజారిటీ ఓటు బ్యాంక్ అయినప్పటికీ... ఆ వర్గం సమస్యలను పెడచెవిన పెట్టడమే బీజేపీ ప్రభుత్వానికి శరాఘాతంగా మారింది. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల్లో రైతులకు భారీగా తాయిలాలు ప్రకటించేందుకు మోడీ ప్రభుత్వం సిద్ధమైంది . రుణమాఫీ మంత్రంతోనే ఆ మూడు రాష్ట్రాల్లో పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సఫలీకృతుడయ్యారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలోనూ రుణమాఫీనే ప్రధాన ప్రచారాస్త్రంగా వాడుకుంటున్నారు. ఇదే సందర్భంగా రుణమాఫీ రైతుకు తాత్కాలిక ఉపశమనమేనని.. అన్నదాత సమస్యలకు శాశ్వత పరిష్కారమార్గాలు చూపేందుకు మోడీ ప్రభుత్వం కృషి చేస్తోందని బీజేపీ నేతలు ప్రచారం చేస్తున్నారు.

మాఫీలు చెబుతున్న మతలబులేంటి?

ఇప్పటి వరకు రుణమాఫీలు ప్రకటించిన పార్టీలు ఎన్నికల క్షేత్రంలో ఎంతోకొంత గట్టెక్కాయి. దేశంలో ఏప్రిల్ 2017 నుంచి 8 రాష్ట్రాల్లో రైతు రుణమాఫీ అమలౌతోంది. ప్రస్తుతం రైతు రుణమాఫీ విలువ 1.9 లక్షల కోట్లు.. అంటే 2018-19 రక్షణ శాఖ బడ్జెట్‌లో 2 /3 వంతు. రైతు రుణమాఫీ అన్నదాతకు తక్షణ ఉపశమనం ఇవ్వొచ్చుగానీ.. రైతు సంక్షోభాన్ని నిలువరించడంలో అంతగా ప్రభావం చూపకపోవచ్చన్నది నిపుణుల మాట. అయితే, దీనికి కావాల్సిన చర్యలు ఏమిటి అన్న అంశంపై బీజేపీ పెద్దగా ఆలోచన చేయడం లేదు. నాబార్డు

- మిగతా 2 లో

అసలైన పరిష్కారం ఇది



వ్యవసాయ రంగం నిపుణులు ఎంఎస్ స్వామినాథన్ చెబుతున్న లెక్కల ప్రకారం... మనదేశంలో వ్యవసాయ సంక్షోభ నివారణకు రుణమాఫీనే ఆయుధంగా చూపేకంటే.. కనీస మద్దతుధర పెంపు, మెరుగైన మార్కెట్ సౌకర్యాల కల్పన వంటివి మంచి ఫలితాలనిస్తాయని చెబుతున్నారు. కనీస మద్దతు ధరను పెంచడం వల్ల పండించిన పంటలకు మంచి ధరలు పలికి...ఎక్కువ శాతం రైతు కుటుంబాలకు లబ్ది జరుగుతుందని అంచనా వేస్తున్నారు. రైతు రుణాలను మాఫీ చేసేకంటే వారి సమస్యకు శాశ్వత పరిష్కారమార్గాలు చూపే విధంగా చర్యలు అవసరమని ఆర్థిక వేత్తలు సూచిస్తున్నారు.



అందరికీ సంక్షేమం

- గ్రేడింగ్ లేకుండా రంగుమారిన ధాన్యం కొనుగోలు
- ఫిబ్రవరి 9న ఒకేరోజు 3లక్షల గృహ ప్రవేశాలు
- సీఎం చంద్రబాబు ఆదేశాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి :

రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడాలేని విధంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు కృషి చేయాలని సీఎం చంద్రబాబు కోరారు. ముఖ్యంగా తాగునీరు, ఉపాధి, గృహనిర్మాణ పథకాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలోని మంత్రి మండలి సమావేశ మందిరం నుంచి సోమవారం ఉదయం తొలిసారిగా నిర్వహించిన జిల్లా కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. కలెక్టర్ల సమయం ఆదా అవడం కోసం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో, పట్టణంలో మంచినీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలని చెప్పారు. అందుకు కావాల్సిన నిధులను వెంటనే విడుదల చేస్తామన్నారు. రానున్న వేసవిలో తాగునీటి సరఫరాపై పంచాయతీరాజ్ శాఖ ఇప్పటి నుంచే దృష్టి పెట్టాలని చెప్పారు. 9వ తేదీన ఒకేరోజు 3 లక్షల గృహప్రవేశం జరగాలని ఆదేశించారు. అలాగే కొత్త రేషన్‌కార్డులను, కొత్త వృద్ధాప్య పెన్షన్ పత్రాలను ఫిబ్రవరి 1వ తేదీకి లబ్ధిదారులకు అందజేయాలని చెప్పారు. ఆలస్యం చేయకుండా చుక్కల భూములు, ఇతర భూ సమస్యలను పరిష్కరించాలన్నారు. చుక్కల భూముల విషయంలో అధికారులు బుక్ నాలెడ్జ్‌ను అనుసరించడం వల్లనే ఇన్నాళ్లుగా సమస్య పరిష్కారానికి నోచుకోలేదన్నారు. గుంటూరు జిల్లాలో చుక్కల భూములకు సంబంధించిన సమస్యలు దాదాపు 28 వేలు పరిష్కారమయ్యాయని, ఈ విషయంలో గుంటూరు జిల్లా కలెక్టర్ అనుసరించిన విధానాన్ని అనుసరించమని ఆదేశించారు. సాంకేతిక సమస్యలతో లేనిపోని ఇబ్బందుల్ని సృష్టించకుండా సరళమైన విధానాలతో సమస్యను పరిష్కరించాలన్నారు. జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో ప్రజలు ప్రభుత్వం

- మిగతా 2 లో

టీ కాంగ్రెస్ ఇన్‌ఛార్జిగా ప్రియాంకగాంధీ !



విశాలాంధ్ర బ్యూరో- హైదరాబాద్:

సార్వత్రిక ఎన్నికల వేళ కాంగ్రెస్ దూకుడు పెంచింది. లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఇటీవలే ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన ప్రియాంకాగాంధీకి త్వరలోనే కీలక బాధ్యతలు అప్పగిస్తారని సమాచారం వస్తోంది. ఇప్పటికే ప్రియాంకకు తూర్పు యూపీ ఇన్‌ఛార్జిగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించారు. త్వరలోనే తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగిస్తారని తెలుస్తోంది. తెలంగాణ కాంగ్రెస్ ముఖ్య నేతలకు ఢిల్లీ నుంచి పిలుపు వచ్చింది. ఫిబ్రవరి మొదటి వారంలో కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీతో టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఏఐసీసీ కార్యదర్శులు భేటీ కానున్నారు. ప్రియాంకకు బాధ్యతలు అప్పగించే విషయంపై వారందరితో రాహుల్ చర్చలు జరపనున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లో కాంగ్రెస్ గట్టెక్కాల్సిన పరిస్థితి ఉంది. దీంతో తెలంగాణను కాంగ్రెస్ హైకమాండ్ సీరియస్‌గా తీసుకుంది. ఇందులో భాగంగానే ప్రియాంకను తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా పంపించనున్నారనే చర్చ జరుగుతోంది. ఇటీవలే ప్రత్యక్ష

- మిగతా 2 లో

భావనపాడు పోర్టు నిర్మాణంపై

దోబూచులాట...!



- 2015 జీఓ ప్రకారం పరిహారం ముందే అమలు చేయాలంటున్న మత్స్యకారులు
- ఉద్యోగావకాశాలపై స్పష్టతకు డిమాండు
- హడావుడి చేస్తున్న మధ్య దళారులు
- అదాని గ్రూపు తీరుపై విమర్శల వెల్లువ

ఉత్తరాంధ్రలో భావనపాడు పోర్టు నిర్మాణంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోబూచులాడుతున్నాయి. సాంకేతిక లోపాల వల్ల హార్బర్ నిర్మాణం నిలిచిపోగా, తాజాగా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానంలో పోర్టు నిర్మాణం తెరపైకి వచ్చింది. నాలుగున్నరేళ్ల క్రితమే ప్రతిపాదించిన పోర్టు నేటికీ కార్యరూపం దాల్చలేదు. మరోవైపు పోర్టు నిర్మాణంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావటం, పోర్టు పనులు దక్కించుకున్న అదాని గ్రూపు సంస్థ స్థానికులకు ఉద్యోగాలిచ్చేదిలేదని తేల్చి చెప్పటం వివాదాంశంగా మారింది. ఈ నేపథ్యంలో మంత్రి కె.అచ్చెన్నాయుడు, ఎంపీ కె.రామ్మోహన్ నాయుడు జోక్యం చేసుకుని పోర్టు నిర్మాణానికి ఆటంకాలు ఎదురవకుండా చర్యలు చేపడుతున్నా మత్స్యకార కుటుంబాలకు పునరావాసంపై స్పష్టతనివ్వటంలో ప్రభుత్వం వైఫల్యం చెందుతోందన్న వ్యాఖ్యలున్నాయి.

విశాలాంధ్ర - పలాస/వజ్రపుకొత్తూరు :

శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం భావనపాడు సముద్ర తీరంలో పోర్టు నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. పోర్టు నిర్మాణానికి రూ.3.500 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఇందుకోసం భావనపాడు, దేవునల్తాడ, పొల్లాడ, కొమరల్తాడ, మర్రిపాడు, శెలగపేట గ్రామాల్లో ఐదు వేల ఎకరాల భూములు సేకరించేందుకు 2015లో నోటిఫికేషన్‌ను ప్రభుత్వం జారీ చేసింది. అప్పటి నుంచి ఆయా గ్రామాల్లో భూముల అమ్మకాలు, కొనుగోళ్లను ప్రభుత్వం నిలిపివేసింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం నష్టదాయకమని రైతులు, మత్స్యకారుల కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. రైతులకు నష్టపరిహారం, పునరావాసం, ఉద్యోగాల కల్పనపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లేకపోవటంతో పోర్టు నిర్మాణం ముందుకు సాగుతుందా లేదా అనే మీమాంస నెలకొంది. భూముల క్రయవిక్రయాలు ఆగిపోవటంతో పిల్లల పెళ్లిళ్లు, ఉన్నత చదువులకు ఆటంకం కలుగుతోందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.
భావనపాడు - దేవునల్తాడ

- మిగతా 2 లో

ఎన్నికల బదిలీలు

- ఒకేచోట మూడేళ్లుంటే తప్పనిసరి
- సొంత జిల్లాల్లో పోస్టింగ్‌లొద్దు
- ఫిబ్రవరి 28లోగా పూర్తి
- ఈసీ మార్గదర్శకాలు జారీ
- అన్ని రాష్ట్రాల సీఎస్, సీఈఓలకు లేఖ



న్యూఢిల్లీ :

లోక్‌సభతోపాటు నాలుగు రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్న దృష్ట్యా కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికల నిర్వహణతో సంబంధం ఉన్న అధికారులతో పాటు మూడేళ్లపాటు ఒకేచోట పని చేసిన వారిని బదిలీ చేయాలని ఈసీ ఆదేశించింది. ప్రభుత్వ అధికారులకు సొంత జిల్లాల్లో ఏమాత్రం పోస్టింగ్ ఇవ్వొద్దంటూ ఈసీ మార్గదర్శకాలను జారీ చేసింది. అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లను ఈ ఏడాది ఫిబ్రవరి 28లోగా పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి సునీల్ అరోరా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల

- మిగతా 2 లో



రాజీనామా చేస్తా
సీఎం కుర్చీకోసం ఆరాటం లేదు : కుమారస్వామి 9లో



నిలిచిన క్రషింగ్
రైతుల్లో పెల్లుబికిన ఆగ్రహం 11లో



భారత్ హ్యాట్రిక్
రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే సిరీస్ కైవసం 12లో

ఇదీ లోకం!





సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ఆశ్రితుల కోసమే..

- బాబు రాష్ట్రాన్ని లూటీ చేశారు
- అవినీతి రాజ్యమేలుతోంది
- బీజేపీ, టీడీపీ ప్రభుత్వాలను సాగనంపుతాం
- మూడో ప్రత్యామ్నాయాన్ని ఆదరించాలి
- 15 నాటికి పోటీచేసే స్థానాలు ప్రకటిస్తాం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

2 లో

మహిళా మహాసభలకు ఏలూరు ముస్తాబు

- భారీ ర్యాలీతో నేడు ప్రారంభం
- రానున్న జాతీయ, రాష్ట్ర నాయకులు

విశాలాంధ్ర బ్యూరో - ఏలూరు :

ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర 14వ మహాసభలు మంగళవారం నుంచి మూడు రోజుల పాటు ఏలూరులో జరగనున్నాయి. చంద్ర రాజకుమారి ప్రాంగణం (టుబాకో మర్చంట్స్ అసోసియేషన్ కల్యాణ మండపం)లో జరగనున్న మహాసభలకు భారీ ఏర్పాట్లు చేశారు. మహాసభల సందర్భంగా పట్టణాన్ని మహిళా సమాఖ్య పతాకాలు, బ్యానర్లు, తోరణాలతో అలంకరించారు. స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. 40 ఏళ్ల తర్వాత ఏలూరులో జరగనున్న ఈ మహాసభల్లో మహిళలు

- మిగతా 11 లో





మద్య నిషేధం ప్రధాన డిమాండు



రాష్ట్రంలో సంపూర్ణ మద్యనిషేధం అమలు జరపాలి. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించాలన్న ప్రధాన డిమాండుతో మహాసభలు జరగ నున్నాయి. మద్యం మహమ్మారితో కుటుంబాలు నాశనమవుతున్నాయి. మద్యం విక్రయాలపై రాష్ట్ర ప్రభుత్వం నడుస్తోంది. ఇంటికో దుకాణం చందాన మద్యం విక్రయానికి ప్రభుత్వం లక్ష్యాలు పెడుతోంది. మద్య నిషేధం డిమాండ్‌తో మహాసభలలో తీర్మానాలు చేయడమే కాకుండా, భవిష్యత్ దిశానిర్దేశం చేస్తాం.

- వి.జయలక్ష్మి, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య అధ్యక్షులు

మహిళా రిజర్వేషన్ అమలులో బీజేపీ విఫలం



చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ అమలులో బీజేపీ ప్రభుత్వం విఫలమైంది. ప్రధాని మోడీ మహిళలను దగాచేశారు. బీజేపీ మతోన్మాద విధానాలతో దేశవ్యాప్తంగా శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయి. మహిళలపై అత్యాచార ఘటనలను అరికట్టడంలో కేంద్రం విఫలమైంది. రాష్ట్ర ప్రభుత్వమూ మహిళపై తీవ్ర వివక్షత చూపుతోంది. ఈ రెండు ప్రభుత్వాల వైఫల్యాలపై మహాసభల్లో చర్చిస్తాం. రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతాం.

- పి.దుర్గాభవాని, ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

చైనాలో కొత్త సూపర్‌ఫాస్ట్ రైలు పరీక్ష



బీజింగ్ : చైనాలో కొత్త తరానికిచెందిన సూపర్‌ఫాస్ట్ రైలును పరీక్షించినట్టుగా రైళ్లను ఉత్పత్తిచేసే సంస్థ తెలియజేసింది. ప్రస్తుతం నడుస్తున్న మోడళ్ల రైలుకంటే తాము కొత్తగా రూపొందించిన రైలు 60 శాతం ఎక్కువ వేగంగా అంటే గంటకు 160 కి.మీ. వేగంతో నడుస్తుందని ఝుర్ఝులోకోమోటివ్ కంపెనీ లిమిటెడ్ పరిశోధనా సంస్థ మెగ్‌లెవ్ అధిపతి టాంగ్‌లైషెంగ్ తెలిపారు. కొత్త రైలు 30 శాతం అదనంగా ట్రాక్షన్ సామర్థ్యాన్ని కలిగివుంటుందని, మరో 6 టన్నుల బరువును తీసుకువెళ్లగలుగుతుందని ఆయన చెప్పారు. ఈ రైల్లో 500 మంది ప్రయాణించవచ్చునన్నారు. ఈ సంస్థ 2016లో ఛాంగ్‌షా నగరంలో మధ్యతరహా వేగంతో ప్రయాణించే కొత్త రైలును ప్రవేశపెట్టింది. గంటకు 200 కి.మీ. వేగంతో ప్రయాణించే రైలును రూపొందించేందుకు కూడా తాము ఏర్పాట్లు చేసుకున్నామని ఆయన చెప్పారు.

గోడ కోసం ఎమర్జన్సీ : మిక్‌ముల్వని

వాషింగ్టన్ : మెక్సికో సరిహద్దుల్లో గోడ నిర్మాణం కోసం తమ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎమర్జన్సీని విధించే అవకాశంవుందని వైట్‌హౌస్ సిబ్బంది అధిపతి మిక్‌ముల్వని ఫాక్స్ న్యూస్ సంస్థకు తెలియజేశారు. గోడ నిర్మాణానికి కాంగ్రెస్ అంగీకరించకపోతే ఎమర్జన్సీని విధిస్తారని ఆయన అన్నారు. గోడ నిర్మాణానికి 5.7 బిలియన్ డాలర్లను మంజూరు చేయాలని ట్రంప్ చేసిన ప్రతిపాదనను ప్రతినిధుల సభ తిరస్కరించడంతో ట్రంప్ తన ప్రభుత్వాన్ని నెలరోజులకుపైగా పాక్షికంగా మూసివేసి ఎట్టకేలకు రెండురోజుల క్రితం ప్రభుత్వాన్ని పనిచేయించేందుకు అంగీకరించారు. కాంగ్రెస్ ఆమోదించినా లేకపోయినా దేశభద్రతకోసం సరిహద్దుల్లో గోడ నిర్మిస్తారని ముల్వని చెప్పారు. అమెరికా చరిత్రలోనే ఎక్కువకాలం ప్రభుత్వాన్ని మూసివేసిన ఘనత ట్రంప్‌కే దక్కింది. ప్రభుత్వాన్ని శుక్రవారం నుండి తిరిగి పనిచేయిస్తున్నారు. దేశంలో అత్యవసర పరిస్థితిని విధించడమే తనకు ఉత్తమమైన మార్గమని ట్రంప్ తన సలహాదారులతో అన్నారు. ఈ అంశంపై నలుగురు ప్రముఖులతో ఆయన చర్చలు జరిపారు. అయితే వారు వివరాలు వెల్లడించడానికి తిరస్కరించారు. సమస్య పరిష్కరించుకునేందుకే ప్రభుత్వాన్ని తిరిగి ట్రంప్ పనిచేయిస్తున్నారని ముల్వని అన్నారు.



ఈయూకి ట్రంప్ బెదిరింపు

ప్రత్యామ్నాయ చెల్లింపుల వ్యవస్థను రూపొందిస్తున్న బ్రస్సెల్స్

వాషింగ్టన్ : ఇరాన్‌పైన విధించిన ఆంక్షలకు కట్టుబడివుండకుండా ఆ దేశంతో సుళువుగా వాణిజ్యం చేసేందుకు ప్రత్యామ్నాయ చెల్లింపుల వ్యవస్థను రూపొందించుకునేందుకు యూరోపియన్ యూనియన్ (ఈయూ) ప్రయత్నిస్తున్నది. ఈ అంశాన్ని తెలుసుకున్న అమెరికా ఆంక్షలకు బద్ధులైవుండాలని లేకపోతే తగినవిధంగా తాము స్పందిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈయూని హెచ్చరించారు. ఇరాన్‌పైన విధించిన ఆంక్షలను కాదని ఆదేశంతో వాణిజ్యాన్ని కొనసాగించరాదని అమెరికా కోరుతున్నది. ఒకవేళ అలా కొనసాగించినట్లయితే భారీగా జరిమానాలు, చర్యలు వుంటాయని ట్రంప్ బెదిరిస్తున్నారు. అయితే అమెరికా బెదిరింపులకు లొంగకుండా ఈయూ ప్రత్యామ్నాయ చెల్లింపుల వ్యవస్థను రూపొందించే ఏర్పాట్లు చేసుకుంటున్నది. ఈయూ కొత్త వ్యవస్థను అమలు చేసినట్లయితే అట్లాంటిక్ ప్రాంతాల, దేశాల మధ్య సంబంధాలు దెబ్బతినే అవకాశముంది. ప్రత్యామ్నాయ వ్యవస్థ ఇప్పటికే దాదాపు తయారైందని, చివరిదశలో ఉన్నదని ఈయూ విదేశాంగ విధాన చీఫ్ ఫెదరికామొఘరిని ప్రతినిధి మజాకొసిజన్‌సిక్ తెలిపారు. అతి త్వరలో కొత్త వ్యవస్థను బ్రస్సెల్స్ నుండి ప్రకటించే అవకాశముందని ఆయన చెప్పారు. తాము విధించిన ఆంక్షలను లెక్కచేయకపోతే వ్యక్తులమీద, సంస్థలమీద అమెరికా తగిన చర్యలు తీసుకునే అవకాశముందని ఎపి వార్తాసంస్థ తెలిపింది. ఇరాన్‌తో వాణిజ్యం చేయాలా? లేకపోతే అమెరికాతో స్నేహం కావాలా? అన్న అంశాన్ని నిర్ణయించుకోవలసి ఉంటుందని అమెరికా సెనేటర్ టామ్‌కాటన్‌ను ఉటంకిస్తూ ఎపి వార్తను అందించింది. ఇరాన్‌తో 2015లో కుదిరిన అణు ఒప్పందంపైన అమెరికాతో పాటు చైనా, ఫ్రాన్స్, జర్మని, రష్యా, బ్రిటన్ సంతకాలు చేశాయి. అయితే ఈ ఒప్పందంనుండి వైదొలగుతు న్నట్టు ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆ తరువాత ఇరాన్‌పైన పలు ఆంక్షలను విధించారు. ఇరాన్‌పైన కక్షగట్టినట్టుగా ట్రంప్ వ్యవహరిస్తున్నారు. ఆ దేశంనుండి ఇతర దేశాలు ముడిచమురును కొనటానికి వీలు లేకుండా ట్రంప్ ఆంక్షలు విధించారు. ఇరాన్ అణ్వాయుధాలను ఉత్పత్తి చేస్తున్నదంటూ ఆరోపణలు చేశారు. అయితే ట్రంప్ వైఖరిని ఒప్పందంపై సంతకాలు చేసిన ఇతర దేశాలు అంగీకరించలేదు. ముడిచమురును ఇరాన్‌నుండి దిగుమతి చేసుకోవడానికి వీలుగాకుండా మొదట భారతదేశంపై కూడా ఆంక్షలను ప్రకటిస్తానని ఆ తరువాత మినహాయించారు. ఇంతవరకు అమెరికా డాలర్ రూపంలోనే అంతర్జాతీయ వాణిజ్యమంతా నడుస్తోంది. దీనికి ప్రత్యామ్నాయంగా కొత్త కరెన్సీ చెల్లింపుల వ్యవస్థను రూపొందించేందుకు ఈయూ నిర్ణయించుకుని ఆ దిశలో ప్రయత్నిస్తూ వచ్చింది. ఇది అమలు జరిగితే అంతర్జాతీయ విఫణిలో అమెరికా గట్టి దెబ్బను ఎదుర్కొంటుంది. అమెరికా వాణిజ్య బ్యాంకులలో నిల్వ చేసిన మొత్తాలను చైనా, ఈయూ లాంటి దేశాలు ఉపసంహరించుకునే అవకాశాలు కూడా ఉన్నాయి. అప్పుడు అమెరికా ఆర్థిక వ్యవస్థ మరింత ఒడిదుడుకులకు లోనవుతుంది.



ట్రంప్ పాలన ప్రజాస్వామ్యానికి ముప్పు : కమల

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ప్రజాస్వామ్యానికి ముప్పు కలిగిస్తాయని భారతదేశ మూలాలుగల సెనేటర్ కమలాహారిస్ విమర్శించారు. గతంలో ఏనాటికంటే నేడు దేశంలో ప్రజాస్వామ్యం ముప్పును ఎదుర్కొంటున్నదని ఆమె అన్నారు. కమలాహారిస్ తల్లి శ్యామలా గోపాలన్ భారతదేశంలోని తమిళనాడు నుండి ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లారు. ఆ తరువాత అక్కడే స్థిరపడ్డారు. తన తల్లి పోరాట స్ఫూర్తిని కమలాహారిస్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కాలిఫోర్నియాలో నివసిస్తున్న కమలాహారిస్ తన మద్దతుదారులనుద్దేశించి మాట్లాడుతూ 2020లో అధ్యక్ష పదవికి జరిగే ఎన్నికల్లో



తాను పోటీ చేయనున్నట్టు మరోసారి ప్రకటించారు. ఏ పనీ చేయకుండా కూర్చోవద్దని, ప్రతిదానికీ ఫిర్యాదు చేయవద్దని ఏదో ఒకటి మంచి చేయాలని తన తల్లి ఎప్పుడూ చెప్పేవారని కమలాహారిస్ పేర్కొన్నారు. మద్దతుదారులనుద్దేశించి 30 నిముషాలకుపైగా మాట్లాడారు. తన తల్లినుండే పోరాట స్ఫూర్తిని పొందానన్నారు. తనకు అమెరికానే మాతృదేశమని, దేశంకోసం అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్నానని చెప్పారు. ఆమె ప్రసంగం వినేందుకు దాదాపు 20వేల మంది హాజరైనట్టుగా అంచనా వేశారు. జాతివివక్షపై అవిశ్రాంతంగా పోరాటం చేసిన మార్టిన్‌లూథర్‌కింగ్ జూనియర్ వర్ధంతి సందర్భంగా హారిస్ అధ్యక్ష పదవికి తాను పోటీచేయనున్నట్టు ప్రకటించారు. కమలాహారిస్‌తో పాటు మరో ముగ్గురు సెనేటర్లు ఎలిజబెత్‌వారెన్, కిరిస్టన్‌గిల్లిబ్రాండ్, ప్రతినిధుల సభ సభ్యురాలు తులసిగబ్బార్డ్ కూడా అధ్యక్ష పదవికి పోటీచేయనున్నట్టు ప్రకటించారు.

బ్రెగ్జిట్ కోసం ఎంపీల సెలవు రద్దు

లండన్ : యూరోపియన్ యూనియన్ నుండి (ఈయూ) వైదొలగేందుకు బ్రెగ్జిట్ ఒప్పందాన్ని పార్లమెంటులో ఆమోదింపజేసుకునేందుకు ప్రధాని థెరిసామే చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా ఫిబ్రవరిలో కూడా ఎంపీల సెలవు దినాలను రద్దుచేసి ఈ అంశంపై చర్చించనున్నట్టు తెలుస్తోంది. మార్చి 29లోపు ఈయూ నుండి బ్రిటన్ వైదొలగవలసివుంది. అయితే బ్రెగ్జిట్ ముసాయిదా ఒప్పందాన్ని పార్లమెంటులో అత్యధిక సభ్యులు తిరస్కరించడంతో థెరిసా పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. బ్రెగ్జిట్‌ను ఆమోదించకపోతే ఒప్పందం లేకుండానే ఈయూ నుండి వైదొలగాలన్న ప్రతిపాదన కూడా ముందుకు వచ్చింది. అలాగే మరోసారి రెఫరెండం జరిపించాలని కొంతమంది కోరారు. ఈయూతో మరోసారి చర్చలు జరిపి కొన్ని మినహాయింపులను కోరేందుకు కూడా థెరిసా సిద్ధమయ్యారు. అయితే మరోసారి బ్రెగ్జిట్‌పై చర్చలు జరపటానికి ఈయూ నేతలు సిద్ధంగాలేరు. ఈ నేపథ్యంలో ఎలాగైనా పార్లమెంటు ఆమోదాన్ని సాధించాలని థెరిసా భావిస్తూ ఫిబ్రవరి నెలలో కూడా సెలవురోజులైన శుక్రవారాలలో కూడా ఈ అంశంపై చర్చించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఒప్పందాన్ని ఆమోదింపజేసుకోవటంలో థెరిసా విఫలమైనందున ఎన్నికలు జరపాలని ప్రతిపక్ష లేబర్ పార్టీ నాయకుడు జెరిమికార్బిన్ తదితరులు డిమాండ్ చేస్తున్నారు. బ్రెగ్జిట్‌ను ఆమోదింపజేసుకునేందుకు 8 చట్టాలను ప్రభుత్వం రూపొందించుకోవలసి ఉంది. వాణిజ్యం, మత్స్య పరిశ్రమ, వ్యవసాయం, వలసలు, వాతావరణం, ఆరోగ్యభద్రత తదితర రంగాలకు సంబంధించిన ఈ చట్టాలను కూడా ఆమోదింపజేసుకోవాలి. బ్రెగ్జిట్ బిల్లును ఆమోదింపజేసుకునేందుకు వివిధపక్షాల ఎంపీలతో కూడా థెరిసా చర్చలు జరిపారు. ఏదోవిధంగా సభ ఆమోదాన్ని పొందుతామని ప్రభుత్వ ప్రతినిధి ఒకరు చెప్పారు.



ఎల్లోవెస్ట్ ఉద్యమ వ్యతిరేక ర్యాలీ

పారిస్ : ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రాన్ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, ధరల పెరుగుదలను నిరసిస్తూ దాదాపు 11 వారాలపాటు జరిగిన ఎల్లోవెస్ట్ ఉద్యమానికి వ్యతిరేకంగా ఆదివారం పారిస్‌లో ర్యాలీ జరిగింది. దాదాపు 10వేల మంది పాల్గొనివుంటారని పోలీసువర్గాలు తెలిపాయి. ఎల్లోవెస్ట్ ఉద్యమం సందర్భంగా పోలీసులతో అనేకసార్లు ఘర్షణలు జరిగాయి. ఆదివారం వర్షం పడుతున్నప్పటికీ ఎల్లోవెస్ట్ ఉద్యమ వ్యతిరేకులు ర్యాలీ జరిపారు. ప్రజాస్వామ్యానికి తాను అనుకూలమేనని, అయితే విప్లవానికి తాము వ్యతిరేకమని వారు నినాదాలు చేశారు. ఎల్లోవెస్ట్ ఉద్యమాన్ని రెడ్‌స్కార్ఫ్ ఉద్యమంగా ర్యాలీ జరిపినవారు అభిప్రాయపడుతున్నారు. దేశంలో పేదలకు సహాయం చేయటానికి తాము వ్యతిరేకం కాదని ఘర్షణలు, విధ్వంసం లాంటి వాటికి వ్యతిరేకమని వారు పేర్కొన్నారు. తాము ఎల్లోవెస్ట్ ఉద్యమాన్ని కూడా వ్యతిరేకించటంలేదని వారు తెలిపారు. ఈ ర్యాలీ జరగడానికి ముందురోజు 4వేల మందికి పైగా మాక్రాన్ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ నిరసన ర్యాలీ జరిపారు.



ట్రంప్ తటస్థీకరణకు వెనిజులా కృషి

మాస్కో : వెనిజులాలో తిరుగుబాటుకు రెచ్చగొట్టిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వాన్ని తటస్థీకరించేందుకు వెనిజులా ప్రయత్నిస్తున్నది. ఈ విషయాన్ని వెనిజుల విదేశాంగమంత్రి జార్జిఅర్రియజ ఆర్‌టీ న్యూస్ ఛానల్‌కు తెలియజేశారు. అమెరికా చేస్తున్న దాడులను తటస్థీకరించడంపై తాము శ్రద్ధ పెట్టామని, లాటిన్ అమెరికా, ఐరోపా దేశాలలో ప్రభుత్వాలను తమ సేవకులుగా వినియోగించుకునేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారని ఆదివారం రాత్రి న్యూస్ ఛానల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో ఆయన అన్నారు. దేశంలో తిరుగుబాటుకు ఇన్‌ఛార్జి ట్రంప్ అని, వెనిజులా ప్రతిపక్ష నాయకుడు జాన్‌గుయ్‌డొను తాత్కాలిక అధ్యక్షుడిగా గుర్తిస్తూ సర్కస్సును నిర్వహిస్తున్నాడని అర్రియెజ విమర్శించారు. కొత్తగా అధ్యక్ష ఎన్నికలను 8 రోజుల్లోపు నిర్వహించకపోతే గుయ్‌డొను తాత్కాలిక అధ్యక్షుడుగా గుర్తిస్తామని ఈయూ దేశాలు కూడా చెప్పాయి. అయితే మదురోకు అనుకూలంగా చైనా, రష్యా, క్యూబా, టర్కీ, మెక్సికో, లాటిన్ అమెరికాలోని మరో మూడు దేశాలు స్పందించిన తరువాత అమెరికా దూకుడుగా మాట్లాడటం తగ్గించింది. అటు అమెరికా ఇటు వెనిజులాలో 'ప్రయోజన కార్యాలయా లను' ఏర్పాటు చేసుకుందామని వెనిజుల అధ్యక్షుడు నికొలస్ మదురొ ప్రభుత్వం ప్రతిపాదించింది. అలాగే బహిష్కరించిన అమెరికా దౌత్యవేత్తలు దేశంలోనే కొనసాగేందుకు కూడా మదురొ ప్రభుత్వం ఆమోదం తెలిపింది.



రైతుకు మళ్లీ గాలం

(మొదటిపేజీ తరువాయి)

సమాచారం ప్రకారం 2015 జులై- 2016 జూన్ మధ్య రుణాలు పొందిన రైతు కుటుంబాలు కేవలం 43.5 శాతం. 69.7 శాతం రైతు కుటుంబాలు వ్యవస్థీకత రుణాల ద్వారానే వ్యవసా యాన్ని చేస్తున్నాయి.. ఈ లెక్కలతో రుణమాఫీ ద్వారా లబ్ధిపొందేది కొన్ని కుటుంబాలేనని స్పష్టమవుతోంది. సంస్కృతిని పెంచి పోషిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల కారణంగా అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించాల్సిన నిధుల్లో కోతలు పెట్టడం పరిపాటిగా మారుతోంది.

దోపిడీదారులు దళారులే

దేశవ్యాప్తంగా నెలకొన్న వ్యవసాయ సంక్షోభంపై ఇండియన్ కౌన్సిల్ ఫర్ రిసెర్చ్ ఆన్ ఇంటర్నేషనల్ ఎకనామిక్స్ రిలేషన్స్ (ఐసీఆర్ఐ ఈఆర్)- ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో-ఆపరే షన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసిడీ) సంయు క్తంగా పరిశోధన చేశాయి. మధ్యవర్తుల కార ణంగా రైతుల ఉత్పత్తులకు మార్కెట్‌లో సరైన ధరలు రాకపోవడం ఆంక్షలతో కూడిన విధానాల వల్ల అంతర్జాతీయ మార్కెట్‌లకు ఉత్పత్తలను తరలించే అవకాశాలు దక్కడం లేదని ఐసీఆర్ఐ ఈఆర్- ఓఈసిడీ పరిశోధనలో తేలింది. దీంతో స్థూల వ్యవసాయ ఆదాయం ఏడాదికి 6 శాతం కంటే తక్కువ స్థాయికి పడిపోతుందని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితులను రైతును గట్టెక్కించేందుకు మోడీ ప్రభుత్వానికి మంచి అవకాశం లభించిందని.. మధ్యంతర బడ్జెట్‌లో రైతుకు ప్రకటించే తాయిలాలు మెజారిటీ రైతులకు చేయూతనిచ్చేలా ఉండాలని సూచిస్తున్నారు.

ఎన్నికల బదిలీలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాన కార్యదర్శులు (సీఎస్), రాష్ట్రాల ఎన్నికల అధికారులకు (సీఈఓ) సోమవారం లేఖ రాశారు. ఈ ఏడాది ఏప్రిల్, మేలో జరగనున్న సాధారణ ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్, అరుణాచలప్రదేశ్, సిక్కిం, ఒడిశా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ త్వరలోనే విడుదలకానుంది. ఈ నేపథ్యంలో పలు రాష్ట్రాల్లో బదిలీల ప్రక్రియను చేపట్టాలని అరోరా ఆ లేఖలో పేర్కొన్నారు. గతంలో ఎన్నికలు, ఉప ఎన్నికల నిర్వహణతో సంబంధం ఉన్న అధికారులతోపాటు ఈ ఏడాది మార్చి 31 వరకు ఒకే చోట మూడేళ్లపాటు పని చేసిన అధికారులకు స్థాన చలనం కల్పించాలని ఈసీ ఆదేశించింది. గతంలో ఎన్నికల నిర్వహణలో పాల్గొన్న అధికారులెవ్వరూ పాత స్థానాల్లో కొనసాగేందుకు ఆస్కారం లేదని ఈసీ స్పష్టం చేసింది. అలాంటి అధికారులను విధిగా ఇతర జిల్లాలకు బదిలీ చేయాలని సూచించింది. ప్రస్తుతం అధికారులెవరైనా సరే సొంత జిల్లాల్లో పని చేస్తూ, మార్చి 31నాటికి మూడేళ్లకాలం పూర్తయితే తప్పకుండా బదిలీ చేయాలని పేర్కొంది. ఈ విషయంలో ఆయా రాష్ట్రాల శాఖల అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఈసీ తెలిపింది.

2017 మార్చికి ముందు పని చేసినా..

ఎన్నికల నిర్వహణలో భాగంగా 2017 మార్చి 31కు ముందు ఒకే జిల్లా లేదా అసెంబ్లీ నియోజకవర్గంలో పని చేసిన అధికారులందరినీ బదిలీ చేయాల్సిందేనని ఈసీ స్పష్టం చేసింది. జిల్లా ఎన్నికల అధికారి (డీఈఓ), రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్ఓ), పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ (సీఐ), సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) ఆపై అధికారులు గతంలో పని చేస్తే ఎట్టి పరిస్థితిలోనూ వారిని మళ్లీ నియమించకూడదని తెలిపింది. అధికారుల బదిలీలు, పోస్టింగ్ విషయంలో ఈసీ ఆదేశాలను తప్పకుండా అమలు చేయాలని తెలిపింది. ఉప ఎన్నికల సమయంలో జిల్లాల్లో పని చేసిన వారికి సైతం మళ్లీ అదే జిల్లాలో పోస్టింగ్ ఇవ్వకూడదని పేర్కొంది. ఈ మొత్తం ప్రక్రియను వచ్చే నెలాఖరులోగా పూర్తిచేసి మార్చి మొదటి వారంలో నివేదిక సమర్పించాలని ఆయా రాష్ట్రాల సీఎస్, సీఈఓలను ఈసీ ఆదేశించింది.

అన్ని శాఖలకూ వర్తింపు

అధికారుల బదిలీలు అన్ని శాఖల్లోని వారికి వర్తిస్తాయని ఈసీ తెలిపింది. కేవలం ఎన్నికల విధులతో సంబంధం ఉన్న డీఈఓ, డిప్యూటీ డీఈఓ, ఆర్ఓ, ఏఆర్ఓ, ఈఆర్ఓ, ఏఈఆర్ఓతోపాటు గతంలో ఏదైనా ఎన్నికల నిర్వహణలో పాల్గొన్న అదనపు జిల్లా మేజిస్ట్రేట్ (ఏడీఎం), స్పెషల్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ (ఎస్‌డీఎం), డిప్యూటీ కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, తహసిల్దార్, ఎంపీడీఓ తదితరులకూ వర్తిందని తెలిపింది. పోలీసు శాఖలో ఐజీ, డీఐజీ, కమిషనర్లు, ఎస్‌పీ, సీనియర్ ఎస్పీ, అదనపు ఎస్పీ, డీఎస్పీ, స్టేషన్ హౌస్ ఆఫీసర్లను కూడా బదిలీ చేయాలని ఈసీ లేఖలో ఆదేశించింది. పోలీసుశాఖలో స్పెషల్ బ్రాంచ్, కంప్యూటరైజేషన్, శిక్షణ వంటి విభాగాలకు బదిలీల నుంచి మినహాయింపునిచ్చింది. సబ్ ఇన్‌స్పెక్టర్ ఆపైస్థాయి అధికారులకు సొంత జిల్లాల్లో ఎట్టి పరిస్థితిలోనూ పోస్టింగ్ ఇవ్వకూడదని ఆదేశించింది. మూడేళ్లపాటు ఒకే స్టేషన్ లేదా సబ్ డివిజన్‌లో పని చేసిన పోలీసు అధికారులను తప్పకుండా బదిలీ చేయాలని పేర్కొంది. చిన్న అసెంబ్లీ నియోజకవర్గాల్లో అలా సాధ్యపడకపోతే ఇతర జిల్లాలకు బదిలీ చేయాలని తెలిపింది.

డాక్టర్స్, ఇంజనీర్స్, టీచర్స్‌కు మినహాయింపు

ఎన్నికల బదిలీల నుంచి డాక్టర్లు, ఇంజనీర్లు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్‌కు ఈసీ మినహాయింపునిచ్చింది. ఎన్నికలతో సంబంధంలేని అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులపై ఫిర్యాదులు వస్తే, విచారణ అనంతరం నిర్ణయం తీసుకుంటామని ఈసీ స్పష్టం చేసింది.

ఆశ్రితుల కోసమే..

విశాలాంధ్ర బ్యూరో-తిరుపతి : రాష్ట్రంలో అవినీతి, లంచగొండితనం రాజ్యమేలుతోందని, ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులు ఇష్టానుసారం అవినీతికి పాల్పడుతున్నారని, ముఖ్యమంత్రి చంద్ర బాబు రాష్ట్రాన్ని గాలికొదిలేశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తీవ్రంగా విమర్శించారు. స్థానిక గంధమనేని శివయ్య భవన్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తన ఆశ్రితుల కోసం చంద్రబాబు కోట్లు కూడగట్టేందుకు తెగకష్టపడుతున్నారని, సామాన్య ప్రజలు ఆయనకు కనిపించడం లేదని అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజలను మరోసారి మభ్యపెట్టడానికి చంద్ర బాబు తాయిలాలు ప్రకటిస్తున్నారని విమర్శించారు. గొర్రెలకు బీమా... బర్రెలకు పేడ గంప అంటూ బీసీలపై ఎనలేని ప్రేమ ఒలకబోస్తున్నారని అన్నారు. పేదవాడికి రోజుకు 66 రూపాయలు ప్రకటించి... 66 కోట్లు పెద్దలకు కట్టబెట్టే పనిలో బాబు నిమగ్న మయ్యారనారు. 2014 ఎన్నికల్లో ఎమ్మెల్యేలు, మంత్రుల ఆస్తులు ఎంతో.. నేడు వారి ఆస్తులు ఎంతో బయట పెట్టాలన్నారు. వేలాది ఎకరాల భూములను పాలక పార్టీ నాయకులు కబ్జా చేశారని ఆరోపించారు. రాష్ట్రాన్ని చంద్రబాబు అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు. సీఎం నివాసానికి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న చింతమనేని...రోజుకు ఒకరిని చావకొడుతున్నా... అతనిని అదుపులో పెట్టే శక్తి బాబుకు లేకపోవడం దారుణమని రామకృష్ణ వ్యాఖ్యానించారు. చంద్రబాబు పాలనకు ఇదే నిదర్శనమని అన్నారు. కోటీశ్వరులకే చంద్రబాబు, మోడీ ఊడిగం చేస్తున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల ఫలితంగా దేశంలో పేద, ధనిక వర్గాల మధ్య తేడా పెరిగిపోయిందన్నారు. హైదరాబాద్‌లో వైద్యం చేయించుకున్న ఆంధ్రులకు ఆరోగ్య శ్రీ వర్తించకపోవడం దారుణమన్నారు. కోర్టులు చుట్టూ తిరుగుతున్న జగన్మోహన్‌రెడ్డికి ముఖ్యమంత్రి అయ్యే అర్హత లేదన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఏ ముఖం పెట్టు కొని బస్సు యాత్ర చేస్తారని రామకృష్ణ ప్రశ్నించారు. హోదాపై కన్నా వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగించాయన్నారు. బీజేపీ మేనిఫెస్టో 16వ పేజీలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని పొందుపరిచారని, దానిని గుర్తెరిగి మాట్లాడాల న్నారు. 2019 ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు తగిన బుద్ధి చెబుతామన్నారు. ఫిబ్రవరి ఒకటిన జరిగే రాష్ట్ర బంద్‌లో బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలను కలుపుకు పోతామన్నారు. రాష్ట్రంలో సీపీఐ, సీపీఎం, జనసేన కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తాయని పునరుద్ఘాటించారు. ప్రజలు సైతం మూడో ప్రత్యామ్నాయాన్ని ఆదరించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఫిబ్రవరి 15 నాటికి ఏ పార్టీ ఎన్ని స్థానాల్లో పోటీ చేయబోతున్నాయో ప్రకటిస్తామ న్నారు. ఫెడరల్ ఫ్రంట్‌లో కేవలం కేసీఆర్, జగన్ తప్ప మూడో వ్యక్తి లేడన్నారు. అది కేవలం మోడీకి 'బి' టీంగా పనిచేస్తుందన్నారు. సీపీఐ జిల్లా కార్య దర్శి ఎ.రామానాయుడు మాట్లాడుతూ హంద్రీనీవా, గాలేరు-నగరికి నీళ్లు వదిలేశాం పండగ చేసుకోండి అని ముఖ్యమంత్రి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల కోసం పుంగనూరు వరకు నీళ్లు వదిలి ప్రచార ఆర్భాటాలు చేయడం తగదన్నారు. భూములు కోల్పోయిన రైతులకు ఇప్పటి వరకు నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. అడవిపల్లి రిజర్వాయర్‌ను నింపాలని డిమాండు చేశారు. విలేకరుల సమావేశంలో సీపీఐ నేతలు చిన్నం పెంచలయ్య, నాగరాజన్, మురళి, రామచంద్రయ్య, విశ్వనాథ్ పాల్గొన్నారు.

వాతావరణంలో అనూహ్య మార్పులు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: వాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి. గత కొద్ది రోజులుగా తెలంగాణ రాష్ట్రంలో వాతావరణంలోని మార్పులకు నగర ప్రజలు అల్లాడుతున్నారు. ఒకవైపు చలి.. మరోవైపు వర్షం పడుతుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. ఉదయంపూట పొగమంచుతో పాటు వర్షం కురుస్తుండడంతో స్కూల్‌కి వెళ్లే విద్యార్థులు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఆదివారం ఉదయం నుండి రాత్రి వరకు తుంపర పడింది. సోమవారం కూడా అదే పరిస్థితి నెలకొంది. బంగాళాఖాతంతో పాటు హిందూ మహాసముద్రంలో అల్పపీడన ద్రోణి ఏర్పడింది. దీంతో నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో కూడా ఈ పరిస్థితి ఏర్పడింది. గడిచిన 24 గంటల్లో నగరంలో 10.1 వర్షపాతం నమోదైంది. రాత్రివేళల్లో 18.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా కిందకు పడిపోవడంతో రాత్రిపూట చలి ఎక్కువైంది. సాయంత్రంపూట బయటకు రావాలంటే జంకుతున్నారు. ఇక నగరంలో వాన పడుతుండడంతో జీహెచ్ఎంసీ అప్రమత్తం అయ్యింది.

దోబూచులాట...!

(మొదటిపేజీ తరువాయి)

మధ్యలో పోర్టు నిర్మాణంపై స్థానికుల నుంచి వ్యతిరేకత కూడా వస్తోంది. పోర్టు నిర్మాణానికి వ్యతిరేకంగా ఆ గ్రామాల్లో సమావేశాలు, ధర్నాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లాకు వచ్చిన సీఎం చంద్రబాబు రైతులు, మత్స్యకారులకు నష్టపరిహారం చెల్లించటంతోపాటు స్థానికులకు ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చారు. అంతేగాకుండా పోర్టుకు 2,050 ఎకరాలు సరిపోతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయినప్పటికీ, పోర్టుకు వ్యతిరేకంగా కలెక్టర్‌కు గతంలో ఎనిమిది వేల ఎకరాల వినతిపత్రాలు అందాయి. గతంలో హార్బర్ నిర్మాణ పనుల్లో సాంకేతిక లోపాల కారణంగా ఇసుక మేటలు వేయడంతో జెట్టీ సమీపంలో ఉత్తర, దక్షిణ గోడల నిర్మాణానికి రూ.కోటి వ్యయం నిరుపయోగమైంది. ఆ గోడలు నేడు శిథిలావస్థకు చేరుకున్నాయి.

పరిహారంపై మీమాంస

పోర్టు భూములకు పరిహారం చెల్లింపుపై మీమాంస నెలకొంది. భూ నిర్వాసితులకు 2015లో ప్రభుత్వం జారీ చేసిన జీఓ ప్రకారం పరిహారం చెల్లించేందుకు మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్ నాయుడు మత్స్యకారుల నేతలతో చర్చించారు. దీనిపై కొందరు విముఖత వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల విశాఖలోని గంగవరం మత్స్యకారుల పరిస్థితి దాపురించే అవకాశంలేకపోలేదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంశధార ప్రాజెక్టు నిర్వాసితులకు నిర్మించిన పునరావాస కాలనీలో నేటికీ కనీస సౌకర్యాలు కల్పించలేదు. ప్రభుత్వం చెబుతున్న జీవో నష్టదాయకమని వారు చెబుతున్నారు. పోర్టు నిర్మాణంకంటే ముందుగానే పునరావాస పనులు చేపట్టాలని, లేకుండా గ్రామాలను విడిచి వెళ్లేదిలేదని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. సీఎం ఇచ్చిన హామీ మేరకు స్థానికులకు ఉద్యోగాలివ్వాలని నిర్వాసితులు డిమాండు చేస్తున్నారు.

అదాని ప్రకటనపై గందరగోళం

ఉద్యోగాల కల్పన విషయంలో అదాని సంస్థ ప్రకటనపై స్థానికుల్లో గందరగోళం నెలకొంది. స్థానికులకు ఉద్యోగవకాశాలు కల్పించలేమని అదాని గ్రూపు ప్రతినిధులు స్పష్టం చేయటమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఇది చాలదన్నట్లుగా మధ్యవర్తులను రంగంలోకి దించేందుకు ఆ సంస్థ ప్రయత్నిస్తోందని పలువురు విమర్శిస్తున్నారు. పోర్టు వస్తే అన్ని సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయంటూ మధ్యవర్తుల ద్వారా అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. పునరావాసం కల్పించకుండా, ఉద్యోగాలు కల్పించకుండా, ఒకేసారి నష్టపరిహారం చెల్లించకుండా మధ్యవర్తులు గారడీ చేస్తున్నారని, దీనిని తాము ప్రతిఘటిస్తామని మత్స్యకార గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు.

ప్రజామోదం మేరకు పోర్టు నిర్మాణం



బాధిత గ్రామాల్లో ప్రజాభిప్రాయం సేకరణ చేయాలి. వారి ఆమోదం మేరకే పోర్టు నిర్మాణం చేపట్టాలి. తద్వారా ప్రజలకు నివాసాలతో పాటు ఉపాధి కల్పించాలి. ముఖ్యంగా మత్స్యకారులకు ఈ పోర్టు వలన తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఆ నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

- లండ దానేసు, భావనపాడు పోర్టు వ్యతిరేక ఏరియా కమిటీ అధ్యక్షుడు, దేవునల్తాడ

బాధితులకు న్యాయం చేయాల్సిందే



భావనపాడు - దేవునల్తాడ గ్రామాల మధ్య పోర్టు నిర్మాణం చేపడితే బాధితులకు న్యాయం చేయాలి. ఈ రెండు గ్రామాల్లో రెండు వేల మంది ఇళ్లు కోల్పోతారు. గ్రామాల్లోని మహిళలు పోర్టుకు వ్యతిరేకంగా ఉన్నారు. ప్రజల నిర్ణయం మేరకే పోర్టు నిర్మాణం చేయాలేగానీ, సొంత నిర్ణయం తీసుకోకూడదు.

- సీదిరి చిరంజీవులు, మాజీ సర్పంచ్, దేవునల్తాడ

ఉపాధి కల్పించాల్సిందే



భావనపాడు పోర్టు నిర్మాణం వల్ల నష్టపోయేది మత్స్యకారులే. వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ప్యాకేజీలు కూడా భారీ ఎత్తులో సమకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలి. నిరుద్యోగులకు పోర్టులో ఉద్యోగాలు కల్పించాలి.

- అల్లుపల్లి పోతయ్య, మాజీ సర్పంచ్, భావనపాడు

అందరికీ సంక్షేమం

(మొదటిపేజీ తరువాయి)

దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. ప్రత్యేక హెూదా సాధన సమితి ఫిబ్రవరి 1న బంద్‌కు పిలుపు నిచ్చిందని, దానికి ఇబ్బంది లేకుండా 2, 3, 4 తేదీలలో జన్మభూమి సమస్యల పరిష్కారానికి పూనుకోవాలని పరోక్షంగా బంద్‌కి సీఎం మద్దతు ప్రకటించారు. బీసీలు ఎప్పటి నుంచో అడుగుతున్నందున కొత్తగా 10 కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 31, 1 తేదీలలో ఫెతాయ్ తుఫాన్ నష్టం పరిశీలనకు కేంద్రం బృందం వస్తుందని, వారికి రంగుమారిన ధాన్యాన్ని, నష్టం ఫొటోలను చూపించాలన్నారు. హజ్ భవన్ నిర్మాణం కోసం అవసరమైన నిధుల్ని విడుదల చేయాలని ఆర్థిక శాఖ అధికారులకు సీఎం సూచన చేశారు. మంత్రి నారా లోకేష్ బృందం దావోస్ పర్యటనపై సమాచార శాఖ వీడియో లఘు చిత్రాన్ని ప్రదర్శించింది.సమావేశంలో సంక్షేమానికి సంబంధించి 9అంశాలపై ప్రధానంగా చర్చ జరిగింది. జన్మభూమిలో వచ్చిన ఫిర్యాదులను, చంద్రన్న బీమా, పెళ్లికానుక, ముఖ్యమంత్రి యువ నేస్తం పనితీరుని సమీక్షించారు. వీడియో సమావేశంలో ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్రపునేఠ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, శాఖాధిపతులు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

ప్రియాంకగాంధీ !

(మొదటిపేజీ తరువాయి)

రాజకీయాల్లోకి వచ్చిన ప్రియాంకకు తూర్పు యూపీ బాధ్యతలు ఇచ్చారు. అదనంగా తెలంగాణ కాంగ్రెస్ బాధ్యతలు కూడా ఇవ్వనున్నారనేది స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా కుంతియా ఉన్నారు. అయితే ఆయన పార్టీని సరిగ్గా డీల్ చేయలేకపోతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో అందరినీ ఒకతాటిపైకి తీసుకురాలేకపోయారని కుంతియాపై విమర్శలు ఉన్నాయి. కుంతియాను తప్పించాలని హైకమాండ్‌పై ఒత్తిడి తెస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో జరిగిన పొరపాట్లు పార్లమెంటు ఎన్నికల్లో రిపీట్ కాకుండా ఉండేందుకు కాంగ్రెస్ హైకమాండ్ దృష్టి సారించింది.

అమరావతి జర్నలిస్ట్ సొసైటీకి 30 ఎకరాలు

జీవో విడుదల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమరావతి అక్రిడేటెడ్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్‌కి 30 ఎకరాలను కేటాయిస్తూ సీఆర్‌డీఏ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్ సోమవారం జీవో 36ను విడుదల చేశారు. ఎకరం రూ.25లక్షల ధర చొప్పున వీటిని కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. కేటాయించిన స్థలంలో మూడేళ్లలోపు భవనసముదాయాల నిర్మా ణం పూర్తి చేయాలని పేర్కొన్నారు. స్థలం అప్పగించే సమయంలో నిబంధన లను పూర్తిగా పాటించే విధంగా ఏపీ సీఆర్‌డీఏ కమిషనర్ చర్యలు తీసుకోవాలని సూచించారు.

గృహ నిర్మాణాలకు స్థలం కేటాయించినందుకు సీఎంకి ధన్యవాదాలు: ఏపీయూడబ్ల్యూజే

అమరావతిలో జర్నలిస్ట్‌ల గృహనిర్మాణాల నిమిత్తం 30 ఎకరాలను కేటాయించినందుకు ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐవీ సుబ్బారావు, చందు జనార్ధన్‌లు సీఎం చంద్రబాబుకి ధన్యవాదాలు తెలిపారు. జర్నలిస్ట్‌ల గృహనిర్మాణాల నిమిత్తం స్థలం కేటాయించడం హర్షణీయమని ఐజేయూ ఉపాధ్య క్షులు అంబటి ఆంజనేయులు, ఏపీయూడబ్ల్యూజే ఉపాధ్యక్షులు కంచర్ల జయరాజ్, కృష్ణాజిల్లా అర్బన్ అధ్యక్ష కార్యదర్శులు చావా రవి, కొండా రాజేశ్వరరావు, విజయవాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు నిమ్మరాజు చలపతిరావు, ఆర్.వసంత్‌లు హర్షం వ్యక్తం చేశారు.

గడువులోగా పట్టణ పేదల ఇళ్లు పూర్తి

సీఎస్ అనిల్ చంద్ర పునేఠ ఆదేశం

విశాలాంధ్ర అమరావతి : నిర్దేశించిన గడువులోగా పట్టణ పేదల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠ ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలోని సీఎస్ కార్యాలయంలో సీఎస్ అధ్యక్షతన స్టేట్ లెవల్ శాంక్షన్, మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముందుగా రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై ఏపీ టిడ్కో ఎం.డి బీఎం దివాన్ మైదీన్ పవర పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న మున్సిపల్, కార్పొరేషన్లలో 10,15,663 ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా సీఎస్ అనిల్ చంద్ర పునేఠ మాట్లాడుతూ పేదోడి సొంతింటి కల నెరవేర్చాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకునేలా గడువులోగా ఇళ్ల నిర్మాణాలు స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన 1,05,956 ఇళ్లకు సంబంధించిన డీపీఆర్ లను సీఎస్ నేతృత్వంలోని స్టేట్ లెవల్ శాంక్షన్ మానిటరింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ డీపీఆర్ లను బుధవారం ఢిల్లీలో జరగబోయే సమావేశంలో కేంద్ర ప్రభుత్వ అధికారులకు అందచేసి అనుమతులు పొందనున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏపీ టిడ్కో ,ఫైనాన్స్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతన స్కేలు వర్తింపు హర్షణీయం: ఎమ్మెల్సీ కత్తి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్రంలో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులకు, ఉద్యోగస్తులకు కనీస వేతన స్కేలు వర్తింపు చేయడంపై ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రవిచంద్ర సోమవారం ఉత్తర్వులు జారీచేశారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కమిటీ సిఫార్సులపై గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ సానుకూల తీర్మానంతో ఉత్తర్వులు విడుదల చేశారని వివరించారు. ఈ ఉత్తర్వులను ఔట్‌సోర్సింగ్, ఒప్పంద ఉద్యోగులకు అమలుచేయాలని, దామాషాలో వేతనాలు పెంచాలని కోరారు. ఉద్యోగులకు హెచ్‌ఆర్ఏ, డీఏలను చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.

దశల వారీగా కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి : ఏపీజేఏసీ

రాష్ట్రంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను దశలవారీగా క్రమబద్ధీకరించాలని ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సంఘం జేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ సీహెచ్.జోసెఫ్ సుధీర్ బాబు, ఎన్.చంద్రశేఖరరెడ్డి ప్రభుత్వానికి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఒప్పంద ఉద్యోగులు, అధ్యాపకులకు కనీస వేతన స్కేలు వర్తింపు చేయడంపై హర్షం వ్యక్తంచేశారు. 2014 ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండు చేశారు.

గ్రామాల వృద్ధితోనే స్మార్ట్ ఏపీ

'స్మార్ట్ విలేజ్-స్మార్ట్ వార్డు' పురస్కార గ్రహీతలకు సీఎం సత్కారం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్రంలోని ప్రతి గ్రామం స్మార్ట్‌గా అభివృద్ధి చేసుకోవాలని సీఎం చంద్రబాబు కోరారు. కృష్ణాజిల్లా కొమరవోలు గ్రామంలో జరిగిన అభివృద్ధిని తాను స్వయంగా చూశానని, అదే స్ఫూర్తితో అన్ని గ్రామాల్లో అభివృద్ధి జరిగితే స్మార్ట్ ఆంధ్రప్రదేశ్ సాధ్యమేనని అభిప్రాయపడ్డారు. 'స్మార్ట్ ఆంధ్రప్రదేశ్ ఫౌండేషన్' ఎంపిక చేసిన అత్యుత్తమ 'స్మార్ట్ విలేజ్-స్మార్ట్ వార్డు' భాగస్వాములను ముఖ్యమంత్రి సోమవారం సాయంత్రం సచివాలయంలో ఘనంగా సత్కరించారు. ఇటీవల 'జన్మభూమి-మాఊరు కార్యక్రమం' సందర్భంగా రాష్ట్రస్థాయి పురస్కారాల కోసం సి. కుటుంబరావు, డాక్టర్ కెవిస్ జవహర్ రెడ్డి, డాక్టర్ బి. గంగయ్య సభ్యులుగా ఉన్న త్రిసభ్య కమిటీ 17 మంది అత్యుత్తమ 'స్మార్ట్ విలేజ్-స్మార్ట్ వార్డు' భాగస్వాముల్ని ఎంపిక చేసింది. వీరందరినీ అమరావతికి పిలిపించిన ముఖ్యమంత్రి కలెక్టర్ల సమావేశం చివర్లో ఘనంగా సత్కరించారు. వీరంతా వారు దత్తత తీసుకున్న గ్రామాలు, వార్డులలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి స్మార్ట్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమానికి స్ఫూర్తిదాయకంగా నిలిచారు. త్రిసభ్య కమిటీ ఎంపిక చేసిన 17 మంది 'స్మార్ట్'



భాగస్వాములలో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (నర్సింపల్లి), రాష్ట్రీయ సేవా సమితి (మమందుర్), ఎస్‌కె అబ్దుల్ అలీ (దీనదారుపల్లె), తోట నరసింహం (బూరుగుపూడి), నాట్కో ట్రస్టు (గొల్లంపూడిపాడు), ఆనంద్ కూచిభోట్ల (కూచిపూడి), టాటా ట్రస్ట్స్ (265 గ్రామ పంచాయతీలు), రామోజీ ఫౌండేషన్ (పెదపారుపూడి), మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డోకిపర్రు), ఎ. రవిక ృష్ణ (కప్పట్రాళ), ఎంపీ శివకుమార్‌రెడ్డి (పోలూరు), సెయంట్ టెక్నాలజీస్ (మోక్షగుండం), అరబిందో ఫార్మా (పెయ్యలపాలెం), దివీస్ లాబొరేటరీస్ (చిప్పాడ, మంతెన), శర్ధ మెటల్స్ అండ్ అల్లాయిస్ (కంటకపల్లి), విష్ణుప ఎడ్యుకేషనల్ సొసైటీ (కె. అన్నవరం), కే. విజయానంద్ (ఎస్.ఉప్పలపాడు) ఉన్నారు.

బీసీలపై చంద్రబాబుది మొసలికన్నీరు : పార్థసారథి

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: బీసీలపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు మొసలికన్నీళ్లు కారుస్తున్నారని వైసీపీ నాయకులు పార్థసారథి మండిపడ్డారు. నాలుగున్నర సంవత్సరాలు గుర్తుకు రాని బీసీలు ఎన్నికల ముందర గుర్తుకువచ్చారా అని ప్రశ్నించారు. అధికార పీఠం కోసమే తప్పితే బలహీన వర్గాల అభివృద్ధికి, మేలు కోసం కాదన్నారు. సోమవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ బలహీనవర్గాల యువతను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ పెడితే, చంద్రబాబు ప్రభుత్వంలో 30 శాతం కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందని పరిస్థితి ఉందన్నారు. రాబోయే రోజుల్లో నూటికి నూరు శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తాననే ఒక మాట కూడా చంద్రబాబు చెప్పడం లేదన్నారు. ఏపీపీఎస్సీ నియామకాల్లో బలహీనవర్గాలకు నష్టం కలిగే విధంగా నిబంధనలు ఉన్నాయని, దీనిపై కనీసం టీడీపీ ప్రభుత్వం ఆలోచన కూడా చేయలేదన్నారు. బీసీలకు తాయిలాలు ఇచ్చి వారి ఓట్లను కొల్లగొట్టాలనే ఆలోచన తప్పితే చంద్రబాబుకు మరో ఆలోచన లేదన్నారు.

19న బీసీ గర్జన:

వైసీపీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 19న ఆంధ్రప్రదేశ్‌లో బీసీ గర్జన నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆ పార్టీ బీసీ అధ్యయన కమిటీ చైర్మన్, బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీలంతా ఈ గర్జనకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

మార్చిలోగా ఎయిమ్స్ పూర్తి..!

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమరావతి రాజధాని పరిధిలోని మంగళగిరి దగ్గర నిర్మిస్తున్న ఎయిమ్స్ భవననిర్మాణ పనులను మార్చిలోగా పూర్తిచేసేందుకు కార్యాచరణ రూపొందించారు. విజయవాడ సిద్ధార్థ వైద్యకళాశాలలోని ఎయిమ్స్ తాత్కాలిక భవన సముదాయంలో సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎయిమ్స్(మంగళగిరి) ప్రెసిడెంట్ డాక్టర్ టీఎస్ రవికుమార్, డైరెక్టర్ డాక్టర్ ముకేష్ త్రిపాఠి, అకాడమిక్ ఆధ్వర్యంలో వివిధ అంశాలపై చర్చించారు. ఎయిమ్స్ భవన నిర్మాణ పనులతోపాటు వైద్యవిద్యార్థులకు ఆటల పోటీలు, సెమినార్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సర విద్యార్థుల కోసం సిద్ధార్థ వైద్యకళాశాలల్లో ఫిబ్రవరి 27నుంచి మార్చి 1వ తేదీ వరకు వివిధ అంశాల్లో పోటీలు ఏర్పాటు చేస్తామని ప్రెసిడెంట్ రవికుమార్ చెప్పారు. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా వైద్యవిద్యార్థులు హాజరవుతారని తెలిపారు. సైకాలజీ, బయో కెమిస్ట్రీ అంశాలపై సెమినార్లు నిర్వహించి విద్యార్థులను చైతన్యవంతుల్ని చేస్తామన్నారు. ఎయిమ్స్‌లో బోధనా సిబ్బంది అమలుకు చర్యలు తీసుకుంటున్నామని, మొత్తంగా 36మందిని నియమించామని పేర్కొన్నారు. అటానమి-9, బయోకెమిస్ట్రీ-9, సైకాలజీ-8, కమ్యూనిటీ అండ్ ఫ్యామిలీ మెడిసిన్-10మంది ఉన్నారని వివరించారు. 2018-19 విద్యా సంవత్సరంలో ఎయిమ్స్ నిర్వహించిన వివిధ కార్యక్రమాలను వెల్లడించారు. ఈ సమావేశానికి ఎయిమ్స్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి శర్మదీప్ సిన్హా వివిధ విభాగాల హెచ్‌వోడీలు డాక్టర్ జోయ్ ఎ.ఘోషల్, డీన్, డాక్టర్ రాకేష్ కక్కర్, డాక్టర్ దేశాయ్ విద్యా శ్రీపాది, సైకాలజీ డాక్టర్ ఆముదరాజ్, హెచ్‌ఓడీలు హాజరయ్యారు.

సాహితీ చరిత్రలో 'కొవ్వలి'కి సుస్థిరస్థానం

మండలి బుద్ధప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: సాహిత్య చరిత్రలో ప్రముఖ నవలా రచయిత కొవ్వలి లక్ష్మీ నరసింహారావు సుస్థిరస్థానం సంపాదించుకున్నారని ఏపీ శాసనసభ ఉపసభాపతి డాక్టరు మండలి బుద్ధప్రసాద్ ప్రశంసించారు. విజయవాడలో కొవ్వలి రాసిన నవలను సోమవారం ఆవిష్కరించారు. ఈ నవలా ఆయన రచించిన వెయ్యవ నవల కావడం విశేషం. కార్యక్రమానికి సీనియర్ పాత్రికేయులు, పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తెలుగు పాఠకుల్లో పఠనాశక్తిని పెంచిన మహోన్నత వ్యక్తి లక్ష్మీ నరసింహారావు అని కొనియాడారు. మధ్యతరగతి మహిళల్లో పుస్తకపఠనాశక్తిని పెంచడంతోపాటు వ్యవహారిక భాషను వ్యాప్తిలోకి తెచ్చారని చెప్పారు. ఈ నవలను ఆవిష్కరించే అవకాశం రావడం తన పూర్వజన్మ సుకృతంగా పేర్కొన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు మాట్లాడుతూ చిన్ననాటి నుంచి కొవ్వలి రచించిన నవలలు చదవా



న్నారు. సుమారు మూడువందలకు పైగా ఆయన రాసిన నవలలను చదివానని పేర్కొన్నారు. కొవ్వలి నవల్లో విజ్ఞానం, వికాసం, వినోదం ఉండేవని గుర్తు చేశారు. కొవ్వలి రచించిన నవలలను ప్రతిఒక్కరూ చదవాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. తొలుత కొవ్వలి లక్ష్మీనరసింహారావు దంపతుల చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కిన్నెర ఆర్ట్స్ థియేటర్ కార్యదర్శి మద్దాళి రఘురామ్, ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు మంజులూరి కృష్ణకుమారి, అమరావతి పబ్లికేషన్స్ ప్రతినిధి వల్లూరి శివప్రసాద్, కొవ్వలి కుటుంబసభ్యులు కొవ్వలి నాగేశ్వరరావు, కొవ్వలి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

ఏపీడబ్ల్యుజేఎఫ్ రాష్ట్రమహాసభల ప్రారంభోత్సవంలో మంత్రి అమరనాథరెడ్డి

విశాలాంధ్ర - తిరుపతి : జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి సొంతింటి కలనూ నెరవేర్చేందుకు కృషిచేస్తున్నామని రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి ఎన్ అమరనాధరెడ్డి ఉద్ఘాటించారు. జర్నలిస్టుల సమస్యలన్నింటినీ తప్పకుండా ముఖ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యుజెఎఫ్) రాష్ట్ర 4వ మహాసభలు తిరుపతిలో సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. తొలుత ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని గాంధీవిగ్రహం నుంచి మహాసభల వేదికైన రామతులసి కళ్యాణమండపం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రారంభసభకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి అమర నాధరెడ్డి మాట్లాడుతూ వాస్తవాలను నిర్భయంగా ప్రజలకు చేరవేస్తున్నది మీడియా, జర్నలిస్టులేనని తెలిపారు . సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల్ని పరిష్కరించేందుకు ప్రభుత్వాలు మరింత చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధనకోసం



ఐక్యంగా ఉద్యమించాలని చెప్పారు.ఏపీడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే సుగుణమ్మ, తిరుపతి మాజీ ఎంపీ వరప్రసాద్, తుడా చైర్మన్ నరసింహయాదవ్, ప్రముఖ డాక్టర్ రాళ్లపల్లి సుధారాణి, ఏపీడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరమేశ్వరరావు, అలయెన్స్ ఆఫ్ జర్న లిస్ట్ (నాజ్) అధ్యక్షులు ఎస్కే పాండే, ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, కార్యదర్శి చంద్రకాంత్, తెలంగాణా జర్న లిస్ట్ ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, బసవ పున్న య్య, కాంగ్రెస్‌నేత తులసిరెడ్డి, చిత్తూరు జిల్లా టీడిపి అధ్యక్షులు పులివర్తినాని, నగరి నియోజకవర్గ టీడీపీఇన్ చార్జి భానుప్రకాష్, సీపీఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి రామానాయుడు, ఏపీడబ్ల్యుజెఎఫ్ శాంతిగోపి తదితరులు పాల్గొన్నారు.

'సబ్‌ప్లాన్ నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలి'

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ఎస్సీ,ఎస్టీలకు సబ్‌ప్లాన్ చట్టంప్రకారం కేటాయించిన నిధులు, ఖర్చులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.మాల్యాద్రి డిమాండు చేశారు. ఈ మేరకు సోమవారం తాడేపల్లిలోని సాంఘిక సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రావత్‌కు ఆయన వితినపత్రాన్ని అందజేశారు.రాష్ట్రంలో దళిత, గిరిజనులపై దాడులులు కొనసాగుతున్నప్పటికీ..వాటి నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టట్లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు జి.నటరాజ్, ఎం.శ్రీనివాసరావు, జి.క్రాంతికుమార్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లు

విశాలాంధ్ర అమరావతి : రానున్న సాధారణ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ పునేఠా తెలిపారు. సోమవారం కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ సునీల్ అరోర నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సీఎస్ 2019 సాధారణ ఎన్నికలకు సంబంధించి చేపడుతున్న చర్యలు వివరించారు. ముందుగా కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ సునీల్ అరోర మాట్లాడుతూ 2019 సాధారణ ఎన్నికలను ప్రశాంతంగా సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలని అన్ని రాష్ట్రాల సీఎస్, డీజీపీలను ఆదేశించారు. సరిహద్దు రాష్ట్రాలకు సంబంధించి శాంతిభద్రతలు, ఇతర అంశాలపై సమీక్షించేందుకు వెంటనే సరిహద్దు రాష్ట్రాల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించాలని, ఎన్నికల్లో డబ్బు పంపిణీని తీవ్రమైన నేరంగా పరిగణించి అలాంటి ఘటనలు జరగకుండా నివారించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మీడియాలో వచ్చే పెయిడ్ న్యూస్ అంశంపై సకాలంలో చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర,జిల్లా స్థాయిల్లో ఏర్పాటు చేసిన మీడియా కోఆర్డినేషన్ కమిటీలు సక్రమంగా పనిచేసేలా చూడాలని, ఎన్నికల నిర్వహణకు అవసరమైన అధికారులు,సిబ్బంది నియామకంపై ప్రత్యేక దృష్టిపెట్టి తగిన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అంతేగాక ఎన్నికల ఏర్పాట్లపై రాష్ట్ర స్థాయిలో వెంటనే సంబంధిత శాఖలతో సమావేశం నిర్వహించాలని సీఎస్‌లను కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ సునీల్ అరోర ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించి సున్నిత, అతిసున్నిత, కుల,మత పరమైన ప్రభావతంతో అల్లర్లు జరిగేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలకు ముందుగానే ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈవీడియో సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠ మాట్లాడుతూ 2019 సాధారణ ఎన్నికలను సక్రమంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అవసర మైన అన్ని చర్యలు తీసుకోనుందని వివరించారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయానికి అవసరమైన అధికారులు, ఉద్యోగులను ఇప్పటికే నియమించగా మరి కొంతమంది అవసరమని కోరారని వారిని కూడా వారం రోజుల్లో ఇస్తామన్నారు. శాంతభద్రతలు నిర్వహణపై మాట్లాడుతూ గత సాధారణ ఎన్నికల్లో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు, ఇతర సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 293 కంపెనీల కేంద్ర బలగాలను వినియోగించామని, ఈసారి 350 కంపెనీలు అవసరం ఉంటుందని వివరించారు. ఎన్నికలకు సంబంధించి 14 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని సమీక్షించి త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు పునేఠ వివరించారు. ఎన్నికల్లో మద్యం పంపిణీ తదితర అక్రమాలను నివారించేందుకు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో 29 శాశ్వత చెక్ పోస్టులు, 19సరిహద్దు మొబైల్ పార్టీలు పనిచేస్తున్నాయని వాటిని మరింత పటిష్టంగా పనిచేసేలా చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. వీడియో సమావేశంలో రాష్ట్ర డీజీపీ ఆర్పీ ఠాకూర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంతర్ రాష్ట్ర సహరిద్దు కోఆర్డినేషన్‌పై సమీక్షించేందుకు ఫిబ్రవరి 5న తిరుపతిలో 5సరిహద్దు రాష్ట్రాల పోలీస్,తదితర శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసినట్టు డీజీపీ వివరించారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి గోపాలకృష్ణ ద్వివేది మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణపై ప్రజల నుంచి కొన్ని ఫిర్యాదులు అందాయని వాటిని పరిశీలించి సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. 1950 కాల్ సెంటర్ విజయవంతంగా పని చేస్తోందని వెల్లడించారు. రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి.సాంబశివరావు, శాంతిభద్రతలు అదనపు డీజీ రవిశంకర్, ఎక్సైజ్ శాఖ కమీషనర్ లక్ష్మీ నర్సింహ, అధికారులు పాల్గొన్నారు.

బీసీ నేతలతో జగన్ భేటీ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఎన్నికలకు ముందే ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ వేడి మొదలయ్యింది. పార్టీలన్నీ రెండు నెలల ముందు నుంచే ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ బహిరంగ సభలతో దూసుకుపోతుంటే.. జనసేన కూడా జిల్లాలవారీగా సభలు నిర్వహిస్తోంది. ఇక పాదయాత్ర తర్వాత కాస్త బ్రేక్ ఇచ్చిన వైసీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నాయకుడు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఫిబ్రవరి నుంచి ప్రజా క్షేత్రంలోకి వెళ్లాలని నిర్ణయించారు. ముందుగా టీడీపీ 'జయహో బీసీ' సదస్సు నిర్వహించిన నేపథ్యంలో సోమవారం పార్టీ కేంద్ర కార్యాలయం లోటస్‌పాండ్‌లో జగన్మోహన్‌రెడ్డి పార్టీకి చెందిన సీనియర్ నాయకులు, బీసీ నాయకులతో సమావేశమై బీసీ అధ్యాయన కమిటీపై చర్చించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం బీసీలను ఐదేళ్లలో ఎలా మోసం చేసిందో సమీక్షించారు. వైసీపీ బీసీల కోసం ఏం చేస్తుందో ప్రజలకు తెలియజేయాలని, చంద్రబాబు విధానాలను ఎండగట్టాలని అధినేత పార్టీ నాయకులకు సూచించారు. వైసీపీ అధికారంలోకి రాగానే ప్రతి కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆర్థికంగా చేయూతనందించేందుకు జగన్ ఇదివరకే నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అలాగే బీసీలకు ఇంకా ఏం చేయాలనే అంశంపై ఇప్పటికే బీసీ అధ్యాయన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి



బీసీల స్థితిగతులపై అధ్యాయనం చేసి, ఈ నివేదికను అధినేతకు అందజేశారు. అధ్యాయన కమిటీ ద్వారా వెలుగు చూసిన విషయాలపై పార్టీ నేతలతో జగన్ ఈ సందర్భంగా చర్చించారు. ఫిబ్రవరి 19వ తేదీన పెద్ద ఎత్తున బీసీ గర్జన సదస్సు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఏలూరు వేదికగా గర్జనను నిర్వహించి, టీడీపీకి కౌంటర్ ఇవ్వాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, పార్థసారథి, జంగా కృష్ణమూర్తి, జోగి రమేష్, పిల్లి సుభాష్ చంద్రబోస్, మోపిదేవి వెంకటరమణతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

టీడీపీలోకి 'కోట్ల' కుటుంబం

కర్నూలు జిల్లాలో మారనున్న రాజకీయ పరిణామాలు

విశాలాంధ్ర బ్యూరో కర్నూలు : మాజీ ముఖ్యమంత్రి తనయుడు, మాజీకేంద్ర మంత్రి కోట్ల జయ సూర్యప్రకాష్‌రెడ్డి సోమవారం సీఎం చంద్రబాబు సమక్షంలో ఆయన సతీమణి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, తనయుడు కోట్ల రాఘవేంద్రరెడ్డిలతో కలసి టీడీపీలో చేరారు. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి కర్నూలు జిల్లా పరిషత్ చైర్మెన్‌గా,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రెండుసార్లు ముఖ్యమంత్రిగా, కేంద్ర న్యాయశాఖ మంత్రిగా పనిచేశారు. ఆయన తనయుడు కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి కర్నూలు ఎంపీగా మూడుసార్లు విజయం సాధించడమే కాకుండా రైల్వేశాఖ సహాయమంత్రిగా పనిచేశారు. కోట్ల సుజాతమ్మ డోన్ నుంచి 2004 ఎమ్మెల్యేగా విజయం సాధించింది. జిల్లాలో కోట్ల కుటుంబానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. 2014 ఎన్నికలలో కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి ఎంపీగా, సుజాతమ్మ ఆలూరు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఇరువురు ఓటమిపాలైయ్యారు. మూడేళ్లపాటు సూర్యప్రకాష్‌రెడ్డి, సుజాతమ్మలు సొంత ఊర్లో వ్యవసాయంపై దృష్టిసారించారు. జిల్లా టీడీపీలో పెద్దదిక్కుగా ఉన్న కేఈ కృష్ణమూర్తి కుటుంబానికి, కోట్ల కుటుంబానికి నాలుగు దశాబ్దాల రాజకీయ వైరం ఉంది. కర్నూలు పార్లమెంట్‌తోపాటు ,డోన్ నియోజకవర్గంలో దాదాపు అన్ని మండలాల్లో ఇరువురికి పార్టీలకు అతీతంగా కోట్ల, కేఈ వర్గాలుగా గ్రూపులు ఉన్నాయి. మొదట కోట్ల ,కేఈ కుటుంబాలు ఒకే పార్టీలో ఉండేవారు. రాష్ట్రంలో టీడీపీ ఆవిర్భావం తర్వాత కేఈ కుటుంబం టీడీపీలో చేరింది. నాటి నుంచి కోట్ల - కేఈ వర్గాలు ఎవరికి వారుగా తమ ఆధిపత్యం కోసం పోటీపడుతున్నాయి. కేఈ కుటుంబం టీడీపీలో చేరిపోవడంతో డోన్ నుండి కేఈ ప్రభాకర్ పోటీ చేసి కోట్ల హర్షవర్ధన్‌రెడ్డిపై విజయం సాధించారు. కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి టీడీపీ చేరికతో కర్నూలు పార్లమెంట్, డోన్, ఆలూరు సీటుపై కొంత రాజకీయ గందరగోళం నెలకొనే అవకాశం ఉంది. గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా కర్నూలు నుంచి విజయం సాధించిన బుట్టారేణుక టీడీపీలో చేరిపోయారు. 2019 ఎన్నికలలో ఎంపీగా తనకు అవకాశం ఇవ్వాలని ఆమె సీఎం వద్ద హామీ కూడా పొందింది. అయితే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి టీడీపీలో చేరడంతో కర్నూలు ఎంపీ సీటు పై సందిగ్ధం నెలకొంది. ఒక వేళ కోట్లకు కర్నూలు సీటు ఇచ్చేందుకు సీఎం అంగీకరిస్తే బుట్టారేణుకు సీఎం కర్నూలు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే స్థానాల్లో ఏదో ఒకదానిలో ఆమెకు అవకాశం కల్పించాల్సి ఉంది. దీంతో సిట్టింగ్‌ల పరిస్థితి ఏమిటనేది ప్రశార్థకంగా మారింది. ఎమ్మిగనూరు సిట్టింగ్ ఎమ్మెల్యే మంత్రాలయం నియోజకవర్గం సీటు కేటా యించే అవకాశాలు ఉన్నాయంటు పుకార్లు వస్తున్నాయి. సుజాతమ్మ చేరికతో డోన్, ఆలూరు సీట్లు ఆశించే అవకాశం ఉండటంతో అక్కడ గత ఎన్నికల అనంతరం ఇన్‌చార్జి బాధ్యతలు వహిస్తూ నియోజకవర్గంలోని ప్రజలతో మమేకమైన డోన్ ఇన్‌చార్జి కేఈ ప్రతాప్, ఆలూరు ఇన్‌చార్జి వీరభద్రగౌడ్‌ల పరిస్థితిపై సందిగ్ధం నెలకొంది. కోట్ల చేరికతో టీడీపీ బలం పెరుగుతుందని కొందరు టీడీపీ కార్యకర్తలు అం టుండగా, మరి కొందరు నష్టం వాటిల్లుతుంద న్నారు. ఈ విష యంపై టీడీపీ జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాత్రం చంద్రబాబు నిర్ణ యం మేరకు పని చేస్తామన్నారు.



కోట్ల టీడీపీ చేరికపై ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తిని సంప్రదిం చిన తరువాతనే చంద్రబాబు నిర్ణయం తీసుకున్నట్లు వారు చెబుతున్నారు. ఉప ముఖ్యమంత్రి గతంలో మీడి యాతో మాట్లాడుతూ కోట్ల కుటుంబం టీడీపీలో చేరికను స్వాగతిస్తామన్నారు. జిల్లాలో కోట్ల అనుచర వర్గం అంతా కాంగ్రెస్‌పార్టీకి రాజీనామ చేసి టీడీపీలో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కోట్ల సోదరుడు కోట్ల హర్షవర్ధనరెడ్డి శనివారం కోడుమూరులో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి వైసీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. జిల్లాలో కాంగ్రెస్‌పార్టీకి పెద్దదిక్కుగా ఉన్నకోట్ల కుటుంబంలో ఒకరు టీడీపీ, మరోకరు వైసీపీలో చేరడంతో జిల్లాలో కాంగ్రెస్‌పార్టీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

సంపాదకీయం

కార్మిక హక్కుల పరిరక్షణకు ఐఎల్‌ఓ విజ్ఞప్తి

ఎన్నో పోరాటాల ద్వారా కార్మికులు సాధించుకున్న హక్కులను హరించడానికి పాలకులు దుస్సాహసానికి ఒడిగట్టి నట్లయితే వీరు కార్మికుల ఆగ్రహజ్వాలలకు భస్మీపటలం కాక తప్పదు. చరిత్రచాటిన సత్యమిది. కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తూ వారి హక్కులను కాలరాచేందుకు ప్రయత్నించిన ప్రభుత్వాలేవీ బతికి బట్టకట్టలేదు. కొన్నేళ్లుగా భారత్‌తో సహా ప్రపంచంలోని పలు దేశాల్లో ప్రభుత్వాలు కార్పొరేట్ అనుకూల, కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ వారి హక్కులను హరించేందుకు పూనుకున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. అందుకే నూతన కార్మిక రక్షణలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) ప్రపంచ దేశాల ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసింది. అధునాతన పని ప్రదేశాల్లో మారుతున్న స్వభావం, డిమాండ్లు తీర్చడానికి ప్రపంచ దేశాల ప్రభుత్వాలు చట్టాలు రూపొందించి, నిబద్ధతను ప్రకటించాలని ఐఎల్‌ఓ డిమాండు చేస్తున్నది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను చర్చించడానికి ప్రపంచ పాలకవర్గ కోటీశ్వర ప్రతినిధులు దావోస్ (స్విట్జర్లాండ్)లో సమావేశమైన సందర్భంగా ఈ డిమాండ్లు వెలువడ్డాయి. దావోస్‌లో కీలక పెట్టుబడి దారులు విస్తృతంగా వాయిదా వేసే ప్రపంచ ఆర్థిక సమస్యలకు కొన్ని సూచనలను ఆశించిన విధంగానే ఐఎల్‌ఓ నివేదిక ప్రతిపాదించింది. సంస్థ శతవార్షికోత్సవ గౌరవార్థం ఐఎల్‌ఓ ఈ నెల్లో ఒక నివేదిక విడుదల చేసింది. ఒక ప్రత్యేక కమిషన్ ఏడాదిన్నర పాటు కృషిచేసి పది ప్రధానమైన సిఫార్సులు చేసింది. "ప్రాథమిక కార్మిక హక్కులు, తగినంత జీవన వేతనం, పనిగంటలపై పరిమితులు, సురక్షిత, ఆరోగ్యవంతమైన పని ప్రదేశాలు పరిరక్షణకు సార్వజనీన కార్మిక హామీ" వీటిలో ప్రధానమైన సిఫార్సు. అయితే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రభుత్వం దీనిపై శ్రద్ధ వహిస్తుందా? అన్నది వేరే విషయం. ఐఎల్‌ఓ నివేదికలు, వాటి ఒప్పందాలకు, ఒడంబడికలకు చట్టబద్ధత ఏమీ ఉండదు. ఇది దురదృష్టకరం. ఐఎల్‌ఓలో వాణిజ్య, ప్రభుత్వ, కార్మిక ప్రతినిధులు సహా పలువురు ఆ సంస్థ బాధ్యులుగా ఉంటారు. ఆ విధంగా దాని సిఫార్సులు, నివేదికలు కార్పొరేట్ ప్రభావానికి లోనుకావడానికి లేదా నీరుగార్చడానికి అనువుగా ఉంటాయి. నిర్దిష్ట దేశాలకు నిర్దిష్ట ప్రమాణాలను రూపొందించడానికి నివేదిక నిరాకరించింది. యూరోపియన్ యూనియన్‌లో అనేకమంది అధికారికంగా గుర్తించిన కఠినమైన కార్మిక ప్రమాణాలు, వేతనాల పెంపుదలకు అమెరికాలో విజయవంతంగా పెరుగుతున్న " 15 డాలర్లు, ఒక యూనియన్ " ఉద్యమానికి ఇది పరస్పర విరుద్ధం. ఐఎల్‌ఓ ఒప్పందంపై తమ ప్రభుత్వాలు సంతకాలు చేసి, వాటిని గౌరవించని అనేక అభివృద్ధి చెందుతున్న దేశాల్లో విశృంఖలంగా ఉన్న దోపిడీకి గురవుతున్న కార్మికులకు కూడా ఇది విరుద్ధం. ఐఎల్‌ఓ ఒప్పందాలను గౌరవించడానికి బదులు ఆయా ప్రభుత్వాలు బహుళజాతి సంస్థల తరపున కార్మికులు, కార్మిక సంఘాలను అణచివేసి వేతనాలను ప్రత్యేకించి శ్రామిక మహిళల వేతనాలను చాలా తక్కువగా వుంచి, వారి పని పరిస్థితులను ప్రమాదకరంగా తయారు చేశాయి.

నిరంతర ప్రపంచాభివృద్ధికి ప్రత్యేకించి శాంతియుత అభివృద్ధికి కార్మికులకు సంక్షేమం కల్పించేట్లు చూడటం పూర్తిగా అవసరమని దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా, స్వీడన్ ప్రధానమంత్రి స్టీఫెన్ లోఫ్వేన్ సహ అధ్యక్షత వహించిన పని భవిష్యత్తుపై సంస్థ గ్లోబల్ కమిషన్ ఇప్పటికీ కార్మికులపట్ల దృఢంగా నిలబడింది. "శ్రామికుల జీవన నాణ్యత మెరుగుపడటానికి, ఎంపిక విస్తరణ, లింగ అంతర సమాధికి, ప్రపంచ అసమానతలు సృష్టించిన నష్టాలను తల్లకిందులు చేయడానికి మన ముందు లెక్కలేనన్ని అవకాశాలు వున్నాయి. అయినప్పటికీ వీటిలో ఏ ఒక్కటీ వాటంతట అవి జరగవు. ఎట్టి నిర్ణయాత్మక చర్య తీసుకోకుండా ప్రస్తుత మున్న అసమానతలు, అనిశ్చితులను విస్తృతపరిచే ప్రపంచంలోకి మనం నిద్రలో నడుస్తున్నాము" అని ఐఎల్‌ఓ నివేదిక హెచ్చరించింది. "దేశాలలోపల, వాటిమధ్య కార్యక్రమాలను, భాగస్వామ్యాలను, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ప్రపంచ సమాజం మరింత సమానం అయ్యేట్లు చూసే విధంగా నివేదిక ఉద్దీపనం చేయాలి" అని కూడా రమఫోసా వక్కాణించారు. నివేదిక కార్మికులహక్కులను ధృవీకరిస్తూనే, గమనించదగిన ఒక ముఖ్యమైన అంశాన్ని విస్మరించింది. అది సమ్మెహక్కు, అది అమెరికాలో అరుదైనదిగా మారింది. ప్రతి పది కాంట్రాక్టులలో ఒక యాజమాన్య లాకౌట్ జరుగుతోందని, కార్మికులు విధిలేక సమ్మెకు నెట్టబడుతున్నారని తాజా ప్రభుత్వ (ట్రంప్) గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అయినప్పటికీ, సంఘంగా ఏర్పడటానికి కార్మికులకు స్వేచ్ఛ సమష్టి బేరసారహక్కు వుండాలని, ప్రభుత్వాలు ఆ విధంగా హామీ యివ్వాలని ఐఎల్‌ఓ స్పష్టం చేసింది. ప్రపంచంలోని అధిక దేశాల్లో వాటిలో ఏ ఒక్కటీ కూడా ఆచరణలో నోచుకోకపోవడం గర్హనీయం. అమెరికాలో ఇటీవల ఉపాధ్యాయుల సమ్మెలు ప్రజా మద్దతుతో విజయవంతమయ్యాయి. ఫ్రాన్స్‌లో సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. దీంతో అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్ గ్యాస్ ట్యాక్స్ పెంపుదలను ఉపసహరించుకోక తప్పలేదు. సమాన పనికి సమాన వేతనంతో సహా "స్త్రీ-పురుష సమానత్వం" కొరకు చట్టాన్ని రూపొందించి, అమలు జరపాలని కూడా ఐఎల్‌ఓ విజ్ఞప్తి చేసింది. ఐఎల్‌ఓ నివేదికలోని ముఖ్యాంశాలు ప్రపంచ దేశాల్లోని ప్రజలందరికీ వర్తిస్తాయని నివేదికను రూపొందించిన ఇద్దరిలో ఒకరైన ఐఎల్‌ఓ డైరెక్టర్ జనరల్ గై రైడర్ ఉద్ఘాటించారు. ఐఎల్‌ఓ నివేదికలోని సిఫార్సులను ప్రపంచ వ్యాపితంగా అన్ని దేశాలు చిత్తశుద్ధితో అమలుపర్చి కార్మికుల హక్కులను పరిరక్షించి, వారి సంక్షేమానికి కృషి చేయవలసిన అవసరం ఉంది.

చురక

పేద ప్రజల పక్షమంటు
ప్రధాని మాట జోరు
ఐతేనేమి పేదరికం
ఆకాశానికెగిరే తీరు

సంపదను కాపాడే
చౌకిదారు నంటాడు
సంపన్నులు కొల్లగొడితే
సద్దుమణిగి ఉంటాడు

– వేల్పుల నారాయణ

విశ్లేషణ

నాజీ గోబెల్స్ అడుగుల్లో కాషాయ పరివారం!

ఎం కోటేశ్వరరావు

ఘనుడై నరేంద్రమోడీ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత 2014 జూన్ నుంచి 2018 సెప్టెంబరు వరకు మన దేశ స్వదేశీ, విదేశీ అప్పు మొత్తం 54,90,763 కోట్ల నుంచి 82,03,253 కోట్లకు పెరిగిందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వివరాల మేరకు మీడియాలో వార్తలు వచ్చాయి. వీటి మీద సామాజిక మాధ్యమం ఫేస్‌బుక్‌లోని ఒక గ్రూప్ చర్చలో పాల్గొన్న మోడీ, బీజేపీ అభిమానులు, కార్యకర్తల స్పందన గమనిస్తే దానిని ప్రత్యక్షంగా చూసేందుకు హిట్లర్ ప్రచార మంత్రి జోసెఫ్ గోబెల్స్ కుల సంఘాలు ఆమోదిస్తే హిందూత్వ తాలిబాన్ కుటుంబాలలో ఎక్కడో అక్కడ పుట్టేందుకు ప్రయత్నిస్తాడు. అయితే తెలిసీ అలాంటి వాడిని కనేందుకు ఏ తల్లీ అంగీకరించదు కనుక టెస్ట్ ట్యూబ్ జీవిగా పుట్టేందుకు ఒక మట్టి కుండను సరఫరా చేయమని ఆంధ్రవిశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ నాగేశ్వరరావుకు ఈ పాటికి గోబెల్స్ వర్తమానం పంపే వుంటాడు.

ప్రభుత్వ రుణ వార్తను ఇచ్చిన ఒక మీడియా సంస్థను, వార్త కటింగ్‌ను ఫేస్‌బుక్‌లో షేర్ చేసిన వ్యక్తి ఒక అప్పుకు పుట్టిన వారు కాదని, అప్పులన్నీ హాజ్‌యాత్రకోసం చేసినవని, కాంగ్రెస్‌వారు 54లక్షల కోట్లు అప్పులు చేసి మోడీకి అప్పగిస్తే నాలుగున్నరేండ్లలో 32లక్షల కోట్ల వడ్డీ అయిందని, ఇండియా అప్పుకు, మోడీ చేసిన అప్పుకు తేడా తెలియదని, ఎల్లో మీడియా ఫేక్ న్యూస్ నమ్మవద్దని, అది అప్పుకాదు మోడీ మిగిల్చిన మొత్తం అంటూ విరుచుకుపడ్డారు.తెలివి తేటలు కలిగిన ఇంకొందరు గతంలో యుపిఏ హయాంలో చేసిన అప్పు కంటే మోడీ చేసిన అప్పు తక్కువ శాతం అంటూ సమర్థనకు పూనుకున్నారు. బూతులు తిట్టేవారి కంటే వీరు కొంత నయం. వీటిని చూస్తుంటే జర్మనీలో నాజీలు, హిట్లర్ ప్రచారం అక్కడి సమాజం మీద ఎలాంటి ప్రభావం కలిగించిందో ప్రత్యక్షంగా అర్థం అవుతోంది. 1897లో పుట్టిన గోబెల్స్ 'ఆంగ్లేయుల నాయకత్వ రహస్యం ప్రత్యేకించిన కొన్ని తెలివితేటల మీద ఆధారపడలేదు. అది మూర్ఖ సూక్ష్మబుద్ధి మీద ఆధారపడిందంటే ఆశ్చర్యం కాదు. ఎవరైనా అబద్ధం చెప్పదలచుకుంటే అది పెద్దదై వుండాలి, దానికే కట్టుబడి వుండాలి, దానిని కొనసాగించాలి.అది అపహాస్యంగా కనిపిస్తున్నా సరే దానికే కట్టుబడి వుండాలి' అని ఒక రచనలో పేర్కొంటాడు. దానిని మరింతగా అభివృద్ధి చేసి ఒక అబద్దాన్ని వందసార్లు చెబితే నిజం అవుతుంది. చివరకు తొలిసారి అబద్ధం చెప్పిన వాడు కూడా ఒక దశలో నిజమే అని నమ్మే విధంగా తయారవుతాడు అని నిరూపించాడు.

అప్పులు చేయటం సరైనదా కాదా అన్నది ఒక అంశం. అత్యంత ధనిక దేశం అమెరికా నుంచి దాన్ని తలదన్నేందుకు ప్రయత్నిస్తున్న చైనా వరకు అన్ని దేశాలు అప్పులు చేస్తున్నాయి. మన దేశం అందుకు మినహాయింపు కాదు. కేంద్రంగానీ, రాష్ట్రాలు గానీ, అది కాంగ్రెస్ లేదా బీజేపీ అయినా ఎవరైనా చేస్తున్నది అదే. ప్రతి ఏటా బడ్జెట్‌లో గతంలో ఉన్న అప్పులు తీర్చేందుకు, వాటికి అసలు, వడ్డీ కోసం కేటాయింపులు చేస్తారు. లోటు బడ్జెట్‌ను పూడ్చుకొనేందుకు కొత్త అప్పులు చేస్తారు. మోడీ సర్కార్ సగటున ఏటా ఆరులక్షల కోట్ల మేరకు అప్పు చేస్తున్నది.ఈ ఏడాది అంటే 2019 మార్చి నెలాఖరు లోపు కేంద్ర ప్రభుత్వ లోటు అంచనా 6.24లక్షల కోట్ల రూపాయలు. అయితే ఆర్థిక సంవత్సరం తొలి ఎనిమిది నెలలకే 7.17 కోట్లకు చేరింది. అంటే ప్రపంచబ్యాంకు పరిభాషలో చెప్పాలంటే ఆర్థిక కట్టుబాటును ఉల్లంఘించటమే. ఈ లోటును పూడ్చుకొనేందుకు అప్పు చేయాలి లేదా నోట్ల ముద్రణకు పాల్పడాలి. ఇంతకు మించి మరొక ప్రత్యామ్నాయం లేదు ఈ వాస్తవం మోడీ భక్తులకు తెలియదా లేక తెలిసినా వాస్తవాన్ని అంగీకరించేందుకు నిరాకరిస్తూ ఎదురుదాడికి పాల్పడుతున్నారా? వైఫల్యాలను కప్పి పుచ్చుకొనే క్రమంలో ఎదురుదాడి ఒక పద్దతి.

నరేంద్రమోడీకి లేనిదాన్ని ఆపాదించేందుకు ఆయన నియమించుకున్న యంత్రాంగం అనేక అవాస్తవాలను ప్రచారంలో పెట్టింది. ఇక్కడే అసలు సమస్య మొదలైంది. పెట్టుబడులు తెచ్చేందుకే మోడీ విదేశీ ప్రయాణాలు చేశారు. నరేంద్ర మోడీ సర్కార్ అసలు అప్పులు చేయలేదు, ప్రపంచ బ్యాంకు నుంచి ఎలాంటి అప్పులు తీసుకోలేదు. కాంగ్రెస్ పాలనా కాలంలో చేసిన అప్పులన్నీ తీర్చాడు. ఇంకా ఇలాంటి ఎన్నో అతిశయోక్తులను మోడీకి ఆపాదించారు. వీరాభి అభిమానులు వాటన్నింటినీ నమ్మారు కనుకనే సామాజిక మాధ్యమంలో స్పందన అలా అదుపు తప్పింది. మోడీ విశ్వసనీయత ఎలా తయారైందంటే ఆయనే స్వయంగా తన ప్రభుత్వం అప్పులు చేసిందని నిజం చెప్పినా అంగీకరించే స్థితి లేదు. మూకోన్మాదం అంటే ఇదేనా? గోబెల్స్ చెప్పినదానికి అనుగుణ్యంగానే బీజేపీ నేతల తీరు తెన్నులున్నాయి. ఒక బీజేపీని ఓడించటానికి అన్ని పార్టీలు ఏకమౌతున్నాయి. నేను కాపలాదారుగా పహారా కాస్తుంటే దేశాన్ని లూటీ చేసిన వారంతా ఏకమౌతున్నారు. ఇలాంటి వ్యాఖ్యానాలు చేస్తున్నది సాక్షాత్తూ ప్రధాని నరేంద్ర మోడీ, ఆయన భజన బృందం. తెలంగాణాలో అన్ని స్థానాలకు పోటీ చేస్తున్న ఏకైక పార్టీ మాది, అధికారం మాదే. మీడియా, జనం పగలబడి నవ్వుతున్నా గల్లీ నుంచి ఢిల్లీ నేతల వరకు ఎన్నికల ప్రచారంలో చెప్పింది అదే. వారికా ధైర్యం, అంతటి తెలివి తేటలు ఎక్కడి నుంచి వచ్చాయి అంటే గోబెల్స్ చెప్పిన అంశమే. అతని ఉపదేశాన్ని మరింత నవీకరిస్తూ పక్కాగా అమలు జరుపుతున్నది హిట్లర్, గోబెల్స్ భావజాలం, ప్రచార పద్ధతులను అరువు తెచ్చుకున్న కాషాయ పరివారం, వారితో ఏదో ఒక దశలో స్నేహం చేసిన, చేస్తున్న వారు అంటే ఎవరికైనా కోపం వస్తే చేయగలిగిందేమీ లేదు.

ఈ రోజు దేశంలో బీజేపీ నాయకత్వంలోని ఎన్‌డిఏ కూటమిలో 40కి పైగా చిన్నా పెద్ద పార్టీలు వున్నాయి. బీజేపీని ఓడించటానికి అన్ని పార్టీలు ఏకమౌతున్నాయని చెప్పటం గోబెల్స్ ప్రచారం కాదా? ఎన్‌డిఏ పేరుతో ఉన్నది తమ పార్టీ ఒక్కటే అని చెప్పమనండి. కాపలాదారుగా నరేంద్రమోడీ సక్రమంగా విధి నిర్వహిస్తే విజయ మాల్యా, నీరవ్ మోడీ వంటి వేల కోట్ల రూపాయలను ఎగవేసిన వారు దేశం వదలి ఎలా పోయారు. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని ఎగవేసిన వారు, నిధులను దారి మళ్లించిన వారు గత నాలుగు సంవత్సరాలలో ఇబ్బడి ముబ్బడిగా ఎలా పెరిగారు? కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన అప్పులని చెబుతున్న వాటిలో కొన్ని లక్షల కోట్లను రాని బాకీల కింద రద్దు ఖాతాలో రాసిన వారెవరు? వసూలు చేయకుండా అడ్డుపడ్డదెవరు? తీసుకున్న రుణాల వాయిదాల చెల్లింపులో విఫలమైన ప్రతి రుణఖాతా రుణ వ్యవధిని బట్టి నిరర్ధక ఆస్తి అవుతుంది. అలాంటప్పుడు కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన అప్పులు తమ హయాంలో ఇచ్చిన వాటిని వేరు చేసి తమ ఘనత, కాంగ్రెస్ కాలంలో ఇచ్చిన వాటి బండారాన్ని ఎందుకు బయటపెట్టరు.

అబద్దం ఆడదలచుకుంటే అది పెద్దదై ఉండాలన్న బ్రిటీష్ కుటిల నీతిని ప్రదర్శించింది సాక్షాత్తూ నరేంద్రమోడీయే. పెద్ద నోట్ల రద్దు లక్ష్యాలు, నల్లధనం గురించి చెప్పింది పెద్ద అబద్ధం కాదా? జనం ఏమనుకున్నా అదే అబద్దానికి కట్టుబడి ఉండాలి, నోరు విప్పకూడదు అన్నదానికి నరేంద్రమోడీ నోట్ల రద్దు గురించి 'కట్టుబడి' ఉన్నారా లేదా ? ఏండ్లు గడుస్తున్నా దానిమీద ఒక్క మాటైనా మాట్లాడారా? ఎంత నిబద్దత! తాను నోరు విప్పకపోవటమే కాదు, రిజర్వు బ్యాంకు నోరు కూడా మూయించారా లేదా? ఎన్నికలకు ముందు విదేశాల్లో నల్లధనం గురించి మాట్లాడిందేమిటి? తరువాత అసలు నోరు విప్పారా? గోబెల్స్ చెప్పిందానికి కట్టుబడి ఉన్నారా లేదా ? ఎవరేమనుకుంటే మాకేటి సిగ్గు అన్నట్లుగా ఉండాలన్నాడు గోబెల్స్. కుహనా సైన్సు గురించి చెప్పిన మాటలను ప్రపంచం అపహాస్యం చేస్తున్నా ఎవరైనా మానుకున్నారా? వేదాల్లో అన్నీ ఉన్నాయని అని చెప్పేవారి సంఖ్య తగ్గలేదు, చెప్పేవారు మరింత పెరిగారు. తలకాయలూపే వారు ఇబ్బడి ముబ్బడి అయ్యారా లేదా ! పురాతన కాలంలో మనకు ప్లాస్టిక్ సర్జరీ నుంచి విమానాలు, టెస్ట్ ట్యూబ్‌బేబీల నుంచి ఖండాంతర నియంత్రిత క్షిపణులు మన దగ్గర ఉన్నాయంటే నిజమే అని నమ్మేవారు తయారయ్యారా లేదా ? వినాయకుడికి ప్లాస్టిక్ సర్జరీ గురించి ప్రధాని మోడీ స్వయంగా చెప్పిన తరువాత ఆయన కటాక్ష వీక్షణాల కోసం పరితపించే వారు కొందరైతే, నిజంగా నమ్మే కొందరు అలాంటి ప్రచారాలు చేస్తున్నారు.

ఉపాధి గురించి తాము చేసిన వాగ్దానాలను అమలు జరిపానని మోడీ నమ్మబలుకుతున్నారు. ఇదొక పెద్ద అబద్దం. దాన్నుంచి బయట పడలేరు, వాస్తవాన్ని అంగీకరించలేరు. ఆవులను కాయటం కూడా ఉద్యోగమే అని బీజేపీ త్రిపుర ముఖ్యమంత్రి సెలవిచ్చాడు. పకోడీలు అమ్మేవారు రోజుకు రెండువందల రూపాయలు సంపాదిస్తున్నారు. ఇదికూడా ఉద్యోగ కల్పనే అని నరేంద్రమోడీ చెప్పిన తరువాత అనుచరులు మరింతగా రెచ్చిపోతారని వేరే చెప్పాలా? గతేడాది జూలై 21న ప్రధాని మోడీ లోక్‌సభలో ఉపాధి గురించి చెప్పిన అంశాలేమిటో చూద్దాం. గతేడాది కాలంలో కోటికి పైగా ఉద్యోగాలు (ఉపాధి) కల్పించాం. 2017సెప్టెంబరు 2018 మే మాసాల మధ్య ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ(ఇపిఎఫ్‌ఓ)లో 45లక్షల మంది నూతన చందాదారులుగా చేరారు. ఇదే కాలంలో నూతన పెన్షన్ స్కీములో 5.68లక్షల మంది నూతన ఖాతాదారులుగా చేరారు. కేవలం తొమ్మిదినెలలో ఈ రెండు పథకాల్లో చేరిన వారి సంఖ్య 50లక్షలు దాటుతుంది. పన్నెండు నెలల్లో 70లక్షలు దాటవచ్చు. ఇంజనీర్లు, డాక్టర్లు, లాయర్ల వంటివారు మరో ఆరులక్షల మంది వృత్తిలో చేరి వుంటారు. గతేడాది దేశంలో 7.6లక్షల వాణిజ్య వాహనాల విక్రయం జరిగింది. నాలుగోవంతు పనిలోంచి తొలగినా 5.7లక్షల వాహనాలు నికరంగా వుంటాయి. ఒక్కొక్కదాని మీద ఇద్దరు పని చేసినా 11.4లక్షల మందికి ఉపాధి కల్పించినట్లు కాదా అంటూ ప్రతిపక్షాలను మోడీ తనవాదనా పటిమతో ప్రశ్నించారు. స్వరాజ్య అనే ఆర్‌ఎస్‌ఎస్‌వారు నడిపే పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తమ ప్రభుత్వం ఎన్నో ఉద్యోగాలు కల్పించినా దాన్ని సాధికారికంగా చెప్పేందుకు అవసరమైన సమాచారం లేదని పేర్కొన్నారు. ఇదొక పెద్ద అబద్దం

నీతి అయోగ్ ఉపాధ్యక్షుడు అరవింద్ పనగారియా ఆధ్వర్యంలో ఉపాధి కల్పన సమాచారం మీద ఒక నివేదిక తయారు చేశారు. ఉద్యోగ కల్పన దృశ్యం కలతపరిచేదిగా కనిపించటంతో దాన్ని పక్కన పెట్టేశారు. అయినా ముఖ్యమంత్రిగా ఎంతో అనుభవం ఉండి, నాలుగున్నర సంవత్సరాలు ప్రధాని పదవిలో ఉన్న పెద్దమనిషి ఉద్యోగాల సమాచారం లేదని చెప్పటం సిగ్గుపడాల్సిందిగా ఉంది కదా! కార్మికశాఖ 2016-17 సంవత్సరానికి తయారు చేసిన నివేదికను కూడా ప్రభుత్వం తొక్కి పెట్టిందని చెబుతున్నారు. దొరికిందేదో చేయక కోరిన ఉద్యోగం రాలేదని ఖాళీగా వున్న వారిని నిరుద్యోగులుగా లెక్కించకూడదని మానవ వనరుల శాఖ మంత్రి ప్రకాష్ జవదేవకర్ సెలవిచ్చారు. నిజమే రాజకీయ నిరుద్యోగులకు అది వర్తిస్తుంది. పదవులేమీ ఇవ్వకపోయినా అధికారపార్టీ తనలో చేరిన వారం దరికీ కండువాలు కప్పి మందలో కలిపేసుకుంటే అలాంటి వారు ఏమి చేస్తున్నారో ఎలా సంపాదించుకుంటున్నారో చూస్తున్నాము. కానీ ఉపాధి విషయంలో అలా కుదరదే. కొత్తగా ఎవరైనా పకోడి బండి పెట్టుకుంటే ఉన్న తమకే బేరాల్లేకపోతే నువ్వొకడివా అంటూ గుర్రుగా చూసే పరిస్థితి. జవదేవకర్ నిర్వచనం ప్రకారం ఆవుల పెంపకం, పకోడీ బండి, టీ ఫ్లాస్కులు తీసుకొని రోడ్డెక్కటానికి అవకాశం లేని వారందరినీ నిరుద్యోగులుగా లెక్కించటానికి లేదు. దేశంలో నిరుద్యోగులు 2018 డిసెంబరులో 7.4శాతానికి పెరిగారు. జనవరి ఆరవ తేదీ నాటికి 30రోజు సగటు నిరుద్యోగుల సంఖ్య 7.8శాతానికి పెరిగింది. డిసెంబరులో మొత్తం ఉపాధి పొందుతున్నవారి సంఖ్య 3.97కోట్లు, అదే 2017 డిసెంబరులో వున్నవారితో పోల్చితే 1.1 కోట్లు తక్కువ. తాను చెప్పిన దానిని ఎలాంటి జంక గొంకు లేకుండా పాటిస్తున్న వారిని చూసి గోబెల్స్ ముసిముసి నవ్వులు నవ్వుతూనే ఉంటాడు.

భారతీయ విజ్ఞానానికి పునర్వైభవం సాధ్యమేనా?

అలేఖ్య

భారతీయ నాగరికత ఒక అనంతమైన విజ్ఞాన స్రవంతి. ఎన్నో నిగూఢమైన రహస్యాలను తనలో ఇముడ్చుకున్న జీవనాడిలాంటి మన సంస్కృతి, సంప్రదాయాల వెనుకనున్న శాస్త్రీయ మూలను ఛేదించాల్సి ఉంది. వీటి వెనుకున్న హేతుబద్ధమైన రహస్యాలను కనుగొనలేక ఎవరికి తోచిన రీతిలో వారు తప్పుదారిలో వీటిని విశ్లేషించడం వల్ల నిజమైన రహస్యాలు ఇంకా మరుగునే ఉండిపోయాయి. మనదేశంలోని అత్యున్నత విద్యాలయాలేవి మన దేశ విజ్ఞాన సంపదపై పరిశోధనలు చెయ్యకపోవటం విచారకరం. ఏవో ఒకటి రెండు విశ్వవిద్యాలయాలు తప్ప, మనదేశంలోని విశ్వవిద్యాలయాలేవీ భారతీయ తత్వశాస్త్ర, పురాతన విజ్ఞాన శాస్త్రం, సంస్కృతి సంప్రదాయాలపై బోధన చేస్తున్న దాఖ లాలు కూడా లేవు. ఒకరకంగా చెప్పాలంటే మన దేశీయ విజ్ఞాన వ్యవస్థలో ఉదాసీనత, నిర్లక్ష్యం, ద్వేష భావాలే అధికం. దీనికంతటికీ కారణం ఎక్కువ కాలం మనదేశం వలసవాదుల ఏలుబడిలో ఉండటం వల్ల వారి వారసత్వ లక్షణాలు మన సంస్కృతికి అంటుకున్నాయి.

సంప్రదాయ భారతీయ విజ్ఞానం అని చెప్పబడే మనదేశ చరిత్ర, ఖగోళశాస్త్రం, వైద్య విధానాల్లో నిజాలు కన్నా అసత్యా లే ఎక్కువగా కానవస్తాయి. మనదేశంలోని ఎంతోమంది విద్యావేత్తలు, మేధావులు, శాస్త్రవేత్తలు ఈ నిజాన్ని ఒప్పు కోవటమే కాక, నిజమైన విజ్ఞానం పశ్చిమ దేశాలదే అనికూడా పునరుద్ఘాటించారు. వివేకానందుడంతటి మహాశయుడే, ప్రపంచానికి కావలసింది "భారతీయ విలువలు, పాశ్చాత్య విజ్ఞానం" అని నిర్మోహమాటంగా చెప్పారు. ఉదాహరణకు మనదేశానికి మాత్రమే సొంతమైన ఆయుర్వేదాన్ని అభ్యసించే విద్యార్థులకు ఆయుర్వేదం కన్నా అల్లోపతి లేదా ఆధునిక వైద్య పద్ధతుల గురించే ఎక్కువగా చెపుతూ ఉంటారు. కానీ ఆధునిక వైద్యశాస్త్రం అభ్యసించే విద్యార్థులకెక్కడా ఆయుర్వేదం గురించి బోధించిన దాఖలాలు లేవు.

మనదేశంలో బోధించబడుతున్న తత్వశాస్త్రతం, మనస్తత్వ శాస్త్రం మన వారసత్వం సంపద అని గర్విస్తాం. కాని నిజానికివి ఐరోపా దేశాల నుంచి దిగుమతి చేసుకున్నవే. రాజకీయ నాయకులకు కాని, రాజనీతి శాస్త్రతం అభ్యసించే విద్యార్థులకుగాని మన పురాతన దేశంలో ఆచరణలో ఉన్న రాజకీయ వ్యవస్థ గురించి అక్షరంముక్క కూడా తెలియదు. అందుకనే ప్రముఖ స్వాతంత్ర్య యోధుడు కె.ఎం.మున్షి, 1946లో ఒక ఉపన్యాసంలో, "మన భారతీయ సంస్కృతి ఏనాడో చచ్చి శవమైందని మనదేశంలోని ఆధునిక విద్యా వ్యవస్థ యొక్క దురభిప్రాయం" అని మన విద్యా వ్యవస్థను ఘాటుగా విమర్శించారు. ఆయన మాటల్లో ఏ మాత్రం అసత్యాలు లేవు, ఎందుకంటే కేవలం పాశ్చ్యాత్తులను అనుకరించటం ద్వారానే మనదేశంలో ఒక కొత్త సంస్కృతి తీసుకురావచ్చని, నేటి ఆధునిక విద్యావేత్తలు భావిస్తుండటమే. వీళ్ళెవరూ కూడా మన సంస్కృతి, సంప్రదాయ మూలాలను వెతికి పట్టుకుని వాటికి పునర్వైభవం తీసుకురావాలనే ఆలోచన మాత్రం చెయ్యరు.

వేదకాలం నుండి కూడా మనదేశంలో శాస్త్రాలు, విజ్ఞానం కేవలం ఉన్నత కుటుంబాల కోసమో, అగ్రవర్ణాల కోసమో నిర్దేశించబడ్డాయి తప్ప, కిందిస్థాయి వర్గాల వారికి వీటి ఫలాలు అందకుండా చేశారు. కొన్ని వర్గాల వారు విజ్ఞాన సర్వస్వాన్ని తమ వారసత్వ సంపదగా భావిస్తూ, వాటిని మిగిలిన వర్గాల వారికి అందకుండా చెయ్యటం వల్ల ఆ వర్గాల్లో మన సంప్రదాయ విజ్ఞానంపై ద్వేషభావం నెలకొన్నది. వేదాలు, ధర్మశాస్త్రాలను తక్కువ కులాల వారు ముట్టుకోకూడదు, చదవకూడదని ఆంక్షలు పెట్టి కుల ప్రాతిపదికన విజ్ఞాన సమాజాన్ని నిలువునా చీల్చారు. కేవలం కొందరి చేతుల్లోనే భారతీయ విజ్ఞానం నలిగిపోతుందనే భావనకు దూరంగా మన సమాజంలోని వివిధ వర్గాలు తమకు నచ్చిన విధంగా వీటిని ఉపయోగిస్తుండటం కొసమెరుపు. వేదాల్లో చెప్పబడ్డ దేవాలయాల నిర్మాణం, శిల్పకళ, వాస్తు వంటివి ఒక వర్గం వారు నేర్చుకుని వేదాలను నిర్వచించిన వారికన్నా గొప్ప గుర్తింపు పొందారు. శూద్రులైనప్పటికీ సంస్కృతంలో ఉన్న నిర్మాణ రహస్యాలను ప్రాంతీయ భాషల్లోకి అనువదించి అగ్రవర్ణాల కన్నా గొప్పని నిరూపించారు.

వైద్యం, వ్యవసాయం, వృక్షశాస్త్రం, నీటి నిర్వహణ, గృహ నిర్మాణం వంటి ఎన్నో శాస్త్రాలను అవి ఆచరించి చూపించే కింది తరగతి వర్గాల వారే నిర్వచించారు. మనిషి జీవితానికి ఉపయోగపడే విజ్ఞాన శాస్త్రాలను తక్కువ వర్ణాల వారే రచించారు. కాని అగ్రవర్ణాల వారు కారు. మంత్రాలు, పూజలు, పంచాంగం అంటూ మనిషిని నియంత్రించటానికి ఉపయోగపడే శాస్త్రాలను అగ్రవర్ణాల వారు తెరమీదకు తీసుకొచ్చారు. మానవ జీవనానికి ఉపయోగపడే లోక పరంపర గొప్పదా లేక మనిషిని నియంత్రించే శాస్త్రాలు గొప్పవా అంటే? మొదటిదే అని సమాధానం రావాలి. కాని దురదృష్టవశాత్తు రెండవ వాటికే మన సమాజం పెద్దపీట వేసి తన బలహీనతను చాటుకున్నది. శాస్త్రాలు తమ గొప్పతనాన్ని చాటుకోవటానికి లోకపరంపరను వెలుగులోకి రాకుండా అడ్డుకున్నాయి. కాని ఒకటి మాత్రం నిజం. శాస్త్రాలు లేకపోయినా పరవాలేదు. కాని వృత్తివిద్యలు లేకుండా మనిషి బతకలేడు. ఈ నిజాన్ని గ్రహించి శాస్త్రాలు, వృత్తివిద్యల మధ్య వంతెనను నిర్మించగలిగితే భారతీయ సంస్కృతి మరింత గొప్పగా వెలుగొందుతుంది.

ఆయుర్వేదం వంటి వైద్య శాస్త్రానికి కావల్సిన ఔషధ మొక్కలను సంపాదించాలంటే గిరిజనుల సహకారం తప్పనిసరి. అదేవిధంగా సాహిత్యం కాని, కళగాని కేవలం అర్థంపర్థంలేని భావాలతో ఒకవర్గంలోనే మిగిలిపోతే వాటికి వన్నెరాదు. ప్రాంతీయ ప్రజల జీవనాన్ని అవి ప్రతిబింబించినప్పుడే సమాజంలో గుర్తింపు తెచ్చుకుంటాయి. మహాభారత, రామాయణాల్లాంటి గొప్ప గొప్ప ఇతిహాసాల్లో సైతం నృత్య, సంగీత, వాస్తు నిర్మాణాలకు పెద్దపీట వేశారు. ఒకసారి అరవిందుడు తన తమ్ముడ్ని ఉద్దేశించి ఉత్తరం వ్రాస్తూ, మనదేశం యొక్క బలహీనత ఏదన్నా ఉందంటే, అది ధర్మం, నీతి, న్యాయం లోపించటం కాదు, పేదరికం అసలే కాదు, కేవలం ఆలోచనా శక్తి లోపించి, అజ్ఞానంలో బతకటం మాత్రమే అని మన సమాజంలోని లోపాన్ని ఎత్తి చూపారు.

సమాజంలోని వారెవ్వరూ అజ్ఞానంలో మిగిలిపోవాలనుకోరు. వివక్షతల కారణంగా హక్కులకు దూరమై అజ్ఞానులుగా మిగిలిపోతున్నారు. వేదాలలో మానవ జీవితానికి సంబంధించి గొప్పగొప్ప రహస్యాలను మన పూర్వీకులు పొందుపరిచారు. కాని వీటి రహస్యాలు సామాన్యులకు అందుబాటులోకొస్తే, ఆధిపత్య ధోరణికి అడ్డుపడుతుందనే భయంతో, తామొక్కరే వాటి ఫలాలను ఆస్వాదించాలనే స్వార్థంతో వీటిని దూరం చేశారు. తక్కువ కులాల్లో పుట్టిన వేదవ్యాసుడు భారతాన్ని సొంతం అన్నట్లు కొంతకాలం పాటు సామాన్యుల దరిచేరకుండా చేశారు. గిరిజనుడైన వాల్మీకి రామాయణాన్ని రాస్తే అందులోని కథానాయకుడైన రాముడు అగ్రవర్ణానికి చెందినవాడని, అతని బంటు హనుమ దళితుడనేకు సంస్కారులు. మన సమాజంలో వాల్మీకి గొప్పతనాన్ని ఎవరు గుర్తిస్తారు.

మట్టికుండలు చెయ్యటం ఏ శాస్త్రాలలో చెప్పబడలేదు. విత్తనాలు నాటి పంట పండించటం ఏ పురాణాలలో వివరించలేదు. తల్లి కడుపులో మంచి బిడ్డను బయటకు తీయటం ఏ ఇతిహాసంలో వ్రాయలేదు. మనిషి తన అవసరాలకు అనుగుణంగా తానే తన నుదిటి రాతను రాసుకోవటం మొదలుపెట్టాడు. అది బ్రహ్మరాతకన్నా గొప్పది. కాని దురదృష్టవశాత్తు ఆ రాతలు వ్రాయటం నేరమని భయపెడుతోంది సమాజం.

మన సమాజంలో కొత్తగా ఆలోచించే వారిని వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. ఒకవేళ ఆలోచించటం మొదలుపెట్టినా వాడ్ని ఈ సమాజం ఏదో నేరం చేస్తున్నట్టు నిరుత్సాహపరుస్తూ, అవహేళన చేస్తుంది. దీనికి కారణం ఆధిపత్య ధోరణులు ఎక్కడ బీటలు వారుతాయో అని భయం. సంప్రదాయానికి విరుద్ధంగా ఆలోచిస్తే ప్రకృతి ఆగ్రహిస్తుందని ప్రజలలో బలంగా నాటటంతో ఆలోచనా రహిత సమాజం నేడు మనచుట్టూ నెలకొని ఉంది. అందుకనే శతాబ్దాల తరబడిగా మనదేశం నుండి ఏ నూతన ఆవిష్కరణ జనించలేదు.

దీనికి కారణం మన విజ్ఞాన శాస్త్రం కొంతమందికే పరిమితమనే ఆలోచనా చట్రంలో ఇరుక్కోవటమే. మన విజ్ఞాన శాస్త్రం ఏ ఒక్క కులానికో, వర్గానికో పరిమితం కాదు, అది అన్ని వర్గాలకు చెందినది. అన్ని వర్గాలు కలిసి అభివృద్ధిపరిచినది. విమానాలు తయారు చెయ్యటం గురించి, మర మనుషులను సృష్టించటం గురించి అటు అగ్రవర్ణాలు కాని, ఇటు శూద్రులనబడే తక్కువ కులాల వారు కాని చెప్పలేదు. కాని వీళ్ళు మన భారతీయ సమాజానికి కావాల్సిన భౌతిక, ఆధ్యాత్మిక, నైతిక, ధార్మిక, సౌందర్యకారక అంశాలన్నిటినీ మనకు వివరించారు. వాటిని ఆధారంగా చేసుకుని కొత్త ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు చేపట్టినట్లైతే, పాశ్చాత్య దేశాలతో సమానంగా మన విజ్ఞాన వ్యవస్థ వెలుగొందుతుంది.

కొసమెరుపు ఏమిటంటే భారతీయ విజ్ఞాన వ్యవస్థ ఎందుకూ పనికిరాదని కాలదన్ని పాశ్చాత్య దేశాలకు ఎగిరిపోతున్నది అగ్రవర్ణాల వారే. ఇప్పటికే భారతీయ విజ్ఞాన శాస్త్రాలకాడి మోస్తున్నది తక్కువ కులాల వారే అనే విషయం మరువకూడదు.

ఇ-మెయిల్

ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్టా? ఓట్లు కొనే బడ్జెట్టా?

న్యాయంగా అయితే అధికారాంతంలో, ఎన్నికల ముందు ప్రభుత్వం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌నే పార్లమెంటులో ప్రవేశపెట్టాలి. పూర్తిస్థాయి బడ్జెట్ రూపురేఖల్ని ప్రజామోదం పొంది రాబోయే తదుపరి ప్రభుత్వం చేతిలో పెట్టాలి.అందాకా తాత్కాలిక రొటీన్ జమా ఖర్చుల కోసం తాత్కాలిక బడ్జెట్‌నే ప్రవేశపెట్టడం విధాయకం. అయితే ఆ సంప్రదాయాన్ని తూచా తప్పకుండా పాటించినట్లు చరిత్ర గొప్పగా ఏమీ లేదు. కొన్నికొన్ని అతిక్రమణలు జరిగి ఉన్నాయి అటు ఎన్డీయే పాలనలోనూ, ఇటు యూపీఏ పాలనలోనూ. కాకపోతే ఈసారి తేడా ఏమిటంటే ముందుగానే కేంద్ర ఆర్థికమంత్రి సూచనప్రాయంగా చెప్తున్నారు. దేశం క్లిష్ట పరిస్థితిలో ఉంది, ఓటాన్ ఎకౌంట్ అంటూ మడిగట్టుకోకుండా అంతకుమించి బడ్జెట్ ఉంటుంది అంటూ.' ఈ మాత్రం మాట బయటకు వచ్చిందంటే వీరు పూర్తిస్థాయి బడ్జెట్ పెట్టేసేటట్టు కనబడుతున్నారు. ఇది అన్యాయం' అంటూ ప్రతిపక్షాలు ఆందోళన వెలిబుచ్చుతున్నాయి. మన పిచ్చిగానీ బడ్జెట్ ప్రక్రియని అంత పవిత్రంగా చూస్తున్నాయా ప్రభుత్వాలైనా, ప్రతిపక్షాలైనా. అసలు ఓటాన్ ఎకౌంట్ పెట్టడానికి రెండు ముఖ్య కారణాలుంటాయి. ఒకటి బడ్జెట్ ప్రతిపాదనలు కూలంకుషంగా చర్చించడం సమయాభావం వల్ల కుదరదని. ఈ మధ్యకాలంలో ఏ బడ్జెట్ సమావేశాలైనా చర్చోప చర్చలతో జరిగాయా? పద్దులన్నీ ఏ చర్చా లేకుండా గిలెటిన్ బాట పట్టడం ఎంత మామూలైపోయింది.

పైగా విధాన నిర్ణయాలన్నీ పార్లమెంటు బయట, పబ్లిక్ మీటింగుల్లో జరగడం మామూలైంది. బడ్జెట్‌లో ప్రతిపాదనలకు, కేటాయింపులకు, విడుదలకు మధ్య పొంతన ఉండడం లేదు. పన్నుల వడ్డింపులు కూడా సంవత్సరం పొడుగునా జరుగుతూనే ఉన్నాయి. ఇక రెండో కారణం రానున్న ఐదేళ్లకు పాలన అందించడానికి ప్రజల ఆమోదం పొందిన వారే తమ ప్రభుత్వపు విధానాల్ని నిర్ణయించే వెసులుబాటు కలిగి ఉండాలన్న మర్యాద. ఎన్నికలకు అత్యంత సమీపంలో, పెన్షన్ రెట్టింపు, ఉన్నత విద్యాసంస్థల్లో 25శాతం సీట్ల పెంపు లాంటి ఎక్కువ నిధులు అవసరమైన విధానాలు-అవి మంచివే కావొచ్చు-వాటిని హడావిడిగా ప్రకటించి, తరువాత లెక్కలు చూసుకోవచ్చు అన్న ధోరణితో ఉన్న పాలక పక్షాలు అన్ని మర్యాదల్ని గుర్తుంచుకొంటాయా? కాబట్టి ఇప్పటికే ప్రాసంగికత కోల్పోయిన బడ్జెట్ తంతుకోసం అట్టే ఆందోళన చెందడం అర్థరహితం. ఇది పార్లమెంటుకే కాదు శాసనసభలకీ వర్తిస్తున్న చేదు నిజం.

– డా.డి.వి.జి.శంకరరావు,
మాజీ ఎంపీ, పార్వతీపురం

విశాలాంధ్ర
బతుకు
The Life
మంగళవారం
29 జనవరి 2019


బుల్ రేస్!

సంక్రాంతి సీజన్‌లో కోళ్ల పందాలు, పొట్టేలు పందాల మాదిరిగానే ఎడ్ల పందాలూ జరుగుతుంటాయి. అలాంటి ఓ పోటీలోని దృశ్యమే ఇది. కర్నాటకలోని షిమోగ జిల్లా అబ్బలగెరె గ్రామంలో సవ్వద్రి పండగ సందర్భంగా ఈ ఎడ్ల పందాలు నిర్వహించారు. రైతులు ఎంతో ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు.



అంతర్జాలంలో తెలుగు కవిత

చాలామందిలో సహజంగా ఏదో ఒక రంగానికి సంబంధించిన ప్రతిభా పాటవాలు నిక్షిప్తమై ఉంటాయి. అయితే అవి కొన్ని సందర్భాలలో కొందరి విషయంలో మాత్రమే బయటపడి, వారికి పేరుప్రఖ్యాతులు, గుర్తింపు తెస్తాయి. ఆ కోవకు చెందిన యువతి.. తెలుగు రాష్ట్రానికి చెందిన పారుపల్లి శ్రీకవిత. ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో రీసెర్చర్ అయిన ఈమె తెలుగు నిఘంటువులోని పదాలను చాలావరకు కంప్యూటరీకరించిన ఘనతను సాధించారు. 21 ఏళ్ల వయసులో ఆమె మాస్టర్స్ డిగ్రీని త్వరలో అందుకోనున్నారు. తెలుగు టు తెలుగు డిక్షనరీ నుంచి 8,483 క్రియ (వెర్బ్)లు, 253 క్రియావిశేషణాలు, 1,673 విశేషణాలను ఆమె విశదీకరించారు. ఒక తెలుగు డిక్షనరీ నుంచి 21 వేల వరకు పదాలను ఇంటర్నెట్‌లో చేర్చే బృహత్తర కార్యక్రమాన్ని ఆమె విజయవంతంగా పూర్తిచేశారు. ఇందుకోసం తన తల్లి విజయలక్ష్మి నుంచి సహాయ సహకారాలను అందుకున్నారు.





గూగుల్‌లో కొంతకాలం కిందటివరకు ఉన్న తెలుగు పదాలు 9000 మాత్రమే. వాటితోపాటు మరో 21 వేలకు వరకు పదాలను గూగుల్‌లో చేర్చిన ఘనత శ్రీకవితదే. మాతృభాషకు ఇంటర్నెట్ మరింత చోటు కల్పించినందుకు ట్రిపుల్ ఐటీ -హైదరాబాద్ ఆమెకు మాస్టర్స్ పట్టాను అందించడం ద్వారా ప్రత్యేకంగా గుర్తించింది. తనకు లభించిన ఈ గుర్తింపునకు కారణం తన ప్రొఫెసర్ నవజ్యోత్ సింగ్ అని ఆమె తెలిపారు. తాను ట్రిపుల్ ఐటీ చదువుతున్నప్పుడు తెలుగు పదాలను ఇంటర్నెట్‌లో పెట్టమని ఆ ప్రొఫెసర్ పదేపదే చెప్పేవారట. అలా దాదాపు ఏడాదిపాటు అలా ఆయన అడిగారట. ఆయన ప్రోత్సాహం వల్లే తాను ఈ పనిని పూర్తిచేశానని ఆమె తెలిపారు. ఆయన అకాల మరణం చెందారని, అందువల్ల తాను సాధించిన విజయాన్ని చూడలేకపోయారని శ్రీకవిత అన్నారు.

గుర్‌గావ్‌లోని ఓ సంస్థలో ప్రొడక్ట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న శ్రీకవిత.. 20 ఏళ్ల వయసులోనే తన పరిశోధనలకు సంబంధించిన థీసిస్‌ను సమర్పించారు. కంప్యూటర్‌లో తెలుగు నిఘంటువుగా 'తెలుగు వర్డ్‌నెట్' అనే వెబ్‌సైట్ ఉన్నప్పటికీ, అందులో తక్కువ పదాలే ఉన్నాయని, పరిశోధకులు దానిని వినియోగించే సందర్భాలలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆమె వివరించారు. చాలామంది రీసెర్చర్‌లు భాషలకు సంబంధించి ప్రస్తుతం ఉన్న వ్యవస్థలను మరింత మెరుగుపరిచేందుకు వారికి అందుబాటులో ఉన్న వనరులపైనే ఆధారపడుతున్నారన్నారు. ఆరంభం నుంచి ఈ వ్యవస్థలను సుసంపన్నం చేసేందుకు వారు ప్రయత్నించడంలేదన్నారు.

'మా ప్రొఫెసర్‌గారు ఒక ప్రత్యేక టూల్‌ని రూపొందించారు. ఈ సాఫ్ట్‌వేర్ టూల్ ద్వారా క్రియల్ని ఏడు రకాలుగా విభజించారు. వాటికి కొన్ని క్లాసిఫికేషన్లు ఇచ్చారు. దీన్ని సెంటిమెంటల్ ఎనాలసిస్ అంటారు. మా ప్రొఫెసర్ రూపొందించిన టూల్ సాయంతో మనం పదాలను ఇంటర్నెట్‌లో ఉంచి, సెంటిమెంటల్ ఎనాలసిస్ ద్వారా ట్యాగ్ చేయవచ్చు. అంటే పదాలను నేరుగా అందులో పెట్టవచ్చు' అని శ్రీకవిత వివరించారు.

"ఉదాహరణకు కొట్టడం, తిట్టడం, చంపడం.. వంటి పదాలు ప్రతికూలత విభాగంలో... మంచి, నిజం, సాయం వంటి పదాలు సానుకూల విభాగంలో ట్యాగ్ అవుతాయి. అయితే వీటి విషయంలో ఇంగ్లీష్, ఇతర భాషల్లో సమస్య లేదు కానీ.. తెలుగులోనే సమస్య ఉంది. దీన్ని కంప్యూటర్ సైన్స్, తెలుగు తెలిసిన వాళ్లు చేయాలి. నాకు చిన్నతనం నుంచి భాషమీద మంచి పట్టు ఉంది. ఇంగ్లీష్ మీడియంలో చదువుకున్నా. మాతృభాషను నేనెప్పుడూ నిర్లక్ష్యం చేయలేదు. అది తెలిసి మా ప్రొఫెసర్‌గారు నన్ను నిఘంటువులో మరిన్ని తెలుగు పదాలు చేర్చమని కోరారు. నాకు మాత్రం ఇంగ్లీష్‌లో ఏమైనా రాసినా, ప్రాజెక్టులు చేసినా గుర్తింపు లభిస్తుంది అనిపించింది. చివరికి మా అమ్మ కూడా మా ప్రొఫెసర్‌గారు చెప్పిన ప్రకారం చేయమని సలహా ఇచ్చింది. 'నీకు నేను తోడుంటాను' అని ప్రోత్సహించింది. అలా తెలుగు పదాలను ఒకచోటుకు చేర్చి.. టైప్ చేయడం మొదలుపెట్టా. గూగుల్‌లో ఇంతకుముందున్న తొమ్మిదివేల పదాలను హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం విద్యార్థులు.. ఇంటర్నెట్‌లో ఉంచారు. నేను తీసుకున్నవి 1934లో రాసిన శ్రీసూర్యరాయాంధ్ర నిఘంటువులోనివి. ఇప్పటివరకు ఎనిమిది సంచికలు వచ్చాయి. అమ్మ సాయంతో దాదాపు 36 వేల పదాలను తీసుకుని టైప్ చేశా. అందుకు మూడు నెలల సమయం పట్టింది. తరువాత వాటిని సెంటిమెంటల్ ఎనాలసిస్ ద్వారా ట్యాగ్ చేశా. వాటిలో 20 వేల పదాలు ట్యాగ్ అయ్యాయి" అని శ్రీకవిత తన కృషిని వివరించారు.

"నేను ఇంటర్నెట్‌లో ఉంచిన పదాలను టూ నో (తెలియజేయడం), టూ డూ (పని చేయడం), టూ గ్రోత్ (పని తీరు ఎదుగుదల), టూ హోప్ (కలిగి ఉండటం), టూ కట్ (విభజించడం), టూ బౌండ్ (చుట్టూ ఉన్నవి చెప్పడం), టూ బీ (స్థితి కోపం, బాధ, సిట్యువేషన్ చెప్పడం).. ఇలా ఏడు రకాలుగా విభజించి ట్యాగ్ చేశా. ఇంటర్నెట్‌లో మా ట్రిపుల్ ఐటీ సైట్‌లో ఉంచిన ఈ పదాలను పలు రీసెర్చ్ గ్రూపులు, లింగ్విస్టిక్స్ పరిశోధనలు చేసేవారు ఆమోదించారు. కంప్యూటర్ ఈ గ్రామర్‌ని అర్థం చేసుకుంటుందా.. సెంటిమెంటల్ ఎనాలసిస్ చేస్తుందా అన్నది చూశారు. వంద శాతం ఈ పదాలు, గ్రామరు ఉపయోగపడతాయని తేలింది. అయితే ఈ పదాలను గూగుల్ తీసుకుని.. డెవలపర్స్ ద్వారా మనకు అందుబాటులో ఉంచుతుంది. ఇటీవల కాలేజీలో జరిగిన ఒక సెమినార్‌లో ఈ థీసిస్‌కి సంబంధించిన పత్రాలను సమర్పించా. దాంతో ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ మాస్టర్స్ డిగ్రీ ఇచ్చి గౌరవించింది" అని ఆమె తెలిపారు.

తెలంగాణ రాష్ట్రం ఖమ్మం పట్టణానికి చెందిన శ్రీకవిత తన పాఠశాల విద్యను తెలుగులోనే అభ్యసించారు. దీంతో ఆమెకు తెలుగు భాషపై మంచి పట్టు ఉంది. ప్రస్తుత కాలంలో క్లౌడ్ కంప్యూటింగ్, డేటా ఎనలిటిక్స్ వంటి సాంకేతిక కోర్సులను అభ్యసిస్తున్నవారు వాటి గురించి ఎంతో గర్వంగా చెప్పుకుంటున్నారని, తన విషయంలో మాత్రం తెలుగు పరిశోధన చేస్తున్నానని చెప్పుకునేందుకు మొదట్లో ఇబ్బంది పడ్డానని పేర్కొన్నారు. రంగుల పేర్లకు తెలుగు డేటాబేస్‌ను రూపొందిస్తున్న ఓ సీనియర్‌కు ప్రస్తుతం పారుపల్లి శ్రీకవిత సహాయ సహకారాలు అందిస్తున్నారు. వీటిని తెలుసుకోవడం వల్ల మన మూలాలు, వారసత్వ సంపద తెలుస్తాయని ఆమె వివరించారు. "మా మామ్మ దగ్గర కూర్చుని తెలుగులో మనకు వాడుకలో ఉన్న పసుపు వంటి వివిధ రంగులకు ఉన్న వివిధ పేర్ల గురించి తెలుసుకున్నా. వీటి గురించి తెలుసుకోవడం చాల ఆశ్చర్యంగా, ఆనందంగా అనిపించింది. వాస్తవానికి వీటి గురించి వివరాలు సేకరించడం అంత కష్టం కాదు అనిపించింది" అని శ్రీకవిత వివరించారు.

వియత్నాంలోని హనోయ్‌లో జరిగిన 19వ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ కంప్యుటేషనల్ లింగ్విస్టిక్స్ అండ్ ఇంటెలిజెంట్ టెక్స్ట్ ప్రాసెసింగ్ (సీఐ క్లింగ్ - 2018) లో తన పరిశోధన పత్రాన్ని సమర్పించారు. తాను ఈ ఘనతను సాధించడానికి కారణమైన డాక్టర్ నవజ్యోత్ సింగ్ దురదృష్టవశాత్తు అనారోగ్యంతో మరణించారని ఆమె ఈ సందర్భంగా ప్రస్తావించారు.

తెలుగుపై పరిశోధనలు చేస్తూ ఇదే రంగంలో కొనసాగాలా.. లేక వేరే రంగంలోకి ప్రవేశించాలా? అన్న అంశంపై ఎదుర్కొన్న సందిగ్ధం గురించి ఆమె వివరించారు. "దీని గురించి చాలా ఆలోచించా. ఓ ప్రొఫెసర్ తెలుగు భాషపై పరిశోధనల మీద దృష్టిపెట్టాలని కోరారు. ఆయన ఎందుకు చెప్పారో అర్థం చేసుకున్నా. ఇకముందు ఈ రంగంలోనే కొనసాగుతా. ఇందుకోసం ప్రొఫెసర్ రాధిక మామిడి గారి సలహాలు తీసుకుంటున్నా' అని వివరించారు.

ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో జరిగిన అసోసియేషన్ ఆఫ్ కంప్యుటేషనల్ లింగ్విస్టిక్స్ (ఏసీఎల్-2018) వార్షిక సమావేశంలో ఆమె రెండు పరిశోధన పత్రాలను సమర్పించారు.

'మా తల్లిదండ్రులు నా గురించి గర్వంగా చెప్పుకోవాలి' ఏకైక లక్ష్యంతో శ్రీకవిత తన తండ్రి సలహా మేరకు ట్రిపుల్ ఐటీ- హైదరాబాద్‌కు దరఖాస్తు చేసి సీటు సంపాదించారు. కంప్యూటర్ సైన్స్‌లో ఇంటిగ్రేటెడ్ బీటెక్ విద్యార్థిగా, ఎగ్జాట్ హ్యూమానిటీస్‌లో ఎంఎస్ పట్టా అందుకున్నారు. టెక్నాలజీలోనే కాకుండా వ్యాకరణాది శాస్త్ర పరిజ్ఞానం వంటి అంశాల్లో కూడా పట్టు అవసరం అని ఒక విద్యావేత్తగా తన తండ్రికి ఉన్న నమ్మకం అని ఆమె తెలిపారు.

తమకున్న శ్రీకవిత విద్యాసంస్థలను తన తండ్రి ఉషాకిరణ్‌కుమార్ నిర్వహిస్తుంటారని తెలిపారు. ట్రిపుల్ ఐటీ-హైదరాబాద్‌లో తాను అనేక విషయాలు నేర్చుకున్నానన్నారు. తనకు వచ్చే ఆలోచనలు, విశ్లేషణాత్మక సామర్థ్యం అంతా ట్రిపుల్ ఐటీ ద్వారానే సాధ్యమైందని ఆమె వివరించారు. గత వేసవిలో తాను సీమెన్స్ సంస్థలో బ్లాక్‌చెయిన్ టెక్నాలజీలో ఇంటర్న్‌షిప్ చేశానని, అక్కడ సాధించిన పరిజ్ఞానంతో గుర్‌గావ్‌లోని స్ప్రింక్లర్ సంస్థలో ప్రొడక్ట్ ఇంజినీర్‌గా ఉద్యోగం సంపాదించుకున్నానన్నారు. స్టాన్‌ఫోర్డ్ సమ్మర్ స్కూల్‌లో కూడా ఆమె శిక్షణ పొందారు. స్నేహితులతో కలిసి వివిధ ప్రాంతాలకు ప్రయాణాలు చేస్తుంటారు. వాటికి సంబంధించిన వివరాలు, విశేషాలతో ట్రావెల్ బ్లాగ్‌ను కూడా నిర్వహిస్తున్నారు. ఫిల్మ్ మేకింగ్ అంటే ఆమెకు చాలా ఆసక్తి ఉంది. ఫిల్మ్ మేకింగ్ విధానం తెలుసుకునేందుకు శ్రీకవిత ఒక షార్ట్ ఫిల్మ్‌లో కూడా నటించారు.

రోజూ కప్పు బ్లాక్ కాఫీ!

టీ మాదిరిగానే కాఫీ కూడా అత్యధికులు ఇష్టపడే పానీయమే. ఇది అత్యుత్తమ పానీయాల్లో ఒకటిగా కూడా ఉంది. కారణంగా యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండడమే. మరి కాఫీ వల్లే ఇన్ని ప్రయోజనాలు ఉంటే బ్లాక్ కాఫీ ఇంకెంత మంచిదో కదా! షుగర్ లేకుండా బ్లాక్ కాఫీ తాగి చూడండి. దానివల్ల కలిగే మంచి మార్పులు ఏమిటో మీకే అవగతమవుతుంది. అలసటగా ఉన్నప్పుడు ఒక కప్పు కాఫీ తాగి చూడండి....మీకు ఎంత శక్తి వస్తుందో! ఇంతకీ బ్లాక్ కాఫీ ఎలా తయారుచేస్తారో తెలుసా? రెగ్యులర్ కాఫీలో పంచదార, పాలు, క్రీమ్ వేస్తాం కదా. ఇవేమీ లేకుండా ఉంటే అదే బ్లాక్ కాఫీ. కాఫీ గింజల్ని చితక్కొట్టి చేసే అసలైన కాఫీ రుచి, ఫ్లేవర్‌ని ఇది రెట్టింపు చేస్తుంది. బ్లాక్ కాఫీని కూడా పూర్వం కుండలోనే తయారుచేసేవారు. ఈ ఆధునిక కాలంలో బ్లాక్ కాఫీని కూడా ఫిల్టర్ కాఫీ మాదిరిగా తయారుచేస్తున్నారు.



- బ్లాక్ కాఫీ గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. గుండె వ్యాధుల ముప్పునీ తగ్గిస్తుంది. బ్లాక్ కాఫీ తాగడం వల్ల గుండెపోటు వచ్చే అవకాశాలు 20 శాతం తగ్గుతాయని పరిశోధనల్లో తేలింది. కాఫీ వల్ల బీపీ స్వల్పంగా పెరుగుతుందన్నది వాస్తవమే కానీ ఈ సమస్య అలాగే ఉండిపోదు.
- బ్లాక్ కాఫీ బరువు తగ్గడానికీ ఉపయోగపడుతుంది. శరీరం జీవక్రియల వేగం పెంచడం ద్వారా కొవ్వులనూ కరిగిస్తుంది. కొవ్వులను కరిగించే ప్రక్రియలో కెఫీన్ దోహదపడుతుందని అధ్యయనాల్లో రుజువైంది కూడా. దీనివల్ల శరీర జీవక్రియల వేగం మూడు నుంచి 11 శాతం పెరుగుతుంది. ఒబెసిటీ ఉన్నవారిలో కెఫీన్ వల్ల కొవ్వులు కరిగే ప్రక్రియ 10 శాతం, బక్కపలచగా ఉన్నవారిలో 29 శాతం వరకూ ఉంటుందని కూడా పరిశోధనల్లో తేలింది.
- బ్లాక్ కాఫీ తాగడం మనకు లభించే మరో మంచి లాభం జ్ఞాపకశక్తి పెరగడం. మెదడును చురుకుగా ఉంచడం ద్వారా అల్జీమర్స్, డిమెన్షియా లాంటి వ్యాధులు రాకుండానూ అడ్డుపడుతుంది. బ్లాక్ కాఫీ తాగడం వల్ల అల్జీమర్స్ వచ్చే అవకాశాలు 65 శాతం తగ్గుతాయన్నది పరిశోధనలు చెప్పిన మాట.
- బ్లాక్ కాఫీతో డయాబెటీస్ ముప్పు ప్రత్యేకించి టైప్ 2 డయాబెటీస్ ముప్పు 23 నుంచి 50 శాతం తగ్గుతుంది.
- రోజుకి రెండుసార్లు బ్లాక్ కాఫీ తాగితే పార్కిన్‌సన్ వ్యాధికి ఎంతోకొంత అడ్డుకట్ట వేసినట్టే. కాఫీలో ఉండే కెఫీన్ శరీరంలో డోపమైన్ స్థాయిలను పెంచడం ద్వారా ఈ ప్రయోజనాన్ని అందిస్తుంది. పార్కిన్‌సన్ వ్యాధి ముప్పు 32 నుంచి 60 శాతం తగ్గుతుంది.
- రోజుకి నాలుగు కప్పుల బ్లాక్ కాఫీ తాగితే మహిళల్లో డిప్రెషన్ సమస్య 20 శాతం తగ్గుతుంది. డోపమైన్ పెరగడం, కేంద్ర నాడీ వ్యవస్థపై మంచి ప్రభావం చూపించడం వల్ల ఇది సాధ్యమవుతుంది. ఈ కారణంగా ఆత్మహత్యలు చేసుకోవాలనే ఆలోచనలూ రావు.
- లివర్ నుంచి విషపదార్థాలనూ తొలగిస్తుంది. శరీరం నుంచి మూత్రం ద్వారా చెడు బాక్టీరియా, విష పదార్థాలను తొలగించడం ద్వారా లివర్‌ను శుభ్రంగా ఉంచుతుంది. లివర్‌లో విషపదార్థాలు పేరుకుపోతే లివర్ సిరోసిస్‌కు దారితీస్తుంది. ఈ ముప్పునూ బ్లాక్ కాఫీ 80 శాతం తగ్గిస్తుంది.
- యాంటీఆక్సిడెంట్ల విషయానికొస్తే బ్లాక్ కాఫీలో పండ్లు, కూరగాయల కంటే ఎక్కువ ఉంటాయి.

కలువ రేకుల పొడి....

కలువ, తామర, పద్మము ఏ పేరుతో పిలిచినా అదే. ఇంటి అలంకరణ, వేదికల అలంకరణ, పెండ్లి మండ పాల అలకంరణలో దీనికున్న హుందాతనం, ప్రత్యేకతే వేరు. అందం, అలంకరణ అనగానే తామర గుర్తు కొస్తుంది. ఇది అలంకరణకే కాదు ఔషధంగానూ బాగా పనికొస్తుంది. ఇందులో ఉన్న ఔషధ గుణాలు ఎన్నో రకాల ప్రయోజనాలను అందిస్తాయి.

- తామర పువ్వు రేకులతో తయారుచేసిన సిరప్ గర్భ సంచిలో రక్తస్రావాన్ని అరికడుతుంది. ఇదే సిరప్ గర్భంతో ఉన్నప్పుడు కనిపించే రక్తస్రావాన్ని నిలుపుదల చేస్తుంది.
- తామర రేకులు ఎండబెట్టి చేసిన పొడిని తిన్నా, తామర రేకులు వేసి ఉడికించిన నీటిని తాగినా పురుషుల్లో వీర్యవృద్ధి జరుగుతుంది.
- కలువ రేకుల్లో ఉండే తేనె కంటి ఇబ్బందులను పోగొడుతుంది.



- తామర పువ్వులు ఎండబెట్టి చేసిన పొడి, గులాబీ రేకులు ఎండబెట్టి చేసిన పొడి ...రెండూ కలిపి ఉపయోగిస్తే శరీర దుర్వాసన పోతుంది. ఈ పొడిని శరీరానికి రాసుకుంటే దుర్వాసన పోవడమే కాదు సువాసన వస్తుంది.
- కలువ రేకులు ఎండబెట్టి చేసిన పొడిలో కొంచెం పాలు కలుపుకుని తాగితే బలం వస్తుంది.

ఆడుతూ.... పాడుతూ.... చదువు !

చిన్నారుల చేత హోం వర్క్ చేయించాలంటే....మరీ ముఖ్యంగా ఆరేళ్ళ లోపు పిల్లల చేత ఇంట్లో పుస్తకం పట్టించాలంటే పెద్ద యుద్ధమే జరుగు తుంది. ఇందుకు కారణం చదువంటే భయం...చదువంటే బోర్...చదువంటే కష్టం...చదువంటే అదో పెద్ద భూతం అని పిల్లలు భావించడమే. అలాకాకుండా పిల్లలు ఆడుతూ... పాడుతూ... చదివేలా చేయాలి. ఇలా చేస్తే...చదువొక్కటే కాదు ఇంకా చాలా విషయాలు పిల్లలు నేర్చుకుంటారు, గ్రహిస్తారు. ఇందుకూ కొన్ని మార్గాలు ఉన్నాయి.



- చదువు కూడా వినోదంలా ఉండాలి అప్పుడే పిల్లలు అత్యంత ఆసక్తిని కనబరుస్తారు.
- పిల్లలను క్లాసు పుస్తకాలకు మాత్రమే పరిమితం చేయవద్దు. వాళ్ళ చేత మైండ్ గేమ్స్ ఆడించండి. ఇందులో భాగంగా వాళ్ళు మెదడును చురుకుగా ఉపయోగిస్తారు. పిల్లల్ని జూ లేదా మ్యూజియంలకి తీసుకెళ్ళండి.
- చదవడం ద్వారా కంటే వినడం ద్వారా ఎక్కువ గ్రహించగలుగుతారు పిల్లలు. దీనిని ఉపయోగించు కోవాలంటే ఆడియో పుస్తకాలు వాడుకోండి. పిల్లలకు ఆసక్తికరంగా బోధించే ప్రక్రియల్లో ఇది కూడా ఒకటి.
- కొత్త విషయాలు నేర్చుకునేందుకు పిల్లలు చాలా ఆతృత చూపిస్తారు. దీనిని ఇంకొంచెం పెంచితే చాలు మీరు. ఇందుకోసం పజిల్స్ లాంటివి వాళ్ళ ముందు ఉంచండి. ఇది వారి మనో వికాసానికీ పనికొస్తుంది. ఇవి పిల్లలకి వినోదాన్ని అందించడమే కాదు చైతన్యవంతుల్ని చేస్తాయి.
- పిల్లలు మంచి శ్రోతలు. వారికి మంచి కథలు చెప్పండి. తిరిగి వాటిని చెప్పేలా చేయండి. మీరు పదేపదే చెప్పలేమనుకుంటే వారికి కథలు ఉన్న ఆడియో పుస్తకాలను పరిచయం చేయండి. లేదంటే మామూలు పుస్తకాల్లో ఉన్న కథలను మీరే గట్టిగా చదవి వినిపించండి. వారు విని ఆనందిస్తారు. కొత్త విషయాలతో పాటు అందులో ఉన్న నీతిని నేర్చుకుంటారు.
- పిల్లలు టీవీకి తొందరగా అతుక్కుపోతారు. అక్కడ నుంచి ఓ పట్టాన లేవరు. ఇది ఎంత మాత్రం మంచి అలవాటు కాదు. ఇది వారి చదువులనే కాదు ఆరోగ్యాన్నీ దెబ్బతీస్తుంది. అందుకే పిల్లలు టీవీ చూసేందుకు ఓ సమయాన్ని కేటాయించండి. ఆ సమయంలో మినహా ఇతర సమయాల్లో టీవీ ముందు కూర్చోకుండా చూడండి. అప్పుడే చదువు సజావుగా సాగుతుంది. టీవీ చూస్తూ చదవడాన్ని అలవాటు చేయవద్దు. దీనివల్ల ఏకాగ్రత దెబ్బతింటుంది.

ఏ చిన్నారికైనా ఇల్లే తొలి పాఠశాల. తల్లిదండ్రులే మొదటి గురువులు. పిల్లలకి ఇంట్లో బోధించాలని మీరు అనుకుంటే మీకు చాలా ఓర్పు కావాలి, అవగాహన కావాలి. అన్నింటికంటే ముందు...పిల్లల కంటే ముందు మీకు క్రమశిక్షణ కావాలి. ఈ విషయాన్ని గుర్తుంచుకోండి. పిల్లలకు ఇంట్లో చదువు చెప్పాలంటే తల్లిదండ్రులు కొత్తకొత్త ఐడియాలను అన్వేషించాల్సిందే. మరీ ముద్దు చేసినా, మరీ కఠినంగా ఉన్నా వారికి చదువు అబ్బదు, ఎక్కడనే విషయాన్ని అర్థం చేసుకోండి.

నేను - సుడిగుండం

(నవల) 29

పి.చంద్రశేఖర అజాద్
సెల్: 92465 73575



నిన్నటి సంచిక తరువాయి

ఇప్పుడు మధుకి చెప్పాలనిపించలేదు. వెన్నెలకి ఈ విషయం చెబితే ఎలా రియాక్టవుతుందో తెలియదు. అలా చెప్పటం కూడ ప్రమాదమే. అడవుల్లోకి వెళ్తానంటే ఏడ్చి గందరగోళం చేయవచ్చు. అమ్మతో చెప్పవచ్చు. అంతగా అయితే నేను తిరిగి వచ్చాక అవసరం అనుకుంటే చెబుతాను.

వారం రోజుల దాకా నాకు ఎలాంటి పిలుపు లేదు. నేను చెప్పకపోవటం మంచిదయ్యింది. మరో మూడు రోజుల తర్వాత ప్రయాణం ఖరారు అయింది.

నేను మధుని సెలవు కావాలని అడిగాను. ఎన్ని రోజులని అడిగాడు. వారం రోజులు అన్నాను. అన్ని రోజులయితే యిబ్బంది అవుతుంది అన్నాడు.

"త్వరగా రావటానికి ప్రయత్నం చేస్తాను" అన్నాను.

"ఏ పనిమీద" అన్నాడు మామూలుగా

"పర్సనల్ వ్యవహారం. ఈ మధ్యలో నేను వర్క్‌తో అలిసిపోయాను. రెస్ట్ అనుకో" అన్నాను.

"సరే. కానీ" అన్నాడు. ఇంటి దగ్గర ఆఫీస్ పని మీద బయటకు వెళ్తున్నాను అని చెప్పాను. అన్ని రోజులా అంది. అంతగా అయితే మీరు మన ఊరు వెళ్లి రండి అన్నాను..

పత్రికల్లో జీతాలు వస్తున్నాయి. అవేం పెద్ద మొత్తాలు కాదు. మావయ్యకి ఎకరం పొలంలో పంట వేయటానికి అప్పులు చేయనివ్వకుండా సర్దుబాటు చేస్తున్నాను. అలా యింకా టైట్‌గానే వుంది. అంతకుముందు నా దగ్గరున్న లక్ష రూపాయలు ఖర్చు అయిపోయాయి. ఓ టీ.వీ. కొన్నాను. ఫ్రిజ్ తీసుకున్నాను. అలాగే పుస్తకాలు పెట్టుకోవటానికి రాక్స్ తీసుకున్నాను.

ఇల్లు కూడా ఆఫీస్ కి దగ్గరగా తీసుకున్నాను. ఇలాంటివి వున్నాయి. అయినా ఇప్పుడు వెన్నెలకి అనుమానం రాకూడదు. అందుకే ఇంటికి పంపాను.

ఆ ప్రయాణం గొప్ప అనుభవం.

ఇంతకు ముందు నిరంజన్‌తో వెళ్లినట్లు కాదు. అప్పటి పరిస్థితులు వేరు. నాకు నిరంజన్ కజిన్ గుర్తొచ్చాడు. ఇన్ని సంవత్సరాలు గడుస్తున్నా ఎలాంటి మార్పు లేదు. అదే రహస్య జీవితం. చనిపోయిన వారు చనిపోగా కొత్తవారు వస్తున్నారు.

ఒక వీరుడు చనిపోతే వేలమంది పుడతారు అంటే అర్థం యిదేనేమో! ఆ ప్రయాణం, వారి దగ్గరకు చేరిన తీరూ, ఆ నాయకుడితో మాట్లాడటం, ఇవన్నీ ఓ చిన్న గ్రంథం. అవన్నీ నా పుస్తకాల్లో రికార్డు చేసుకున్నాను.

వాళ్ల మార్గం ఏదయినా కావచ్చు. వారు చెప్పిన కొన్ని విషయాలు నాకు కొత్త. అక్కడ గిరిజనుల్ని చూసాను. అడుగడుగునా ప్రమాదాలు పొంచి వున్నాయి. ఓ దశలో నేను వెనక్కి రాగలనా అన్న ఉద్వేగం కలిగింది. అప్పుడు వెన్నెలా, నిదా గుర్తు వచ్చారు. నాలుగు రోజుల తర్వాత ఇంటికి వచ్చాను.

మరుసటి రోజు మధుని కలుసుకున్నాను. "వారం వుంటానన్నావుగా" అన్నాడు.

"అన్నాను. నీతో మాట్లాడాలి" అన్నాను.

"పత్రిక నుండి మారుతున్నావా... మంచి ఆఫర్ వచ్చిందా?" అన్నాడు. నాకు ఆశ్చర్యం. అలాంటిదేం లేదు అంటూ విషయం చెప్పాను.

"ముందు ఓ మాటయినా అసలేదు" అన్నాడు.

"అప్పటికప్పుడు బయలుదేరాల్సి వచ్చింది" అని అబద్ధం చెప్పాను. అతను నన్ను ఈడ్చుకుని తీసుకెళ్లటమే తక్కువ. మేనేజింగ్ ఎడిటర్ దగ్గరకు తీసుకువెళ్లాడు. ఆయనకు విషయం చెప్పగానే ఎగిరి గంతేసాడు.

"ఇది బ్లాస్ట్ అవుతుంది. అయితే వెంటనే ప్రచురించకండి" అనగానే అనుమానం వచ్చింది.

"రెండు రోజులు ఉత్కంఠ పెంచండి. అయితే విషయం ఇది అని చెప్పొద్దు" అన్నాడు.

నేను ఈలోగా ఆర్టికల్ పూర్తి చేసి మధుకి చూపించాను. నేను తీసుకువచ్చిన ఫొటోలు యిచ్చాను.



అప్పటికి వెన్నెల వచ్చింది. స్టాఫ్లో కూడా ఒకరిద్దరికి మాత్రమే తెలుసు. వరసగా మూడు రోజులు ప్రచురించారు. అది కలిగించిన సంచలనం అంతా యింతా కాదు.

తర్వాత పోలీసులతో యిబ్బందులు మొదలయ్యాయి. సోర్స్ చెప్పమని నోటీసులు. నన్ను విచారించారు. ఆ స్థావరాలు చెప్పమని. కళ్లకి గంతలు కట్టి తీసుకుపోయారు. ఇప్పుడు నేను గుర్తు పట్టలేను అన్నాను..

అవసరం అయితే మా బాస్ కోర్టుకి వెళ్తానన్నాడు. అదలా కొన్ని రోజులకి సద్దుమణిగింది.

****

జర్నలిస్ట్ మిత్రులతో నేను

మాకు యూనియన్లు వున్నాయి. ప్రెస్ క్లబ్ వుంది. ఓసారి సమావేశానికి వెళ్ళాను. అక్కడ నాకు మద్యం' ఆఫర్ చేసారు. నాకు యూనివర్సిటీ రోజులు గుర్తొచ్చాయి.

"సారీ" అన్నాను. అప్పుడు విచిత్రంగా చూసారు. "ఏంటి ప్రభాత్. ఈ రోజుల్లో ఇదేం పెద్ద విషయం కాదు. అయినా ఇప్పటి వరకూ నువ్వు హాట్ డ్రింక్ టచ్ చేయలేదా!" అన్నారు.

"జీవితంలో ఒకటి గుర్తుంచుకో. ఇది కేవలం మందు అనుకోకు. మనకి దీని ద్వారానే కొత్త పరిచయాలు అవుతాయి. మందు తాగినవాడు మనసులో వున్న దాన్ని దాచుకోలేడు. ఏదొక క్షణంలో కక్కేస్తాడు. ముందు ముందు నీకు చాలా విషయాలు తెలుస్తాయి" అని ఓ మిత్రుడు ఎడ్యుకేట్ చేసాడు.

నాకు గౌరవం వున్న సీనియర్స్ కూడా తాగుతున్నారు. నా ఆలోచనల్లో, అనుమతితో సంబంధం లేకుండానే గ్లాసులో పోసి అందించారు. చీర్స్ అన్నారు.

"ఇంకెప్పుడూ ఇలాంటి సమావేశాలకు రాకూడదు" అనుకున్నాను. అనేక సందిగ్ధాల మధ్య గ్లాసు అందుకున్నాను. యూనివర్సిటీలో, సముద్రం దగ్గర కాదన్న వాడిని - మొదటిసారి తాగాను. తుపుక్కున వూయాలనిపించింది.

నైతికంగా పతనం అయ్యాననిపించింది.

మొదటిసారి "పెగ్గు'తోనే ఆగిపోయాను. అయినా నన్ను మత్తు ఆవరించింది.

"ఈ జర్నలిస్టులని ఓ మందు బాటిల్తో కొనేయవచ్చు" అన్న గోయంకా మాటలు గుర్తొచ్చాయి.

****

నేను కొందరికి నచ్చను.

నా వెనకాల రకరకాలుగా అనుకుంటారు. అవి నాకు చేరుతుంటాయి. మొదట్లో భావాలు కలుస్తున్నాయా లేదా అనేది ప్రధానంగా వుండేది. మెల్లగా కుల ప్రస్తావన మొదలయింది. నా కులం తెలుసుకోవటానికి అడిగారు. నేను ఎవరికీ చెప్పేవాడిని కాదు. అయితే పత్రికల వారు తలుచుకుంటే అదేం పెద్ద సమస్య కాదు.

చూస్తుండగానే రిజర్వేషన్ల చిచ్చు... మైనారిటీ, దళితులు, అన్ని కులాల వారు, దళితుల మధ్య విభేదాలు... క్రమంగా ప్రాంతం, ప్రాంతాలు. ఇలా నిశ్శబ్దంగానూ, పెద్ద హోరుతోనూ సమాజం ముందుకు వచ్చాయి. అలాగే ఆడవారు ఓ సంచలనమే సృష్టించారు.

ఇలాంటి సమయంలో ఏదో పక్కకి వొరిగిపోకుండా చూడటం కష్టమైంది.

అప్పుడు జయదేవ్ మాస్టారి మాటలు గుర్తొచ్చాయి.

ఈ ప్రపంచీకరణ ఎవరినీ వదిలి పెట్టదని!

కార్మికులూ మారిపోయారు. వారిలోనూ వైట్ కాలర్ వేరు. సాధారణ కార్మికులు వేరు. ఒకప్పటి పోరాటాలు లేవు. ముఖ్యంగా శత్రువర్గం కార్మికుల్ని కూడా అన్ని రకాలుగా చీల్చేయగలిగింది.

ఎంత నిరాశ... ఎంత భయం... ఇవన్నీ అందరిలా నన్నూ కుదిపేస్తున్నాయి.

అయితే అక్కడక్కడా జరుగుతున్న పోరాటాలు, ప్రపంచంలో కొన్ని దేశాల్లో జరుగుతున్న పరిణామాలు మాత్రం- ఇవన్నీ తాత్కాలికం. ఎప్పటికయినా కార్మికులూ, రైతులూ చేసే పోరాటమే మనుషుల బతుకుల్లో మార్పు తెస్తుంది అన్న నమ్మకాన్ని కలిగిస్తున్నాయి..

అలాగే ఇంకొందరున్నారు. వారు పైకి బాగా మాట్లాడతారు. తమ కులం అనుకున్న వారిని గుర్తిస్తారు. వారి పుస్తకాలు ప్రచురిస్తారు. పార్టీలు ఇస్తారు. సభలు పెట్టిస్తారు. అవార్డులు యిస్తారు.

కొత్తగా వస్తున్న వారిలో టాలెంట్‌ని గుర్తించి వారిని కీర్తిస్తుంటారు. అలాంటి వారిని తామే ఐడెంటిఫై చేసామంటారు. ఇలాంటి వాటికి లోనయితే పోరాటాలు చేసేది వుండదు. ప్రకటనలు ఇవ్వటం తప్ప.

ఈసారి అర్చన ఓ బాంబ్ పేల్చింది.

****

అర్చన

అర్చన హైదరాబాద్ వచ్చేముందు మాకు ముందుగా చెప్పటంగానీ, కనీసం ఫోన్ అయినా చేయలేదు. అర్జెంట్‌గా ఏదో పనుండి వచ్చిందనుకున్నాను.

"ఇలా చెప్పకుండా వచ్చావేంటి అర్చనా" అని వెన్నెల అడిగితే నేను బావతో మాట్లాడాలి అందట.

"అర్చనా నీ ఎడ్యుకేషన్ ఎలా వుంది" అని అడిగాను.

"బాగానే చదువుతున్నాను బావా" అంది.

"ఫీజులు ఏమన్నా కట్టాలా?"

"అలాంటిదుంటే ఉత్తరం రాయటమో, ఫోన్ చేయటమో చేసేదాన్ని" అంది.

మరి సమస్య ఏమిటన్నట్లు చూసాను.

"నేను విస్సుని ప్రేమించాను" అంది.

"విస్సు ఎవరు?" అన్నాను.

"నాతోపాటు యస్.వి. యూనివర్సిటీలో చదువుతూ స్టూడెంట్ ఆర్గనైజేషన్లో పని చేస్తున్నాడు. నేను కూడా ఆ సభలకు వెళ్తుంటాను. అలా పరిచయం అయింది"

"ఆ సంఘం ఎవరదీ?"

"నువ్వు అడుగుతున్నది నాకు అర్థం అయింది. ఈ సంఘం వామపక్ష, విప్లవ సంఘాలకు చెందింది కాదు. భారతీయ విద్యార్థి పరిషత్"

అప్పుడు ఆశ్చర్యపోయాను. (ఇంకా ఉంది)

దుబాయ్ మాస్టర్స్ కబడ్డీ టోర్నీలో విజేతగా నిలిచిన దేశం పేరేమి?



కరెంట్ ఎఫైర్స్ ప్రాక్టీస్ బిట్స్

1. 2018 సంవత్సరానికిగాను ప్రతిష్ఠాత్మకమైన లిన్నీస్ అవార్డుకు ఎవరు ఎంపికయ్యారు ?
1. చార్లి జార్విస్ 2. కమల్‌జిత్ ఎస్.బవ
3. జార్జిన మేస్ 4. హన్స్ వాల్టర్ లాక్

2. లాన్సెట్ సంస్థ 195 దేశాలలో ఆరోగ్య సేవల నాణ్యతపై అధ్యయనం చేపట్టి రూపొందించిన జాబితాలో భారత్ ఎన్నవ స్థానంలో నిలిచింది ?
1. 144వ స్థానం 2. 145వ స్థానం
3. 146వ స్థానం 4. 147వ స్థానం

3. 24 ఏళ్ల వయసులోనే ఎనిమిదివేల మీటర్లకన్నా ఎత్తయిన ఆరు పర్వతాలను అధిరోహించి, రికార్డును సొంతం చేసుకున్న భారతీయ యువ పర్వతారోహకుడి పేరేమి ?
1. లవ్‌రాజ్ సింగ్ 2. బచేంద్రిపాల్
3. అర్జున్ వాజ్‌పేయీ 4. మధుసూధన్ పాటిదర్

4. 2018 సంవత్సరానికిగాను ప్రతిష్ఠాత్మకమైన ఉబెర్ కప్‌ను కైవసం చేసుకున్న దేశం పేరేమి ?
1. థాయ్‌లాండ్ 2. జపాన్
3. చైనా 4. దక్షిణ కొరియా

5. జవహర్‌లాల్ నెహ్రూ యాన్ ఇలస్ట్రేటెడ్ బయోగ్రఫీ పుస్తకాన్ని ఎవరు రాశారు ?
1. ప్రణబ్ ముఖర్జీ 2. మన్మోహన్ సింగ్
3. ఎ.గోపన్న 4. హమీద్ అన్సారీ

6. దేశంలో రెండవ క్షిపణి పరీక్ష కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడ ఏర్పాటు చేయడానికి కేంద్రప్రభుత్వం డీఆర్‌డీఓకు అనుమతులు జారీచేసింది ?
1. మచిలీపట్నం 2. నాగాయలంక
3. తిరుపూరు 4. నూజివీడు

7. 25వ ప్రపంచ మైనింగ్ సదస్సును ఎక్కడ నిర్వహించారు ?
1. ఆస్థానా (కజకిస్తాన్) 2. రియోడిజెనిరో (బ్రెజిల్)
3. ఇస్తాంబుల్ (టర్కీ) 4. టెహరాన్ (ఇరాన్)

8. ఎన్నవ ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్రమోడీ డెహ్రాడూన్‌లో 55 వేల మందితో నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు ?
1. 6వ యోగా దినోత్సవం 2. 5వ యోగా దినోత్సవం
3. 4వ యోగా దినోత్సవం 4. 3వ యోగా దినోత్సవం

9. జీవం పుట్టుక గుట్టును తేల్చే ప్రయత్నంలో భాగంగా జపాన్ ప్రయోగించిన 'హయబుసా 2' అన్వేషిణి 'ర్యుగ్యు' గ్రహ శకలాన్ని విజయవంతంగా చేరుకున్నది. ఈ అన్వేషిణిని ఎప్పుడు ప్రయోగించారు ?
1. 2013 డిసెంబర్ 3 2. 2014 డిసెంబర్ 3
3. 2015 డిసెంబర్ 3 4. 2016 డిసెంబర్ 3

10. జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్), ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) సంయుక్త ఆధ్వర్యంలో పోషకాహార విలువలపై 'న్యూట్రిఫై ఇండియా నౌ' పేరుతో మొబైల్ యాప్‌ను ఎన్ని భాషల్లో అందుబాటులోకి తెచ్చారు ?
1. 17 భాషలు 2. 16 భాషలు
3. 15 భాషలు 4. 14 భాషలు

11. పినాక రాకెట్‌కు తాజాగా దిక్సూచి, మార్గనిర్దేశ, నియంత్రణ కిట్‌ను జోడించడం వల్ల ప్రయాణించగలిగే సామర్థ్యం 40 కిలోమీటర్ల నుండి ఎన్ని కిలోమీటర్లకు పెరిగింది ?
1. 90 కిలోమీటర్లు 2. 80 కిలోమీటర్లు
3. 70 కిలోమీటర్లు 4. 60 కిలోమీటర్లు

12. 2018 సంవత్సరానికి ప్రతిష్టాత్మక 'స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్ బీ' విజేత ఎవరు ?
1. అనన్య వినయ్ 2. కార్తీక్ నెమ్మాని
3. గోకుల్ 4. అరవింద్

13. మిస్ క్వీన్ ఆఫ్ ఇండియా-2018 అందాల పోటీలో విజేతగా నిలిచినవారు ఎవరు ?
1. లక్ష్మీమీనన్ 2. ఐశ్వర్య సహదేవ్
3. సిమ్రాన్ మల్హోత్ర 4. తేజస్విని

14. బీబీసీ ఉమెన్స్ ఫుట్‌బాలర్ ఆఫ్ ది ఇయర్-2018 పురస్కార గ్రహీత ఎవరు ?
1. అలెక్స్ గ్రీన్‌వుడ్ 2. లూసీ బ్రాంజ్
3. డెమిస్టోక్స్ 4. జోర్డన్ నోబ్స్

15. ప్రపంచ శాంతి సూచీ-2018లో భారత్‌కు ఏ స్థానం లభించింది ?
1. 134వ స్థానం 2. 135వ స్థానం
3. 136వ స్థానం 4. 137వ స్థానం

16. ఫ్రెంచ్ ఓపెన్-2018లో మహిళల సింగిల్స్‌లో విజేత పేరేమి ?
1. స్లోన్ స్టీఫెన్స్ 2. సిమోనా హలెప్
3. సెరెనా విలియమ్స్ 4. మారియ షరపోవా

17. కొనుగోలు శక్తి క్షీణత అనే నవ్య ప్రామాణికవాదం ప్రాతిపదికన ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎకనామిక్స్ అండ్ పీస్ అనే అంతర్జాతీయ సంస్థ నివేదిక మేరకు దేశంలో నెలకొన్న హింస కారణంగా భారత్‌లో ప్రతి వ్యక్తి సగటున ఎన్ని వేల రూపాయలు కోల్పోయాడు ?
1. రూ.50 వేలు 2. రూ.40 వేలు
3. రూ.30 వేలు 4. రూ.20 వేలు

18. 'నోట్స్ ఆఫ్ ఎ డ్రీమ్ : ది ఆథరైజ్డ్ బయోగ్రఫీ ఆఫ్ ఎ.ఆర్.రెహమాన్' పుస్తక రచయిత ఎవరు ?
1. జుంపా లహరి 2. అమృత ప్రీతమ్
3. చేతన్ భగత్ 4. కృష్ణ త్రిలోక్

19. 2026 ఫిఫా ప్రపంచకప్‌కు ఏ మూడు దేశాలు ఉమ్మడిగా ఆతిథ్యం ఇవ్వనున్నాయి ?
1. యూఎస్, మెక్సికో, కెనడా 2. జర్మనీ, ఇంగ్లాండ్, స్పెయిన్
3. నైజీరియా, కోస్టారిక, పోలెండ్ 4. సెర్బియా, ఐస్‌లాండ్, ఈజిప్ట్

20. ఐఎస్ఓ 9001:2015 సర్టిఫికెట్‌ను పొందిన ఘనత దేశంలోనే మొట్టమొదటిసారిగా ఏ దేవస్థానానికి దక్కింది ?
1. మీనాక్షి అమ్మ దేవాలయం 2. సోమనాథ్ దేవాలయం
3. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి 4. జగన్నాథ్ దేవాలయం

21. 50-59 ఏళ్ల వయసున్న అంగన్‌వాడీల కొరకు కేంద్రప్రభుత్వం ప్రత్యేకంగా అంగన్‌వాడీ కార్యకర్త బీమా అమలు చేస్తోంది. ఈ పథకం కింద ఎంత విలువైన జీవితబీమాను ఇవ్వనుంది ?
1. రూ.30 వేలు 2. రూ.40 వేలు
3. రూ.50 వేలు 4. రూ.60 వేలు

22. యోగాలో విశేష ప్రతిభ కనబరుస్తున్నందుకుగాను బ్రిటన్ ప్రభుత్వం ఏ భారత సంతతి బాలుడిని 'బ్రిటిష్ ఇండియన్ ఆఫ్ ది ఇయర్' బిరుదుతో సత్కరించింది ?
1. ఈశ్వర్ శర్మ 2. పార్థిక్ నాయుడు
3. అరుణ్ జౌనస్వాల్ 4. రంజన్ కుమార్

23. నదీజలాల పంపకం విషయంలో తలెత్తిన వివాదాలన్నీ కొలిక్కి వచ్చినందువల్ల కావేరీ జల వివాదాల ట్రిబ్యునల్‌ను కేంద్రం రద్దు చేసింది. ఈ ట్రిబ్యునల్ ఎప్పుడు ఏర్పాటైంది ?
1. 1988 జూన్ 2న 2. 1989 జూన్ 2న
3. 1990 జూన్ 2న 4. 1991 జూన్ 2న

24. 45 ఏళ్ల పాకిస్థాన్ వన్డే క్రికెట్ చరిత్రలో డబుల్ సెంచరీ సాధించిన తొలి ఆటగాడిగా ఎవరు నిలిచారు ?
1. మొహమ్మద్ అమీర్
2. ఫఖర్ జమాన్
3. బాబర్ అజమ్
4. హసన్ అలీ



25. జాతీయ పోషకాహార సంస్థ అధ్యయనం ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏ వయసులోపు చిన్నారుల్లో నాలుగో వంతు వయసుకు తగిన బరువు, ఎత్తు లేక ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నారు ?
1. ఎనిమిదేళ్లు 2. ఏడేళ్లు
3. ఆరేళ్లు 4. ఐదేళ్లు

26. ఖేలో ఇండియా ప్రతిభాన్వేషణ కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా 734 మంది అథ్లెట్లకు క్రీడా ప్రాధికార సంస్థ ఏదాదికి ఎంత స్కాలర్‌షిప్‌ను అందజేయనుంది ?
1. రూ.1.2 లక్షలు 2. రూ.1.3 లక్షలు
3. రూ.1.4 లక్షలు 4. రూ.1.5 లక్షలు

27. ఏఐఎఫ్ఎఫ్ ప్రకటించిన వార్షిక అవార్డులలో 2017 సంవత్సరానికిగాను ఉమన్ ఫుట్‌బాలర్ ఆఫ్ ది ఇయర్ పురస్కారానికి ఎవరు ఎంపికయ్యారు ?
1. కమలాదేవి 2. ఇ.పథోయి చాను
3. నస్మితమాలిక్ 4. మనీషా పన్నా

28. బడా ఆర్థిక నేరగాళ్లు దేశం విడిచి పారిపోకుండా అడ్డుకునేందుకు ఉద్దేశించిన 'పరారీ ఆర్థిక నేరగాళ్ల బిలు-2018'ను పార్లమెంట్ ఎప్పుడు ఆమోదించింది ?
1. 2018 జూలై 24 2. 2018 జూలై 25
3. 2018 జూలై 26 4. 2018 జూలై 27

29. 2018 సంవత్సరానికి ప్రతిష్ఠాత్మక రావిశాస్త్రి స్మారక సాహిత్య పురస్కారం ఎవరికి దక్కింది ?
1. టి. పతంజలి శాస్త్రి 2. కొలకలూరి ఇనాక్
3. కె.రామచంద్రమూర్తి 4. పాలగుమ్మి పద్మరాజు

30. దుబాయ్ మాస్టర్స్ కబడ్డీ టోర్నీలో విజేతగా నిలిచిన దేశం పేరేమి ?
1. భారత్ 2. ఇరాన్
3. పాకిస్తాన్ 4. దక్షిణ కొరియా

31. ఇటీవల యునెస్కో ప్రపంచ చారిత్రక కట్టడాల జాబితాలో స్థానం దక్కించుకున్న భారతీయ కట్టడాలేవి ?
1. విరూపాక్ష దేవాలయం, హంపి 2. విక్టోరియా గోథిక్, ఆర్ట్ డెకో
3. అజంతా గుహలు, తాజ్‌మహల్ 4. ఫతేపూర్ సిక్రి, ఆగ్రా కోట

32. దేశంలో మొట్టమొదటి హిజ్రా న్యాయవాదిగా సత్యశ్రీ షర్మిల బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకున్నారు. ఈవిడ ఏ రాష్ట్రానికి చెందినవారు ?
1. ఉత్తరప్రదేశ్ 2. మధ్యప్రదేశ్
3. తమిళనాడు 4. కేరళ

33. 2011 జనాభా లెక్కలకు సంబంధించి దేశంలో ఎన్ని భాషలు లేదా మాండలికాల్లో మాట్లాడుతున్నట్లు రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ తాజాగా వెల్లడించారు ?
1. 16.569 2. 17,569
3. 18,569 4. 19,569

34. బెర్లిన్‌లో ముగిసిన ప్రపంచ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిలో పురుషుల డిస్కస్ త్రోలో యోగేశ్ డిస్క్‌ను ఎన్ని మీటర్ల దూరం విసిరి కొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు ?
1. 43.18 మీటర్లు
2. 22.18 మీటర్లు
3. 45.18 మీటర్లు
4. 46.18 మీటర్లు

35. పశుపక్ష్యాదులు, జలచరాల రక్షణ, సంక్షేమం కోసం ఏ రాష్ట్ర హైకోర్టు వాటికి 'చట్టబద్ధమైన వ్యక్తులు లేదా అస్తిత్వం' హోదాని కల్పిస్తూ అరుదైన తీర్పునిచ్చింది ?
1. ఉత్తరాఖండ్
2. అసోం
3. నాగాలాండ్
4. జార్ఖండ్

36. అంతర్జాతీయ మెట్ట పంటల పరిశోధన సంస్థ నూతనంగా అందుబాటులోకి తీసుకొచ్చిన జొన్న వంగడం పేరేమి ?
1. ఎన్ఎస్‌జీ 59-3 2. జవహర్‌చారి 6
3. పర్బణీ శక్తి 4. పుసచారి హైబ్రీడ్ 109

37. మీనాక్షి అమ్మ అవార్డు ఎక్స్‌లెన్సీను 2018 సంవత్సరానికి గాను శ్రీసాయి నటరాజ అకాడమీ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ సంస్థ ఎవరికి ప్రదానం చేసింది ?
1. పసుమర్తి శేషుబాబు 2. పసుమర్తి రత్తయ్య శర్మ
3. పి.రమాదేవి 4. భాగవతుల సేతూరామ్

38. జాతీయ మానవహక్కుల కమిషన్ రజతోత్సవం సందర్భంగా లోగో, ట్యాగ్‌లైన్‌ల రూపకల్పన ఆహ్వాన పోటీలలో విజేతలుగా నిలిచినవారెవరు ?
1. అశోక్ చక్రవర్తి, విజయనిర్మల 2. బన్సీలాల్ కెట్కి, తబ్రేజ్ ఖురేషి
3. అరవింద్ సిన్హా, సంజన 4. కె.సుబ్బారావు, రామకృష్ణ

39. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన అగ్నిపర్వతమైన 'ఓజోస్ డెల్ సలాడో'ను అధిరోహించిన రెండవ భారతీయుడిగా గుర్తింపు పొందినవారెవరు ?
1. కొలిన్ గొన్సాల్వ్స్ 2. సత్యరూప్ సిద్ధాంతహాన్
3. సౌమిత్రీ ఛటర్జీ 4. రాజ్‌కుమార్

40. బుకర్‌ప్రటీప్రైజ్ స్థాపించి 50 ఏళ్లు అయిన సందర్భంగా గత యాభై ఏళ్లలో బుకర్ ప్రైజ్ సాధించిన పుస్తకాల్లో అత్యుత్తమమైందిగా ఏ పుస్తకాన్ని గోల్డెన్ మ్యాన్ బుకర్ ప్రైజ్‌కు ఎంపిక చేశారు ?
1. ద ఇన్‌హెరిటెన్స్ ఆఫ్ లాస్ 2. మిడ్‌నైట్ చిల్డ్రన్
3. ఇన్ ఎ ఫ్రీ స్టేట్ 4. ద ఇంగ్లిష్ పేషెంట్

సమాధానాలు

1. 2	2. 2	3. 3	4. 2	5. 3	6. 2
7. 1	8. 3	9. 2	10. 1	11. 3	12. 2
13. 1	14. 2	15. 3	16. 2	17. 2	18. 4
19. 1	20. 3	21. 1	22. 1	23. 3	24. 2
25. 4	26. 1	27. 1	28. 2	29. 2	30. 1
31. 2	32. 3	33. 4	34. 3	35. 1	36. 3
37. 2	38. 2	39. 2	40. 4		

ఎస్‌బీఐలో 42 ఉద్యోగాలు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వివిధ విభాగాల్లోని 42 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

స్పెషలిస్ట్ కేడర్ (రెగ్యులర్/కాంట్రాక్టు) :
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రెగ్యులర్/ కాంట్రాక్టు పద్ధతిలో 11 స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

డిప్యూటీ మేనేజర్ (ఐఎస్ ఆడిట్) : 6
సీనియర్ ఎగ్జిక్యూటివ్ (ఐఎస్ ఆడిట్) : 5

అర్హత : ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ కంప్యూటర్ సైన్స్/ కంప్యూటర్ అప్లికేషన్/ ఎలక్ట్రానిక్స్ / ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో బీఈ/ బీటెక్ ఉత్తీర్ణతతో పాటు కనీసం మూడేళ్ల పని అనుభవం ఉండాలి.

వయసు : 2018, జులై 1 నాటికి 21-35 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, పీడబ్ల్యూడీ జనరల్ అభ్యర్థులకు పదేళ్లు, పీడబ్ల్యూడీ ఓబీసీ అభ్యర్థులకు పదమూడేళ్లు గరిష్ట వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక : షార్ట్ లిస్టింగ్ కమ్ ఇంటరాక్షన్ ఆధారంగా.
దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో.
దరఖాస్తు ఫీజు : జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.600; ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు రూ.100.
దరఖాస్తుకు చివరితేదీ : ఫిబ్రవరి 11, 2019.

స్పెషలిస్ట్ కేడర్ (రెగ్యులర్) :
విభాగాల వారీ ఖాళీలు : డిప్యూటీ మేనేజర్ (డెబిట్ కార్డ్ ఆపరేషన్స్)-1, డిప్యూటీ మేనేజర్ (గవర్నమెంట్ ఈ-మార్కెటింగ్)-1, మేనేజర్ (డెబిట్ కార్డ్ మార్కెటింగ్)-1, మేనేజర్ (స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్)-3, మేనేజర్ (ట్రాన్సిస్ట్/స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్)-3, మేనేజర్ (యూపీఐ అండ్ అగ్రిగేటర్)-7.

అర్హత : కనీసం 60 శాతం మార్కులతో ఎంబీఏ/ పీజీడీఎం/ పీజీడీబీఎం ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
వయసు : డిసెంబర్ 1, 2018 నాటికి 27-37 మధ్య ఉండాలి.
ఎంపిక : షార్ట్ లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో.
దరఖాస్తు ఫీజు : జనరల్, ఓబీసీలకు రూ.600; ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు రూ.100.
దరఖాస్తుకు చివరితేదీ : ఫిబ్రవరి 11, 2019.

సీనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు :
ఎస్‌బీఐ-సెంట్రల్ రిక్రూట్‌మెంట్ అండ్ ప్రమోషన్ డిపార్ట్‌మెంట్ కాంట్రాక్టు పద్ధతిలో 15 సీనియర్ ఎగ్జిక్యూటివ్ (క్రెడిట్ రివ్యూ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

ఖాళీల వివరాలు : జనరల్-9, ఓబీసీ-3, ఎస్సీ-2, ఎస్టీ-1.

వయసు : 2018, డిసెంబర్ 1 నాటికి 25-35 ఏళ్లు. గరిష్ట వయోపరిమితిలో ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ(నాన్ క్రీమీలేయర్)లకు మూడేళ్లు; పీడబ్ల్యూడీలో ఎస్సీ/ఎస్టీలకు 15 ఏళ్లు, ఓబీసీలకు 13 ఏళ్లు, జనరల్ అభ్యర్థులకు 10 ఏళ్లు గరిష్ట వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.

విద్యార్హత : 2018, డిసెంబర్ 1 నాటికి చార్టర్డ్ అకౌంటెంట్/ఎంబీఏ (ఫైనాన్స్)/ మాస్టర్ ఇన్ ఫైనాన్స్ కంట్రోల్/ మాస్టర్ ఇన్ మేనేజ్‌మెంట్ స్టడీస్/ పీజీడీఎం (ఫైనాన్స్) ఉత్తీర్ణతతో పాటు కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి.

ఎంపిక : షార్ట్ లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో.
దరఖాస్తు ఫీజు : జనరల్, ఓబీసీలకు రూ.600; ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు రూ.100.
దరఖాస్తుకు చివరితేదీ : ఫిబ్రవరి 11, 2019.
పూర్తి వివరాలకు వెబ్‌సైట్ : https://bank.sbi/careers

విశాలాంధ్ర బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	బంగారం (విశాఖపట్నం)	వెండి (విజయవాడ)	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs రూపాయి
-368.84	-119.00	925	31,290	900	41,300	71.10
35,656.70	10,661.55	30,060	ప్రొద్దుటూరు 31,290	40,900	ప్రొద్దుటూరు 42,149	
		22 క్యారెట్లు, 10 గ్రాములు	22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
జీ-ఎంటర్‌టైన్	373.30	17.24
భారతీ ఇన్‌ఫ్రాటెల్	287.30	2.70
కోల్ ఇండియా	225.20	1.92
టీసీఎస్	1,962.00	1.78
లార్సెన్	1,337.90	1.17

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
అదానీపోర్ట్స్	326.10	-12.77
ఇండియాబుల్స్	699.30	-5.51
ఎస్-బ్యాంక్	207.50	-5.51
బజాజ్ ఫైనాన్స్	2,610.00	-5.43
బజాజ్ ఫిన్‌సర్వ్	6,352.80	-4.28

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ. విలువ క్రి. ముగింపు	రూ. విలువ ప్ర. ముగింపు
డాలర్	71.18	71.10
యూరో	80.65	81.16
పౌండ్	93.12	93.48
ఆస్ట్రేలియా డాలర్	50.64	50.96
సింగపూర్ డాలర్	52.48	52.52

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	31,279	33,443
చెన్నై	31,270	33.443
బెంగళూరు	30,700	32,834
ముంబై	31,720	33,925
విజయవాడ	-	33,850
విశాఖపట్నం	31,290	33,450
ప్రొద్దుటూరు	31.290	32,850
ముడి చమురు		61.64

మీడియా-ఎంటర్‌టైన్‌మెంట్ జోరు

- 2020 నాటికి రూ.3.73 లక్షల కోట్లకు చేరుకోనున్న రంగం
- అసోచామ్-పీడబ్ల్యూసీ సంయుక్త సర్వే వెల్లడి



న్యూఢిల్లీ : దేశంలో మీడియా-ఎంటర్‌టైన్‌మెంట్ రంగం శరవేగంగా పుంజుకుంటున్నది. 2022 నాటికి ఈ రంగం 52,683 మిలియన్ డాలర్లకు చేరుకోనుందని ఒక సర్వే వెల్లడించింది. మన కరెన్సీలో ఇది రూ.3.73 లక్షల కోట్లు. రోజురోజుకు సంపాదన పెరుగుతుండటం, జనాభా, అన్ని ఫార్మెట్లలో కంటెంట్ వినియోగం ఊపందుకోవడం ఈ రంగం పుంజుకోవడానికి ప్రధాన కారణమని అసోచామ్-పీడబ్ల్యూసీ సంయుక్త సర్వే విశ్లేషించింది. సంప్రదాయక మీడియాలో టీవీ, సినిమాలు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో ఓవర్-ది-టాప్(ఓటీటీ) సేవలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపింది. వచ్చే నాలుగేండ్లకాలంలో దేశీయ వీడియో ఓటీటీ మార్కెట్... టాప్-10 ప్రపంచ మార్కెట్లో ఒకటిగా ఉండనున్నదని తెలిపిన సర్వే..2022 నాటికి ఓటీటీ మార్కెట్ 823 మిలియన్ డాలర్లకు(రూ.5,363 కోట్లు) ఎగబాకనున్నదని పేర్కొంది. 2017లో 11.7 శాతం వృద్ధితో 30,364 మిలియన్ డాలర్లుగా ఉన్న మీడియా-ఎంటర్‌టైన్‌మెంట్ ఇండస్ట్రీ..2022 నాటికి 52,683 మిలియన్ డాలర్లకు చేరుకోనున్నదని నివేదిక అంచనావేస్తున్నది. ప్రతియేటా సగటున రెండంకెల వృద్ధిని నమోదు చేసుకుంటున్నదని పేర్కొంది. వచ్చే నాలుగేండ్లలో కూడా మొత్తం ఎంటర్‌టైన్‌మెంట్ ఇండస్ట్రీలో టీవీ, సినిమా, ఓటీటీల వాటా 46 శాతంగా ఉండనున్నదని తెలిపింది. ఓటీటీ సేవలతోపాటు వీడియో-ఆన్-డిమాండ్(వీవోడీ)లు కీలకపాత్ర పోషిస్తున్నాయని, అలాగే ప్రొడక్షన్ బడ్జెట్ కంపెనీలైన నెట్‌ఫ్లిక్స్, అమెజాన్‌లు సంప్రదాయక స్టూడియోలను ఏర్పాటు చేయడం కూడా పోటీ మరింత పెరుగడానికి ప్రధాన కారణమని పీడబ్ల్యూసీ ఇండియా పార్టనర్ ఫ్రాంక్ డీసౌజా తెలిపారు.

సర్వేలోని పలు ముఖ్యాంశాలు..

- అంతర్జాతీయంగా ఓటీటీ మార్కెట్ 10.1 శాతం వృద్ధిని నమోదు చేసుకోనున్నది.
- భారత్ విషయానికి వస్తే 297 మిలియన్ డాలర్ల(రూ.1,932 కోట్లు) నుంచి 823 మిలియన్ డాలర్లకు(రూ.5,363 కోట్లు) చేరుకోనున్నది. సగటున 22.6 శాతం వృద్ధి నమోదవనున్నది.
- వీటిలో వీవోడీ చందదారులు కీలకపాత్ర పోషించనున్నారు. గడిచిన పదేండ్లలోప్రపంచవ్యాప్తంగా వీవోడీకి మంచి డిమాండ్ నెలకొన్నది.
- భారత్‌లో అత్యధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్న మొబైల్ వీడియో అడ్వర్టైజింగ్ సగటున 32.8 శాతం వృద్ధితో 317 మిలియన్ డాలర్లకు(రూ.2,064 కోట్లు) చేరుకోనుందన్న అంచనా.
- డాటా వినిమయం 71,67,103 మిలియన్ల మెగాబైట్ల నుంచి 10,96,58,793 మిలియన్ మెగాబైట్లకు చేరుకోనున్నది.
- డాటా టారిఫ్ ధరలు తక్కువగా ఉండటం, స్మార్ట్‌ఫోన్ల వినిమయం ఊపందుకోవడంతో వీవోడీ అభివృద్ధిదారులకు ప్రయోజనం చేకూరనున్నది.
- తలసరి భారతీయుడిపై పెట్టే ఖర్చు 32 డాలర్లకు చేరుకోనున్నది. ఇది చైనాలో పెడుతున్న 222 డాలర్‌తో పోలిస్తే చాలా తక్కువ.



రైతు ఉత్పత్తిదారుల సంఘాలు కీలకపాత్ర

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: వ్యవసాయం గిట్టుబాటు కావటంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు కీలకపాత్ర పోషిస్తాయని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డా.డి.రాజిరెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం పంటల ఉత్పత్తి, ఉత్పాదకతలు బాగా పెరిగాయని ఆయనన్నారు. శాస్త్రవేత్తలు, పరిశోధకులు అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్ షిప్‌లపై దృష్టిపెట్టాలని ఆయన సూచించారు. పీపుల్ సెంట్రిక్ డెవలప్‌మెంట్ అన్న అంశంపై రెండు రోజులపాటు జరిగే ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను ఆయన సోమవారం ఉదయం విస్తరణ విద్యాసంస్థ సెమినార్‌హాల్‌లో ప్రారంభించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్, ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ డా.లక్ష్మణ్ తెలిపారు. విస్తరణ, బోధన, పరిశోధన, విభాగాల ప్రొఫెసర్లు ఈ శిక్షణకి హాజరవుతారని ఆయన వివరించారు. హైదరాబాద్ తర్వాత జగిత్యాల, పాలెంలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. వ్యవసాయంతోపాటు రైతాంగానికి ఇతర జీవనోపాధి మార్గాల్లో ప్రవేశం అవసరమని టిఐఎస్ఎస్ ప్రోగ్రామ్ డైరెక్టర్ డా.శ్రీనివాస్ అన్నారు. రైతాంగానికి వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు అవసరమైన అంశాల్లో శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లకి శిక్షణ ఇచ్చేందుకే పిజెటిఎస్ఎయుతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఈ రెండురోజుల కార్యక్రమంలో వివిధ రకాల జీవనోపాధులు, సామూహిక భాగస్వామ్యం, ఎఫ్‌పిఒల ద్వారా అగ్రిబిజినెస్, సన్న, చిన్నకారు రైతులకి మార్కెట్ అనుసంధానం తదితర అంశాల్లో చర్చలు జరుపనున్నారు. దీనిలో వ్యవసాయవిర్సిటీ పరిధిలోని కళాశాలలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, పరిశోధనస్థానాల ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

జియోలో కొత్త అప్లికేషన్



ప్రముఖ టెలికాం కంపెనీ రిలయన్స్ జియో మరో సరికొత్త అప్లికేషన్‌తో ముందుకు వచ్చింది. ప్రస్తుతం రైలు టిక్కెట్‌లను బుక్ చేసుకునేందుకు ఉపయోగిస్తున్న ఐఆర్‌సీటీసీ యాప్ లాగే సేవలందించే 'జియో రైల్' యాప్‌ను కంపెనీ ప్రారంభించింది. ఈ యాప్ ద్వారా వినియోగదారులు డెబిట్, క్రెడిట్ కార్డులు, ఈ- వాలెట్‌లను ఉపయోగించి రైలు టికెట్‌లను బుక్ చేసుకోవచ్చు. రైళ్ల రాకపోకలకు సంబంధించిన సమాచారం, పీఎన్‌ఆర్ స్టేటస్, సీట్ల లభ్యత, టిక్కెట్‌ల రద్దు వంటి సేవలను ఈ యాప్‌లో పొందుపరిచారు. అంతేకాకుండా చివరి నిమిషాల్లో ప్రయాణం కోసం బుక్ చేసుకునే తత్కాల్ టికెట్‌లకు కూడా ఈ యాప్‌ను ఉపయోగించి బుక్ చేసుకోవచ్చు. ఒకవేళ వినియోగదారులకు ఐఆర్‌సీటీసీ ఖాతా లేకపోయినప్పటికీ 'జియో రైల్' యాప్‌లో కొత్త ఖాతా సృష్టించుకోవచ్చు. ఈ అప్లికేషన్ 'జియో యాప్ స్టోర్'లో వినియోగదారులకు అందుబాటులో ఉంది.


భారత్ టాప్ బ్రాండ్ 'టాటా'



న్యూఢిల్లీ : టాటా గ్రూప్ 2019 నాటికి 37 శాతం వృద్ధి సాధించి 19.5 బిలియన్ డాలర్ల సంపదతో తొలి 100 గ్లోబల్ బ్రాండ్ జాబితాలో చేరింది. దీంతో టాటా భారత్‌లో టాప్ బ్రాండ్‌గా నిలిచింది. తొలి 100 గ్లోబల్ బ్రాండ్‌లలో టాటా గ్రూప్ తప్ప మరో భారత కంపెనీ నిలువలేకపోయింది. గ్లోబల్‌గా టాటా 86వ స్థానంలో ఉంది. టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ ఈ ఘనతపై మాట్లాడుతూ ' ఈ గౌరవం అభించడంతో సామాజికంగా మరింత బాధ్యతతో అభివృద్ధి చెందడానికి కృషి చేస్తాం' అని తెలిపారు. ఈ ఘనతకు కారణంలో టాటా సాఫ్ట్‌వేర్ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌దే ముఖ్య పాత్ర కాగా, టాటా ఆటోమోటివ్, టాటా స్టీల్ వంటి కంపెనీలు టాటా గ్రూప్ బ్రాండ్ విలువ పెంచడంలో సహాయపడినట్లు తెలుస్తుంది.

ఎయిర్ ఇండియాకు రూ.1,500 కోట్లు!

న్యూఢిల్లీ : నిధులు లేక సతమతమవుతున్న ప్రభుత్వరంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియాను ఆదుకోవడానికి సిద్ధమైంది కేంద్ర ప్రభుత్వం. ఈవారంలో సంస్థకు రూ.1,500 కోట్ల నిధులను కేటాయించే అవకాశం ఉన్నదని ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. సంస్థను ఆర్థికంగా ఆదుకోవడానికి రూ.2,345 కోట్ల నిధుల కేటాయింపునకు గత నెలలో పార్లమెంట్ ఆమోదం తెలిపింది. దీనిపై పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అధికారి మాట్లాడుతూ..ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇలా నిధులను కేటాయించడం ఇది రెండోసారని పేర్కొన్నారు. ప్రస్తుతం సంస్థకు రూ.55 వేల కోట్ల అప్పు ఉన్నది.



ఫెనెస్టా షోరూమ్ ప్రారంభం


విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ప్రముఖ కిటికీలు, తలుపుల తయారీదారు ఫెనెస్టా హైదరాబాద్‌లో మరొక కొత్త షోరూంను ప్రారంభించింది. అత్తాపూర్‌లోని 204 పిల్లర్ ఎదురుగా ఎక్స్‌క్లూజివ్ షోరూంను ప్రారంభించి అత్యుత్తమ శ్రేణి కిటికీలు, తలుపులను అందించనుందని ఫెనెస్టా బిల్డింగ్ సిస్టమ్స్ బిజినెస్ హెడ్ మిస్టర్ సాకేత్ జైన్ తెలిపారు. వినియోగదారుడి పట్ల నిబద్ధత, అద్భుతరీతిలో ఉత్పత్తుల పోర్ట్ ఫోలియోల కలయిక తమ అభివృద్ధికి దోహదపడ్డాయన్నారు. యూపివిసి తలుపులు, కిటికీలు, తలుపులలో ఉన్నటువంటి విభిన్నరకాల డిజైన్‌లు, రంగులన్నీ హైదరాబాద్‌లోని ఫెనెస్టా షోరూంలో అందుబాటులో ఉంటాయని, ఈ కొత్త షోరూం ప్రారంభంతో ఫెనెస్టా 230 ప్రాంతాల్లో విస్తరించిందన్నారు. ఉత్పత్తులలో ఉపయోగించే యూపివీసి తయారీ మొదలుకొని, పూర్తయిన ప్రొడక్ట్‌ను ఇన్‌స్టాల్ చేయడమేకాక కొనుగోళ్ళు పూర్తయ్యాక అందించే సేవలు మొదలగు అన్ని రకాల కార్యకలాపాలూ పూర్తిగా ఫెనెస్టా ఆధీనంలోనే జరుగుతాయన్నారు. దేశంలోని ప్రముఖ బిల్డర్లు, ఆర్కిటెక్ట్‌లు, ఇంటీరియర్ డిజైనర్లలో ఫెనెస్టా ఉత్పత్తులు ఇప్పటికే ప్రాచుర్యం పొందుతున్నాయని తెలిపారు.

ఇంటెలిజెన్స్ ఇండియాతో ఎక్వ్యూస్ ఒప్పందం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: కర్ణాటకకు చెందిన ఏరోస్పేస్ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీ ఏక్వ్యూస్ హైదరాబాద్‌కు చెందిన ఇంటెలిజెన్స్ ఇండియా సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌తో ఒప్పందం చేసుకుంది. సాప్ ఎస్/4 హెచ్ఎఎన్ఎ ఇఆర్పీ నవీకరణ కోసం ఈ ఒప్పందం చేసుకున్నట్లు ఏక్వ్యూస్ సిఎఫ్‌ఓ రాజీవ్ కౌల్ నేడొక ప్రకటనలో తెలిపారు. సాప్ ఇఆర్పీతో నిర్వహణ వ్యయంతో తగ్గడంతో పాటూ డిజిటల్ వేదికగా వివిధ వ్యాపార మాధ్యమాలను సలువుగా నిర్వహించే వీలుంటుందన్నారు.

జపాన్‌ను వెనక్కునెట్టిన భారత్

అత్యధిక స్టీల్ ఉత్పత్తి చేసే 2వ దేశంగా రికార్డు



న్యూఢిల్లీ : అత్యధిక స్టీల్ ఉత్పత్తి చేసే దేశంగా భారత్ 2వ స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో భారత్ జపాన్‌ను వెనక్కు నెట్టింది. వరల్డ్ స్టీల్ అసోసియేషన్ ప్రకటించిన నివేధిక ప్రకారం చైనా ప్రపంచ వ్యాప్తంగా 51 శాతం స్టీల్ ఉత్పత్తితో తొలి స్థానంలో ఉంది. చైనా 2018 ఏడాదికి గానూ 928.3 మిలియన్ల టన్నుల స్టీల్ ఉత్పత్తి చేయగా భారత్ 106.5 మిలియన్ల టన్నుల క్రూడ్ స్టీల్‌ను ఉత్పత్తి చేసినట్లు ఇది 2017 ఏడాది కంటే 4.9 శాతం అధికమని తెలిపింది. జపాన్ 2017లో రెండో స్థానంలో ఉండగా 2018లో 104.3 మిలియన్ల టన్నులు ఉత్పత్తి చేయడంతో రెండో స్థానాన్ని భారత్‌కు కోల్పోయింది. అమెరికా నాలుగు, దక్షిణ కొరియా ఐదు, రష్యా ఆరవ స్థానాల్లో ఉన్నాయి.

నష్టాలతో ఆరంభం..

ముంబై: దేశీయ స్టాక్‌మార్కెట్లు సోమవారం తీవ్ర నష్టాలకు గురయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లు సానుకూలంగా ఉన్నప్పటికీ దేశీయంగా అమ్మకాల ఒత్తిడినెదుర్కొన్నాయి. ఉదయం 9.37 సమయంలో సెన్సెక్స్ 114 పాయింట్లు నష్టపోయి 35,911 వద్ద, నిఫ్టీ 55 పాయింట్లు నష్టపోయి 10,725 వద్ద ట్రేడ్ అయ్యింది. సగం సెషన్ నుంచి ఊపందుకున్న అమ్మకాలు చివరి వరకూ కొనసాగాయి. చివరికి సెన్సెక్స్ 369 పాయింట్లు పతనమై 35,656.70 వద్ద, నిఫ్టీ 119 పాయింట్లు క్షీణించి 10,661.55ల వద్ద స్థిరపడ్డాయి. డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో భారీ కంపెనీలు ఆశించిన ఫలితాలను వెల్లడించకపోవడం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ముఖ్యంగా మారుతీ సుజుకీ లాభాల్లో తగ్గుదల ఆటోమొబైల్ రంగంలోని షేర్లపై కూడా కొంత ప్రభావం చూపింది. ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ సీఈవో చందాకొచ్చర్‌పై సీబీఐ కేసును నమోదు చేయడంతో ఆ సంస్థ షేర్లు ఒత్తడికి గురయ్యాయి. దీంతో మదుపర్లు విక్రయాలకు పాల్పడ్డారు. దీనికి తోడు హెచ్‌డీఎఫ్‌సీ, ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ బ్యాంక్ షేర్ల నష్టాలు సూచీలను కుంగదీశాయి.

ముఖ్యంగా అదానీ గ్రూపు షేర్లు 10శాతం కుప్పకూలాయి. ఫార్మా, మెటల్, ఆటో, ఎనర్జీ, పవర్ అండ్ గ్యాస్ సెక్టార్లలో భారీగా అమ్మకాల ఒత్తిడి కనిపించింది. ఒక్క మీడియా షేర్లు మాత్రం స్వల్పంగా లాభపడింది. రానున్న యూనియన్ బడ్జెట్ నేపథ్యంలో ఇన్వెస్టర్లు అమ్మకాలకు తెరతీసినట్టు మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. క్యాడిలా, అపోలో, దివీస్ 2 శాతం కుప్పకూలగా, బ్యాంకింగ్లో ఎస్ బ్యాంకు, ఇండస్ ఇండ్, ఐసీఐసీఐ నష్టపోయాయి. జీ ఎంటర్‌టేనర్స్, కోల్ ఇండియా, టీసీఎస్ లాభ పడ్డాయి.

ఆర్‌బీఎల్ బ్యాంకు లాభం రూ.225 కోట్లు



న్యూఢిల్లీ : డిసెంబర్ త్రైమాసికం 2018-19 ఆర్థిక సంవత్సరలాభాలను ఆర్‌బీఎల్ బ్యాంకు ప్రకటించింది. ఈ త్రైమాసికంలో లాభం 36 శాతం పెరిగి రూ.225 కోట్లు ఆర్జించినట్లు బ్యాంకు ఓ ప్రకటనలో తెలిపింది. '2018లో మొత్తంగా రూ.1,029.20 కోట్లు లాభం వచ్చింది. ఇది 2017 కంటే 42 శాతం అధికం. ఆస్తుల పరంగా బ్యాంకు వృద్ధి చూపించింది. ఎన్‌పీఏ ఎకౌంట్లలోనూ తగ్గుదల ఉంది. ఎన్‌పీఏ అకౌంట్లు 1.38 శాతమే నమోదయ్యాయి. డిసెంబర్ చివరి నాటికి డిపాసిట్లు మొత్తం రూ. 52,187.10 కోట్లకు చేరాయి. గత ఏడాది కంటే 35 శాతం అధికం. కంరెండు అకౌంట్లు, సేవింగ్స్ అకౌంట్ల నిష్పత్తి కూడా 24.57 శాతం పెరిగింది. బ్యాంకు క్రమంగా అభివృద్ధి చూపెడుతోంది. బ్యాంకు ఆస్తులు కూడా పెరుగుతున్నాయి. గ్రామీణ, చిన్న పట్టణాల్లో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఆర్‌బీఎల్ ఫిన్‌సర్వ్ ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నామని బ్యాంకు సీఈఓ విశ్వవీర్ అహుజా తెలిపారు. ఆర్‌బీఎల్ షేర్ స్టాక్స్‌లో రూ.563గా ట్రేడ్ అవుతోంది.

మంచి నీటి రొయ్యతో కోట్ల పంట!

- ▲ గతేడాది 11 రిజర్వాయర్లలో 1.08 కోట్ల రొయ్య పిల్లలసాగు
- ▲ రూ.1.33 కోట్ల పెట్టుబడితో మత్స్యకారులకు రూ.8.06 కోట్లు లాభం



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మంచినీటి (నీలకంఠ) రొయ్యల సాగు గత ఏడాది కోట్లల్లో లాభాలను తెచ్చిపెట్టింది. ఈ ఏడాది కూడా నీలకంఠ రొయ్యలు మత్స్యకారులకు కాసులు కురిపించనున్నాయి. మంచినీటి రొయ్యలు కావడంతో పొరుగు రాష్ట్రాలతోపాటు ఐరోపావంటి దేశాల్లోనూ వీటికి మంచి డిమాండ్ ఉన్నది. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆలోచనతో గతేడాది రాష్ట్రవ్యాప్తంగా 11 రిజర్వాయర్లలో ప్రయోగాత్మకంగా చేపట్టిన నీలకంఠ రొయ్యల సాగు సత్ఫలితాలనివ్వడంతో మత్స్యశాఖ ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 24 రిజర్వాయర్లలో ఈ రొయ్య పిల్లలను వదిలింది. గతేడాది రూ.1.33 కోట్ల పెట్టుబడితో 1.08 కోట్ల రొయ్య పిల్లలను జలాశయాల్లోకి వదలగా మత్స్యకారులకు రూ.8.06 కోట్ల మేర లాభం చేకూరింది. దీంతో ఈసారి రొయ్యల సాగుకు మత్స్యశాఖ రూ.6.28 కోట్లు వెచ్చించింది. రాష్ట్రవ్యాప్తంగా 24 రిజర్వాయర్లలో గత అక్టోబర్‌లో 3.19 కోట్ల పిల్లలను వదిలింది. ఫిబ్రవరి చివరివారం నుంచి ఏప్రిల్ వరకు ఇవి మార్కెట్‌లోకి రానున్నాయి.

నీలకంఠ రొయ్యలకు డిమాండ్

నీలకంఠ రొయ్య పిల్లలు నాలుగు నుంచి ఆరునెలల్లో 100 గ్రాముల వరకు బరువు పెరుగుతాయి. రెండు పొడవైన కాళ్లు కలిగి, 1.5 అంగుళాల సైజులో ఉంటాయి. మంచినీటిలో పెరిగిన రొయ్యలు కావడంతో పక్కరాష్ట్రాలతోపాటు ఐరోపా దేశాల్లోనూ వీటికి మంచి డిమాండ్ ఉంటుదని అధికారులు చెప్తున్నారు. తొలుత 4.07 కోట్ల రొయ్యపిల్లలు పంపిణీ చేయాలనుకున్నా జలాశయాల్లో అనుకున్న మేర నీరు లేకపోవడంతో సంఖ్య తగ్గిందని మత్స్యశాఖ అధికారులు వెల్లడించారు. కిలో రొయ్యల ధర రూ.250 నుంచి రూ.300 వరకు పలుకుతుంది. ఇది మత్స్యకారులకు ఎంతో మేలుచేస్తున్నదని మత్స్యశాఖ ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. గతేడాది ప్రయోగాత్మకంగా 11 రిజర్వాయర్లలో రొయ్యల పెంపకాన్ని చేపట్టారు. ఒక్కో రొయ్యకు రూ.1.29 చొప్పున 1.08 కోట్ల పిల్లలు కొనుగోలు చేయగా, రూ.8.06 కోట్ల లాభాలు వచ్చాయి. సుమారు 10 వేల మంది మత్స్యకారులు లబ్ధిపొందారు. ఈసారి ఒక్కో రొయ్యపై రూ.1.96 ఖర్చుచేశారు. దీంతో 24 రిజర్వాయర్ల పరిధిలో 25 వేల మందికిపైగా మత్స్యకారులకు లబ్ధిచేకూరే అవకాశాలున్నాయి. ఎస్సారెస్పీ ప్రాజెక్టులో అత్యధికంగా 1.25 కోట్ల రొయ్య పిల్లలను వదిలారు. లోయర్ మానేరులో 29.50 లక్షలు, ఎల్లంపల్లిలో 29.15 లక్షలు, సింగూరులో 28.09 లక్షల రొయ్యలు వదిలారు. వీటితోపాటు బొగులాంపల్లి, కడెం, మిడ్ మానేరు, అప్పర్ మానేరు, పోచారం, సత్నాల, మత్తడివాగు, కుమ్రంభీం, మూసీ, డిండి, పాలేరు, వైరా, లంకసాగర్, పెద్దవాగు, ఘన్‌పూర్, రామప్ప, లక్నవరం, శనిగరం, తపాస్‌పల్లి ప్రాజెక్టుల్లో ఈ రొయ్యలను పెంచుతున్నారు.

చోక్సీని భారత్‌కు అప్పగించం!

- ఇప్పుడు ఆంటిగ్వా పౌరుడు
- ఆయన్ను బలవంతంగా తీసుకుపోలేరు
- అక్కడి సీనియర్ ప్రభుత్వ అధికారి వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : మెహుల్ చోక్సీ ఇప్పుడు ఆంటిగ్వా పౌరుడు. ఆయన్ను బలవంతంగా ఎవరూ భారత్‌కు తీసుకుపోలేరు అని ఆంటిగ్వా-బార్బుడా ప్రధా ని కార్యాలయం సిబ్బంది చీఫ్ మ్యాక్స్ హర్స్‌ట్ అన్నారు. చోక్సీని అరెస్టు చేయడానికి కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వర్గాలు ప్రత్యేక ఎయిర్ ఇండియా విమానంలో వస్తున్నారన్న వార్తల నేపథ్యంలో ఓ జాతీయ మీడియా చానెల్‌తో హర్స్‌ట్ పైవిధంగా స్పందించారు. అంతేగాక భారత దర్యాప్తు సంస్థల అధికారులు కరేబియన్ దీవులకు రావచ్చన్న సమాచారం తమకు లేదన్న ఆయన బహుశా వెస్టిండీస్‌లో ఈ నెలాఖరున ప్రారంభమయ్యే క్రికెట్ మ్యాచ్‌లను చూడటానికి భారతీయులు వస్తున్నారేమోనని వ్యాఖ్యానించారు. అయితే ఇందులో ఎవరైనా భారత ప్రభుత్వ అధికారులు ఉన్నారా? అన్నది తమకు తెలియదని సెయింట్ జోన్స్ నుంచి టెలిఫోన్‌లో ఇండియా టుడే టీవీకి హర్స్‌ట్ చెప్పారు. మొత్తానికి ఓ చార్టెడ్ ఎయిర్‌క్రాఫ్ట్‌లో క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించేందుకు ఇండియా నుంచి వస్తుండటం బాగుందన్నారు.

భారత పౌరసత్వాన్ని వదులుకున్నాడు

మెహుల్ చోక్సీ భారత పౌరసత్వాన్ని వదులుకున్నాడని హర్స్‌ట్ స్పష్టం చేశారు. 59 ఏండ్ల చోక్సీ గతేడాది ఆంటిగ్వా పౌరసత్వాన్ని పొందగా, అప్పుడే గయానాలోని భారత హైకమిషన్‌కు తన రద్దయిన ఇండియన్ పాస్‌పోర్టు (జెడ్3396732)ను అప్పగించేశాడని గుర్తుచేశారు. ఈ క్రమంలో 177 డాలర్ల ఫీజునూ చోక్సీ చెల్లించాడని చెప్పారు. తనను అప్పగించాలన్న భారత్ అభ్యర్థనపైనా ఆంటిగ్వా కోర్టుల్లో చోక్సీ న్యాయపోరాటం చేస్తున్నట్లు తెలిపారు. 2017 నవంబర్‌లో పెట్టుబడుల ద్వారా ఆంటిగ్వా పౌరసత్వం కోసం చోక్సీ ప్రయత్నించగా, 2018లో అది దక్కింది. జూలైలో చోక్సీ తమ దేశంలోనే ఉన్నాడని ఆంటిగ్వా అధికార వర్గాలు ధ్రువీకరించాయి. నిరుడు జనవరిలో కుటుంబంతోసహా చోక్సీ దేశం విడిచి పారిపోయిన సంగతి విదితమే. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) రూ.14,000 కోట్ల కుంభకోణంలో గీతాంజలి జెమ్స్ అధినేత మెహుల్ చోక్సీ ప్రధాన నిందితుల్లో ఒకరిగా ఉన్న విషయం తెలిసిందే. దేశీయ బ్యాంకింగ్ చరిత్రలోనే అతిపెద్దదిగా చెప్పుకోబడుతున్న పీఎన్‌బీ స్కాంలో చోక్సీ మేనల్లుడు, వజ్రాల వ్యాపార సంస్థ ఫైర్‌స్టార్ డైమండ్ అధిపతి నీరవ్ మోదీ కూడా ప్రధాన నిందితుడేనన్నదీ విదితమే. కాగా, బ్యాంకులకు రూ.7,000 కోట్లను ఎగవేసి పారిపోయిన విన్సమ్ డైమండ్స్ అధినేత జతిన్ మెహతా కూడా కరేబియన్ దీవుల్లోనే ఉన్నాడని తెలియడంతో చోక్సీ, మెహతాల కోసం సీబీఐ, ఈడీలు అక్కడికి వెళ్లాలని చూస్తున్నారు. తిరుగు ప్రయాణంలో ఐరోపాలో ఉన్నాడని తెలుస్తున్న నీరవ్ మోదీ కోసం కూడా గాలింపులు చేపట్టనున్నారు. భారత్‌తో ఎలాంటి ఒప్పందాలు లేకపోవడంతో కరేబియన్ దీవుల పౌరసత్వాన్ని పొందుతూ ఆర్థిక నేరగాళ్లు తప్పించుకుంటున్నారు. వీరిని రప్పించడం భారత్‌కు తలనొప్పిగా పరిణమిస్తున్నది.



ఫ్లైయాష్‌తో జీవావరణానికి ముప్పు

బొగ్గు వినియోగం వల్ల వెలువడే ఫ్లైయాష్ లేదా బూడిదవల్ల జీవావరణానికి తీవ్ర ముప్పు కలుగుతుంది. మనుషుల ఆరోగ్యానికీ ప్రమాదం ఉంటుంది. పరిశ్రమల్లో బొగ్గు వినియోగిస్తారు. ఆధునిక మానవుడి జీవితం విద్యుత్‌లో బాగా ముడిపడిపోయింది. బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలు ఎక్కువగా ఏర్పాటయ్యాయి.. ఇంకా అవుతున్నాయి. అణు విద్యుత్ ప్లాంట్లలో ప్రమాదం జరిగితే ఒకేసారి వేలాదిమంది ప్రాణాలు పోతాయి. పరిసరాల్లో అనేక మైళ్ళ దూరం భూమి నిస్సారమవుతుంది. ఇలా ఎన్నో ప్రమాదాలున్నాయి. బొగ్గునుంచి వెలువడే ఫ్లైయాష్‌వల్ల నిత్యం ప్రాణాలకు ముప్పవుందని చెప్పడం అతిశయోక్తి కాదు.

భారతదేశంలో 70 శాతానికిపైగా థర్మల్ విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఇందులో 90 శాతం వరకు బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్లు ఉన్నాయి. ఈ ప్లాంట్ల ద్వారా 150 మిలియన్ టన్నుల ఫ్లైయాష్ వెలువడుతుందని 2వేల సంవత్సరంలోనే అంచనా వేశారు. ఇక అమెరికాల్లో 2006 నాటికి 7 కోట్ల 20 లక్షల టన్నుల ఫ్లైయాష్ ఉత్పత్తి అవుతుందని అంచనా. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లోనూ పరిస్థితి ఇదే. ప్రతి సంవత్సరం బొగ్గు వినియోగం పెరిగిపోతోంది. బొగ్గు నిల్వలూ తగ్గుతున్నాయి. ఫ్లైయాష్ వల్ల కలిగే ముప్పును పర్యావరణ శాస్త్రవేత్తలు చాలాకాలంగా హెచ్చరిస్తున్నప్పటికీ ప్రత్యామ్నాయాల వైపు ఇటీవలే దృష్టి సారించారు. అణు విద్యుత్ ప్లాంట్ల నుంచి వెలువడే వ్యర్థాలను నిల్వ చేయడం పెద్ద సమస్యగా మారినట్లుగానే ఫ్లైయాష్‌ను ఎక్కడ నిల్వ చేయాలి, ఎలా వినియోగించాలి అనే అంశాలు తీవ్ర చర్చకు వచ్చాయి. కేంద్ర సైన్సు, టెక్నాలజీ శాఖ ఒక పరిశోధనా విభాగాన్ని ఏర్పరచి దీన్ని వినియోగించే పద్ధతులను రూపొందించే దిశలో ఉన్నారు.

బొగ్గును కాల్చినప్పుడు వెలువడే ఫ్లైయాష్‌వల్ల కర్బనపు వాయువులు, సల్ఫర్‌డైఆక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్‌లు విడుదలై వాతావరణం కలుషితమవుతుంది. అలాగే సీసం, పాదరసం, నికెల్, టిన్, కాడ్మియం, థోరియంలాంటి ఐసోటోప్‌లు ఉన్నాయి. ఇవి ఆరోగ్యానికి అవసరమే కానీ ఫ్లైయాష్ విడుదల మోతాదు మించడం వల్ల ఇవి ఆరోగ్యానికి హాని చేస్తున్నాయి.

ఇందులో ఉండే జింక్‌వల్ల ఉదర సంబంధవ్యాధులు, నికెల్‌తో గుండెపోటు, శ్వాస సంబంధ వ్యాధులు, కాపర్‌వల్ల క్యాన్సర్, మూత్రపిండాల, ప్రేగు సంబంధ రుగ్మతలు ఏర్పడతాయి. ఐరన్‌వల్ల వాంతులు, లివర్ పనిచేయకపోవడం ఉంటాయని పరిశోధకులు స్పష్టం చేస్తున్నారు. సీసం మూలంగా కార్డియోవాస్కులర్, రిప్రొడక్టివ్, గాస్ట్రో ఎంటిరిటీస్, మూత్రపిండాల సంబంధిత వ్యాధులు కలుగుతాయి. పాదరసం, మాంగనీసు, కార్మియంవల్ల మూత్రపిండాల, మానసిక సంబంధిత వ్యాధులు, ఊపిరితిత్తుల కేన్సర్, చర్మంలో మచ్చలులాంటి వ్యాధులు సంభవిస్తాయి. భారలోహాలు అధికంగా ఉన్న భూగర్భ జలాలను తాగడానికి వాడటం వల్ల భయంకరమైన వ్యాధులు వస్తాయి. బొగ్గు బూడిదలో క్యాన్సర్‌ను కలిగించే హెక్సావలెంట్ క్రోమియం ఉంటుందని అమెరికాలోని ఎర్త్‌జస్టిస్, సియరాక్లబ్ 2011 ఫిబ్రవరిలో వెలువరించిన నివేదికలో తెలిపింది. అమెరికాలోని 17 రాష్ట్రాలలోని 29 ప్రాంతాల్లో ఫ్లైయాష్‌వల్ల కలిగిన కాలుష్యాన్ని పరిశోధించి రూపొందించిన నివేదిక ఇది. థర్మల్ విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేశాక, అవి ఎంత ఎక్కువకాలం పనిచేస్తే అంత ఎక్కువగా విషతుల్య రసాయనాలు విడుదలవుతాయి. అమెరికాలోని శాస్త్రవేత్తల యూనియన్ అధ్యయనంలో పలు ఆసక్తికర, ఆందోళనకర అంశాలు వెల్లడయ్యాయి. 500 మెగావాట్ల సామర్థ్యంగల థర్మల్ విద్యుత్‌కేంద్రం ఒక సంవత్సరంలో 37 లక్షల టన్నుల కార్బన్‌డైయాక్సైడ్‌ను విడుదల చేస్తుంది. ఇది 16 కోట్ల 10 లక్షల చెట్లను నరికితే జరిగే నష్టంతో సమానమని శాస్త్రవేత్తలు తమ నివేదికలో తెలిపారు. అలాగే 10వేల టన్నుల సల్ఫర్‌డైయాక్సైడ్ విడుదలవుతుందని కూడా శాస్త్రవేత్తలు అంచనా వేశారు. వీటి కారణంగా వాతావరణం వేడెక్కడమేకాదు, ఆమ్ల వర్షాలు కురుస్తాయి. ఈ ఆమ్లాలు గాలిలో కలిసిపోయి ఏర్పడే పదార్థాలు ఊపిరితిత్తులను దెబ్బతీస్తాయి. గుండెజబ్బులను కలిగిస్తాయి. అలాగే ఒక విద్యుత్ కేంద్రం 10వేల టన్నులకు పైగా నైట్రోజన్ ఆక్సైడ్‌ను విడుదల చేస్తుంది. ఇది 5 లక్షల కార్లు విడుదల చేసే నైట్రోజన్ ఆక్సైడ్‌తో సమానం. ఒక విద్యుత్ కేంద్రం 220 టన్నుల హైడ్రోకార్బన్లు, 720 టన్నుల కార్బన్ మోనాక్సైడ్, 170 పౌన్ల పాదరసం విడుదల చేస్తుంది. ఇవన్నీ అనారోగ్యకారకాలే.






బొగ్గు వ్యర్థాలను ఎక్కువగా భూమిలోకి పంపుతున్నారు. అమెరికాలో ప్లాస్టిక్ షీట్లువేసి ఫ్లైయాష్‌ను నిల్వ చేస్తున్నారు. మన దేశంలో నేరుగా భూమిపైనే నిల్వ చేస్తాయి. వర్షం కురిసినప్పుడు ఫ్లైయాష్ తడిసిపోయి అందులో ఉండే భారలోహాలు భూమిలోకి చేరుతున్నాయి. ఇవి క్రమంగా తాగునీటిలోకి చేరతాయని, పొలాల్లో చేరినప్పుడు కూడా హాని చేస్తాయని హెచ్చరిస్తున్నారు. అయితే మన దేశంలో ఫ్లైయాష్‌ను తిరిగి వినియోగించుకునే విధానా లను శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. కేంద్ర పరిశోధనా లయాలు, విశ్వ విద్యాలయాల్లో కూడా దీనికి సంబం ధించిన పరిశోధనలు జరుగుతున్నాయి. ఫ్లైయాష్‌ను వ్యవసాయ భూముల్లో పరిచి భూసారాన్ని పెంచాలని కూడా కొంతమంది శాస్త్రవేత్తలు సూచించారు. అయితే అది విడుదలచేసే భారలోహాల వల్ల కలిగే హానిని దృష్టిలో ఉంచుకోవాలని మరికొందరు సూచించారు.

ధర్మల్ విద్యుత్‌కు ప్రత్యామ్నాయంగా సౌర విద్యుత్ ఉత్పత్తే వీటన్నింటికీ పరిష్కారం అవుతుంది.



ఫ్రాన్స్ హోఫర్ రేఖలు అంటే...

మన ఖగోళ శాస్త్రవేత్తలు నక్షత్రాల గురించీ, అలాగే సూర్యుడి గురించీ ఎన్నెన్నో విషయాలను ప్రపంచానికి తెలియజేసారు. ఇంకా మరికొన్ని విషయాలు తెలుసుకోవటానికి పరిశోధనలు కొన సాగిస్తున్నారు. అలా తెలుసుకోవటానికి రకరకాల సాధనాలు ఉపయోగ పడుతున్నాయి. మన భూమిమీదఉన్నట్లే అక్కడా "ధాతువులు" (ఎలిమెంట్స్) వాయువులు వున్నట్లు కనుగొన్నారు. ఆ ధాతువులు, వాయువులు ఎంతెంత శాతంలో వున్నాయోకూడా కనిపెడుతున్నారు. ఇలా వాటి ఉనికి తెలుసుకోవటానికి "స్పెక్ట్రమ్"లోని నల్లని రేఖలు ఉపయోగిస్తున్నారు. ఈ నల్లని రేఖల ఉనికిని కనిపెట్టినవాడు జర్మన్ శాస్రవేత్త జోసఫ్ వాన్ ఫ్రాన్ హోపర్. అందుకే ఆయన పేరు మీదుగా ఆ రేఖలు "ఫ్రాన్స్‌హోపర్‌రేఖలు" అని పిలవబడుతున్నాయి. తెల్లని సూర్యకాంతి వుంది. అది ప్రిజమ్ ద్వారా ప్రసరిస్తుందనుకోండి. ఆ కాంతి ఏడు రంగులుగా విడిపోతుంది. ఈ విషయం న్యూటన్ కనుగొన్నాడు. ఆ కాలంలో తగిన సాధన సంపత్తి లేదు. కాలం గడుస్తున్న కొద్దీ సున్నితమైన పరికరాలు రూపుదిద్దుకున్నాయి. వాటితో ఎన్నెన్నో విషయాలు వెలుగులోకి వచ్చాయి. అటువంటి పరికరం సహాయంతో ఫ్రాన్స్ హోఫర్ సూర్యకాంతి స్పెక్ట్రమ్‌ను పరిశీలించాడు. అప్పుడు ఆయన మధ్యమధ్యలో వున్న నల్లని రేఖలను కనుగొన్నాడు. స్పెక్ట్రమ్‌లో ఏడురంగులు వున్నాయి. ఆ రంగుకు సంబంధించిన ప్రకాశవంతమైన రేఖలు వుండాలి. కాని, నల్లని రేఖలు వున్నాయి. ఇలా ఎందుకు వుంటున్నాయి? అని వీటి మీద పరిశోధనలు చేసి కొన్ని జవాబులు కనుగొన్నారు శాస్త్రవేత్తలు. సూర్యుని ఉపరితలం నుండి సూర్యకాంతి ప్రయాణించి వస్తుంది. దారిలో సూర్య వాతావరణంలో వివిధ వాయువులు వుంటాయి. వాటినుండి కాంతి కిరణాలు దూసుకు వస్తాయి. ఆ వాయువులు ఎన్నో ధాతువులకు చెందినవి. ఒక్కొక్కరకం ధాతువుకు చెందిన వాయువులు ఒక్కొక్క తరంగ దైర్ఘ్యత్వం కలిగిన కాంతిని విలీనం చేసుకోగలవు. ఇలా రంగు సూర్యకాంతిలో విలీనమైన ప్పుడు స్పెక్ట్రమ్‌లో ఆస్థానంలో నల్లని రేఖలు ఏర్పడతాయి. ధాతువులకు రంగు వుంటుంది. నల్లని రేఖలు ఏరంగు స్థానంలో వున్నాయో కనుక్కొని ఆ వాయువులు సూర్యుని వాతావరణంలో వున్నాయని తెలుసుకుంటారు. రేఖల సాంద్రతను బట్టి వాయువులు ఎంతెంత వుంటాయో కూడా తెలుసుకుంటారు.



200 సార్లు కన్నుకొట్టా.. బోర్ కొడుతోంది



ప్రియా ప్రకాష్ వారియర్.. అందరికీ ఈ పేరు వినగానే ఠకీమని గుర్తొచ్చేది ఒక్కటే. అదే కన్ను గీటడం. 'ఒరు అధార్ లవ్' సినిమాలో ఓ పాట కోసం కన్నుకొట్టి అంతలా ఫేమస్ అయిపోయింది ఈ మలయాళీ ముద్దుగుమ్మ. ఒమర్ లులు దర్శకత్వంలో రూపొందిన ఒరు అధార్ లవ్ చిత్రాన్ని తెలుగులో 'లవర్స్ డే' పేరుతో లవర్స్ డే (ఫిబ్రవరి 14) రోజునే ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇటీవలే హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించగా ప్రియా వచ్చి తెగ హంగామా చేసింది. కాగా తాజాగా ఓ మీడియా సంస్థతో మాట్లాడిన ప్రియా.. తాను ఇప్పటికే 200 సార్లు కన్ను కొట్టానని తెలిపింది. ఎక్కడికి వెళ్లినా కన్ను కొట్టమనే అడుగుతున్నారని.. అలా కొట్టీ కొట్టీ బోర్ కొడుతోందని చెప్పింది ప్రియా. అయితే తాను కన్ను కొట్టడం ఇంతలా ఎందుకు ఫేమస్ అయిందో తనకే అర్థం కావటం లేదని ఈ సందర్భంగా చెప్పుకొచ్చింది. కన్ను కొట్టి ఫేమస్ అవటం సంతోషంగా ఉన్నా ప్రైవసీ కోల్పోయిన విషయం మాత్రం వాస్తవమేనని తెలిపింది ప్రియా.

విశాలాంధ్ర సినిమా

ఆ వదంతులు నిజమైనందుకు హ్యాపీగా ఉంది

అజిత్‌తో సినిమాపై శ్రద్ధా శ్రీనాథ్ స్పందన



తనపై ఇప్పటివరకు వచ్చిన వదంతులు నిజమైనందుకు చాలా సంతోషంగా ఉందని అంటున్నారు ప్రముఖ తమిళ నటి శ్రద్ధా శ్రీనాథ్. అజిత్ ప్రధాన పాత్రలో బాలీవుడ్‌లో విజయం అందుకున్న 'పింక్' సినిమా రీమేక్ కాబోతోంది. ఇందులో శ్రద్ధ కీలక పాత్రలో నటించే అవకాశం దక్కించుకున్నట్లు చాలా కాలంగా వార్తలు వెలువడుతున్నాయి. మొత్తానికి ఆ రూమర్లు నిజమయ్యాయి. 'పింక్' తమిళ రీమేక్‌లో శ్రద్ధ.. తాప్సి పాత్రలో నటించనున్నారు. ఈ విషయాన్ని శ్రద్ధ ట్విటర్ ద్వారా వెల్లడిస్తూ.. 'అజిత్ చిత్రంలో నేను నటించబోతున్నానని చాలా కాలంగా వార్తలు వస్తున్నాయి. అవి నిజమైనందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ అద్భుతమైన సినిమాలో నేనూ భాగమయ్యాను. చాలా మంది దీని గురించి గతంలో నన్ను అడిగారు. కానీ నిర్ధారణ అయ్యాక చెబుదామని మౌనంగా ఉన్నాను. అలా ఉండటం చాలా కష్టమనిపించింది. ఇప్పుడు గర్వంగా ప్రకటిస్తున్నాను. ఇప్పటివరకు నేను నటించని ఛాలెంజింగ్ పాత్ర ఈ సినిమా ద్వారా నాకు దక్కిందని నమ్మకంగా చెప్పగలను. ఓపక్క ఎగ్జైటింగ్‌గా ఉన్నా మరోపక్క కంగారుగా కూడా ఉంది. ఇది అందరూ తప్పకుండా చూడాల్సిన సినిమా' అని వెల్లడించారు.



ఎన్టీఆర్‌తో చిత్రానికి మరింత అనుభవం సంపాదించాలి!

"మణిరత్నం, త్రివిక్రమ్ స్ఫూర్తితో రచయితగా, దర్శకుడిగా ప్రయాణం ప్రారంభించా. సంభాషణలను సులభంగా ఎలా రాయాలో.. త్రివిక్రమ్‌గారు తన చిత్రాల్లో రచన ద్వారా చూపించారు. ఆయన చిత్రాలు లేకపోతే నేను రాసేవాణ్ణి కాదేమో! 'స్నేహగీతం' చిత్రంలో ఒక్కో సన్నివేశానికి ఆరేడు వెర్షన్లు రాసినా ఇబ్బంది అనిపించేది కాదు. కానీ, మేకప్ వేసుకున్నాక రెండో టేక్ చేయమంటే చాలా ఇబ్బంది పడేవాణ్ణి. నేను నేచురల్ యాక్టర్‌ని కాదు. మళ్లీ ముఖానికి మేకప్ వేసుకోను. పౌడర్ కూడా పూసుకోను" అని వెంకీ అట్లూరి అన్నారు. ఆయన దర్శకత్వంలో అఖిల్ అక్కినేని హీరోగా నటించిన చిత్రం 'మిస్టర్ మజ్ను'. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మాత. నిధీ అగర్వాల్ హీరోయిన్. ఈ నెల 25న విడుదలైన ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి చక్కటి స్పందన లభిస్తోందని వెంకీ అట్లూరి తెలిపారు. ఇంకా ఆయన మాట్లాడుతూ "అఖిల్ నటనకు, చిత్రానికి ప్రేక్షకుల నుంచి అద్భుత స్పందన లభిస్తోంది. నా అంచనాలను మించి అఖిల్ నటించాడు. తనకు ఎప్పుడూ ఇలా నటించమని చెప్పలేదు. సన్నివేశంలో ఎమో షన్ ఏంటని అడిగి నటించేవాడు. తమన్, శ్రీమణి, సినిమాటోగ్రాఫర్ జార్జ్ అందరూ మంచి అవుట్‌పుట్ ఇచ్చారు. కొండబాబు కామెడీ, 'హైపర్' ఆది పాత్ర అందరికీ నచ్చింది. నన్ను నమ్మి ఈ చిత్రం చేసిన అఖిల్, నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ అందరూ హ్యాపీగా ఉన్నారు. ప్రస్తుతం రెండు, మూడు కథలు రాస్తు న్నాను" అన్నారు. చిన్న ఎన్టీఆర్ గురించి మాట్లాడుతూ "నిజంగా... మిస్టర్ మజ్ను ప్రీ రిలీజ్ ముందువరకూ ఎన్టీఆర్ 'తొలి ప్రేమ' గురించి నాతో మాట్లాడ లేదు. ప్రేక్షకుల ముందు నన్ను మెచ్చుకుంటే చాలా ఆనందపడ్డా. ఎన్టీఆర్‌తో సినిమా చేయాలని నాకూ ఉంది. అయితే... అంత పెద్ద హీరోతో చిత్రం అంటే నాకు మరింత అనుభవం కావాలి. ధైర్యం కావాలి. ధైర్యాన్ని పోగేసుకుని కథ రాశాక... ఆయన దగ్గరకు వెళతా" అన్నారు.



అమ్మాయిలూ తీసుకెళ్తారు

అబ్బాయిలే రైడ్‌కు తీసుకెళ్తారా? అమ్మాయిలు తీసుకెళ్లలేరా? ఇకపై అమ్మాయిలూ తీసుకెళ్తారు... అని అంటున్నారు రకుల్ ప్రీత్‌సింగ్. 'దేవ్' చిత్రంలో ఆమె బైక్ నడిపే సన్నివేశాలున్నాయి. ఈ సినిమా షూటింగ్‌లో భాగంగా రకుల్ బైక్ నడపడాన్ని ఆ చిత్ర దర్శకుడు రజత్ రవిశంకర్ కెమెరాలో బంధించారట. ఆ వీడియో రకుల్ ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. ఫిబ్రవరి 14న విడుదల కానుంది 'దేవ్'. అదే రోజు ఆమె నటించిన 'ఎన్‌జీకే' టీజర్ ప్రేక్షకుల ముందుకు రానుంది. 'ఫిబ్రవరి 14 నాకు డబుల్ ధమాకా. కార్తీ సరసన నటించిన 'దేవ్' విడుదలవుతుంది. సూర్య సరసన నటించిన 'ఎన్‌జీకే' టీజర్ ప్రేక్షకుల ముందుకు రానుంది" అని ఇటీవల రకుల్ ట్వీట్ చేశారు.

క్యాన్సర్‌కు అతీతమైనది జీవితం: మనీషా కొయిరాలా



జీవితమనేది క్యాన్సర్‌కు అతీతమైనదని బాలీవుడ్ నటి మనీషా కొయిరాలా పేర్కొన్నారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగిన లిటరేచర్ ఫెస్టివల్‌కు హాజరైన ఆమె మాట్లాడుతూ 'కాలం ఎంతో విలువైనది. మన దగ్గరున్న కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి' అని అన్నారు. 'హీల్డ్: లైఫ్ లెర్నింగ్ ఫ్రమ్ మనీషా కొయిరాలా' అనే అంశంపై ఫెస్టివల్ ప్రతినిధి సంజోయ్ రాయ్ ఆమెతో సంభాషించారు. అతను అడిగిన ప్రశ్నలకు మనీషా సమాధానాలు చెప్పారు. క్యాన్సర్ వ్యాధి నుంచి తనను కాలమే బయటపడవేసిందని పేర్కొన్నారు. అందుకే కాలం ఎంతో అమూల్యమైనదన్నారు. జీవితాన్ని, కాలాన్ని నేర్పుగా గడపడమెలాగో నేర్చుకున్నాను. కొత్త జీవితం ప్రారంభమయ్యాక నన్ను నేను విశ్లేషించుకున్నాను. నా తప్పులను సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తున్నాను. క్యాన్సర్ సోకిందని తెలియగానే భయపడిపోలేదు. అయితే ఇది ఎంతో బాధాకరమని గ్రహించాను. వ్యాధిపై అవగాహన పెంచుకుంటూ, పాజిటివ్ స్టోరీలపై ద ృష్టి పెట్టాను. క్యాన్సర్ కన్నా జీవితం గొప్పదని తెలుసుకున్నాను. సాధారణంగా ఏదైనా సమస్య వస్తే వెంటనే కుంగిపోతాం. అయితే అలా భయపడటం సరికాదు. ఎటువంటి సమస్యకైనా ఏదో ఒక పరిష్కారం ఉంటుంది. సమస్యలను ఛాలెంజ్‌గా తీసుకుని, వాటినుంచి బయటపడేందుకు ప్రయత్నించాలని మనీషా తెలిపారు.

విజయ్ దేవరకొండ డిమాండ్ ?



యంగ్ హీరో విజయ్ దేవరకొండ ప్రస్తుతం మంచి ఫామ్‌లో ఉన్నాడు. 'అర్జున్ రెడ్డి' సినిమాతో అందరిచూపును ఆకర్షించిన ఈయన 'గీతగోవిందం' ద్వారా మంచి పాపులారిటీ తెచ్చుకున్నాడు. ఇక ఆ వెంటనే 'టాక్సీవాలా'గా వచ్చి స్టార్ హీరో స్థాయిలో మెప్పించాడు. దీంతో ఆయనకు ఒక్కసారిగా క్రేజ్ పెరిగిపోయింది. దీంతో విజయ్‌తో సినిమా చేసేందుకు దర్శకనిర్మాతలు క్యూ కడుతున్నారు. ప్రస్తుతం 'డియర్ కామ్రేడ్' సినిమాతో బిజీగా ఉన్న ఈ హీరో క్రేజ్‌ని క్యాచ్ చేసుకుందుకు గాను కొత్త కొత్త కథలతో విజయ్ తలుపుతడుతున్నారట దర్శకులు. మరోవైపు విజయ్ దేవకొండ సినిమాకు ఎంతైనా పెడతామని ముందుకొస్తున్నారట నిర్మాతలు. హిట్ సినిమాల నిర్మాత దిల్ రాజు.. విజయ్‌తో కొత్త ప్రాజెక్ట్ చేయాలని భావిస్తున్నారట. ఇందుకోసమై విజయ్ దేవరకొండను దిల్ రాజు సంప్రదించగా ఆయన 10 కోట్లు పారితోషికంగా కావాలని డిమాండ్ చేశాడని ఫిలింనగర్‌లో చెప్పుకుంటున్నారు. అయితే విజయ్ ఈ 10 కోట్ల రూపాయలను ఏ ప్రాజెక్ట్ విషయంలో అడిగాడు? దానికి దిల్ రాజు ఓకే చెప్పారా? లేదా? అనే సమాచారం మాత్రం తెలియరాలేదు. చూడాలి మరి.. ఇదే నిజమైతే విజయ్‌ని ఇక బడా హీరో అని చెప్పుకోవాల్సిందే.

ఐఆర్‌సీటీసీ కుంభకోణంలో

లాలూ కుటుంబానికి ఊరట

న్యూఢిల్లీ : ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) కుంభకోణంలో రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ) అధినేత లాలూ ప్రసాద్ కుటుంబానికి కోర్టులో ఊరట లభించింది. మనీ ల్యాండరింగ్ కేసులో లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన భార్య, మాజీ సీఎం రబ్రీదేవి, కుమారుడు తేజశ్వీ యాదవ్‌కు బెయిల్ మంజూరు చేస్తూ ఢిల్లీ కోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఒక్కొక్కరికి రూ.లక్ష బాండు, ఒకరి పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేస్తూ ప్రత్యేక న్యాయమూర్తి అరుణ్ భరధ్వాజ్ తీర్పు చెప్పారు. ఈ నెల 19న లాలూ ప్రసాద్, రబ్రీదేవి, తేజశ్వీ యాదవ్‌కు ఇచ్చిన మధ్యంతర బెయిల్‌ను పొడిగించగా అది సోమవారంతో ముగిసింది. దీంతో వారు కోర్టును ఆశ్రయించడటంతో బెయిల్ మంజూరైంది. రెండు ఐఆర్‌సీటీసీ హోటల్స్‌ను ప్రైవేటు సంస్థల కాంట్రాక్ట్ వ్యవహారంలో అక్రమాలు జరగటంపై సీబీఐ కేసు నమోదు చేసింది. అనంతరం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా లాలూ కుటుంబ సభ్యులపై మనీ ల్యాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేసింది. డిలైట్ మార్కెటింగ్ కంపెనీ (లారా ప్రాజెక్ట్స్), సుజాత హోటల్స్ ప్రైవేటు లిమిటెడ్ నిందితులకు చెందినవిగా చార్జిషీట్‌లో పేర్కొన్నారు. 2004 నుంచి 2014 మధ్య సీబీఐ సమగ్ర విచారణలో లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీదేవి, తేజశ్వీ యాదవ్‌ను నిందితులుగా తేల్చిన విషయం విధితమే.

రామమందిరంపై

దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్న సీఎం : రాజ్‌భర్

బల్లియా (ఉత్తరప్రదేశ్) : రామమందిరం నిర్మాణంపై సీఎం యోగి ఆదిత్యనాథ్ దేశాన్ని తప్పుతోవ పట్టిస్తున్నారని ఉత్తరప్రదేశ్ బీసీ సంక్షేమశాఖ మంత్రి, సుహేల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ (ఎస్‌బీఎస్‌పీ) చీఫ్ ఓం ప్రకాష్ రాజభర్ విమర్శించారు. రాష్ట్రంలోనూ, కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందని, రామమందిరం నిర్మాణాన్ని ఎవరు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. బల్లియాలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 24 గంటలలో రామమందిరం అంశాన్ని పరిష్కరించాలని సీఎం ఒక టీవీ ఛానల్ ఇంటర్వ్యూలో హెచ్చరించటం శోచనీయమన్నారు. ఇదిలావుండగా, ప్రధాని పదవికి రాహుల్ గాంధీ అర్హుడని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో ప్రియాంక గాంధీ క్రీయాశీలక పాత్ర పోషించటం వల్ల ఆ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం వచ్చిందన్నారు. రానున్న ఎన్నికల్లో ఎస్పీ, బీఎస్పీ కూటమికే ప్రజలు మద్దతు పలుకుతారని ఆయన పేర్కొన్నారు.

హజ్ యాత్రీకులకు తగ్గిన భారం : నక్వీ



ముంబై : మధ్యదళారులను తొలగించడంతో హజ్ యాత్రీకులకు భారం తగ్గిందని కేంద్ర మంత్రి ముక్తార్ అబ్బాస్ నక్వీ తెలిపారు. హజ్ యాత్రకు సంబంధించి మధ్య దళారులను తొలగించడంతో ప్రభుత్వం హజ్ సబ్సిడీని ఎత్తివేసినప్పటికీ హజ్ యాత్రీకులకు ఖర్చు బాగా తగ్గిపోయిందని చెప్పారు. 2012లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు గత ఏడాది ప్రభుత్వం హజ్ సబ్సిడీని తొలగించింది. హజ్ 2019కి సంబంధించి రెండు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మొదటిసారిగా గత ఏడాది భారత్ నుంచి 1,75,025 మంది ముస్లింలు హజ్ యాత్ర జరిపారు. వీరిలో 48 శాతం మంది మహిళలు. యాత్ర కోసం వీరికి ఎటువంటి సబ్సిడీ ఇవ్వలేదు అని తెలిపారు. హజ్ యాత్రీకులకు 2018లో విమానయాన చార్జి గణనీయంగా తగ్గింది, అందువల్ల హజ్ సబ్సిడీని తొలగించి నప్పటికీ, యాత్రీకులకు విమాన చార్జీల రూపంలో దాదాపు రూ. 57 కోట్లు మిగిలిందని చెప్పారు. హజ్ యాత్రీకులపై జీఎస్టీని 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాం. దీనివల్ల 2019 సంవత్సరంలో హజ్ యాత్రీకులకు రూ. 113 కోట్లు మిగులుతుందని నక్వీ వెల్లడించారు.

గోవా బీచ్ రెస్టారెంట్‌లో సోనియా, రాహుల్

పానాజీ (గోవా) : కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ రెండు రోజులుగా గోవా బీచ్ రెస్టారెంట్‌లో ఉంటున్నారు. వీరి పర్యటన పార్టీపరమైందికాదని, అది పూర్తిగా వ్యక్తిగమని గోవా పార్టీ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలిద్దరూ ఇక్కడి బీచ్ షేక్ రెస్టారెంట్‌లో ఉన్నట్లు స్థానికురాలు రచనా ఫెర్నాండేజ్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. కాగా, రాహుల్, సోనియా ఛత్తీస్‌గఢ్‌లో జరగనున్న రైతుల సభకు సోమవారం బయలుదేరి వెళ్లారు.

కార్తీ కేసులో ఈడీకి సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : ఎయిర్‌సెల్, ఐఎన్ఎక్స్ కేసులలో కాంగ్రెస్ నాయకుడు పి.చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరంను విచారించేందుకు తేదీని నిర్ధారించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్‌ను సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. ఈ నెల 30న కార్తీని ఈడీ విచారించే దానిపై నిర్దిష్టమైన నిర్ణయం తీసుకోవాలని ప్రధాన న్యాయమూర్తి రంజన్ గగోయ్, న్యాయమూర్తి సంజీవ్ ఖన్నాలతో కూడిన ధర్మాసనం సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఆదేశించింది. యునైటెడ్ కింగ్‌డమ్‌లో 'టెన్నిస్ లిమిటెడ్' కంపెనీ నిర్వహిస్తున్న టెన్నిస్ టోర్నమెంట్ల కోసం కొద్దినెలలు ఫ్రాన్స్, స్పెయిన్, జర్మనీ, యునైటెడ్ కింగ్‌డమ్‌లకు పర్యటించించేందుకు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ధర్మాసనం విచారించింది.

మహారాష్ట్రలో శివసేనదే పెద్దన్న పాత్ర

ముంబై : మహారాష్ట్రలో తమ పార్టీ ఎల్లప్పుడూ పెద్దన్న పాత్రనే పోషిస్తుందని శివసేన ప్రతినిధి సంజయ్ రౌత్ అన్నారు. సోమవారం థాకరే నివాసంలో జరిగిన పార్టీ ఎంపీల సమావేశం అనంతరం ఆయన మాట్లాడారు. మహారాష్ట్రలో బీజేపీ, శివసేన సమాన సంఖ్యలో పోటీచేస్తాయనే వార్తలపై ఆయన స్పందిస్తూ, తమకు ఇలాంటి సమాచారం లేదని, ఈ తరహా సీట్ల సర్దుబాటును తాము అంగీకరించమని స్పష్టంచేశారు. మహారాష్ట్రలో తమ పార్టీనే పెద్దన్న పాత్ర పోషిస్తుందని, ఇది ఎల్లప్పుడూ కొనసాగుతుందని చెప్పారు. కాగా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీతో పొత్తుపై నిర్ణయం తీసుకునే అధికారాన్ని శివసేన ఎంపీలు పార్టీ అధ్యక్షుడు ఉద్ధవ్‌థాకరేకు కట్టబెట్టారు.

అయోధ్యపై న్యాయమంత్రి వితండం

పాట్నా : అయోధ్య కేసు గత 70 సంవత్సరాలుగా కోర్టులో నానుతోందని కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ సోమవారం చెప్పారు. సుప్రీంకోర్టులో ఈ కేసు విచారణ నిదానంగా సాగుతోందనడాన్ని ఆయన తోసిపుచ్చారు. వివాహేతర శృంగారం, శబరిమల ఆలయ అంశాలలో వలే ఈ అంశానికి సంబంధించి కూడా 'వేగిరమే నిర్ణయం' తీసుకోవాలని అత్యున్నత న్యాయస్థానానికి ఆయన విజ్ఞప్తి చేశారు. తాను ఒక పౌరునిగా ఈ వ్యాఖ్యలు చేస్తున్నానని, న్యాయశాఖ మంత్రిగా కాదని ఆయన స్పష్టంచేశారు. ఐదుగురు సభ్యులు గల రాజ్యాంగ ధర్మాసనంలో ఒక సభ్యుడు అందుబాటులోలేని కారణంగా రాజకీయంగా సున్నితమైన రామజన్మభూమి-బాబ్రీ మసీదు భూ వివాద కేసుపై జనవరి 29న జరగాల్సి విచారణను సుప్రీంకోర్టు ఆదివారం రద్దు చేసింది. ఒక రోజు తరువాత మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. కేరళలోని శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశం, వివాహేతర శృంగారం, సామాజిక, సాంస్కృతిక కార్యకర్తలను అర్బన్ నక్సల్స్‌గా పేర్కొనడం, కర్ణాటక రాజకీయ సంక్షోభంపై అర్ధరాత్రి జోక్యం చేసుకోవడం తదితర అంశాలను ఈ సందర్భంగా మంత్రి ఉదాహరణగా పేర్కొన్నారు. అయోధ్య పిటిషన్‌పై నిర్ణయం తీసుకోవడానికి సర్వోన్నత న్యాయస్థానం ఎందుకు ముందుకు రావడంలేదని ఆయన ప్రశ్నించారు. "అయోధ్యలో రామాలయం నిర్మించాలన్నది దేశ ప్రజల అకాంక్ష. ఇది రాజ్యాంగానికి లోబడి జరుగుతుందని మన ప్రధానమంత్రి, మా పార్టీ అధ్యక్షుడు ఇప్పటికే స్పష్టం చేశారు" అని సోమవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ రవిశంకర్ ప్రసాద్ చెప్పారు. "అయితే, న్యాయశాఖ మంత్రిగా కాకుండా దేశ పౌరునిగా నేను కొంత చెప్పదలుచుకున్నాను. గత 70 సంవత్సరాలుగా ఈ అంశం కోర్టులో పెండింగ్‌లో ఉన్నది. అలహాబాద్ హైకోర్టు 60 సంవత్సరాల సమయం తీసుకున్నది. ఇప్పుడు సుప్రీంకోర్టు ముందు పది సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉంది" అని అన్నారు. హైకోర్టులో వేసిన పిటిషనర్లలో ఒకరి తరఫు న్యాయవాదిగా కూడా రవిశంకర్ ఉన్నారు.

నిర్బంధ కేంద్రాల వివరాలివ్వాలి : సుప్రీం

న్యూఢిల్లీ : అసోంలో ఫంక్షనల్ నిర్బంధ కేంద్రాలు ఎన్ని ఉన్నాయి, గత దశాబ్దకాలంలో ఎంతమందిని నిర్బంధంలోకి తీసుకున్నారు, ఇతర వివరాలను వెల్లడించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. అసోంలో నిర్బంధ కేంద్రాల పరిస్థితి, అక్కడి విదేశీయులను దీర్ఘకాలంగా నిర్బంధంలో ఉంచుకోవడంపై హక్కుల కార్యకర్త హర్ష మందర్ దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్, జస్టిస్ సంజీవ్ ఖన్నాల నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. నిర్బంధ కేంద్రాలకు సంబంధించి, నిర్బంధంలో ఉన్న వారు ఎంతకాలంగా ఉన్నారు, ఫారనర్స్ ట్రిబ్యునల్ ముందు వారి కేసు ఏ స్థితిలో ఉన్నది తదితర వివరాలను సవివరంగా ఇవ్వాలని అత్యున్నత న్యాయస్థానం కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. "అక్కడ ఎన్ని నిర్బంధ కేంద్రాలు ఉన్నాయో మేము తెలుసుకోగోరుతున్నాం. అక్కడ ఎంత మందిని ఉంచారు, ఎప్పటి నుంచి ఉంచారు అన్న విషయాలను కూడా తెలుసుకోగోరుతున్నాం" అని ధర్మాసనం తెలిపింది. ఇప్పటి వరకు ఎంత మందిని విదేశీయులుగా ప్రకటించారు, ఇప్పటి వరకు అందులో ఎంతమందిని వెనుకకు పంపారనే వివరాలను అందించవలసిందిగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ధర్మాసనం కోరింది.

'శారదా' కేసు దర్యాప్తునకు

ప్రభుత్వ యంత్రాంగం విముఖత : సీబీఐ

కోల్‌కతా : శారదా చిట్‌ఫండ్ కంపెనీ కుంభకోణం దర్యాప్తునకు పశ్చిమబెంగాల్ ప్రభుత్వం విముఖత వ్యక్తంచేస్తోందని, అందువల్లే చార్జిషీటు దాఖలుకు జాప్యం అవుతున్నట్టు సీబీఐ సంస్థ ఆరోపించింది. కేసుకు సంబంధించి తుది చార్జిషీటు దాఖలు చేయడానికి జాప్యం జరగడానికి కారణాలను సీబీఐ సీనియర్ అధికారి విలేకరులకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం శారదా చిట్‌ఫండ్ కంపెనీ కుంభకోణానికి సంబంధించిన అన్ని సాక్ష్యాలు ధ్వంసం చేసిందన్నారు. దీంతో చార్జిషీటు దాఖలుకు జాప్యం అయినట్టు తెలిపారు. రాష్ట్రంలో సీబీఐ దర్యాప్తు, దాడులపై సాధారణ సమ్మతిని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఉపసంహరిస్తూ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఈ కేసు దర్యాప్తు పురోగతిలో జాప్యంపై ఆయన ఈ విధంగా స్పందించారు.

పోంజీ కేసులో

రూ.239.29 కోట్ల

ఎంపీ ఆస్తుల అటాచ్

న్యూఢిల్లీ : పోంజీ కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న తృణమూల్ రాజ్యసభ సభ్యుడు (ఎంపీ) కేడీ సింగ్‌కు చెందిన 239.29 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోమవారం అటాచ్ చేసింది. పోంజీ కుంభకోణంపై మనీ ల్యాండరింగ్ చట్టం కింద ఈడీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో రూ.1,916 కోట్ల అక్రమాలు జరిగినట్లు ఈడీ నిర్ధారించింది. నగదు బదిలీ చర్యల నివారణ చట్టం (పీఎంఎల్ఏ) కింద చండీఘడ్, పంచకుల, దెరబస్సి, ఎస్ఏఎస్ నగర్ (పంజాబ్), సిమ్లా తదితర ప్రాంతాలలో ఉన్న ఎంపీ ఆస్తులను అటాచ్ చేసినట్లు ఈడీ వెల్లడించింది. అలాగే ఆల్‌కెమిస్ట్ ఇన్‌ఫ్రా రియాల్టీ లిమిటెడ్‌కు చెందిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఖాతాను కూడా సీజ్ చేశామని తెలిపింది. గతేడాది కేంద్ర దర్యాప్తు సంస్థ తృణమూల్ ఎంపీ సింగ్‌కు సమన్లు జారీ చేసింది. పోంజీ కుంభకోణం ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురయ్యారు. ఎంపీ సింగ్ ఆల్‌కెమిస్ట్ ఇన్‌ఫ్రా రియాల్టీ లిమిటెడ్‌కు 2012లో చైర్మన్‌గా నియమితులయ్యారు. విచారణనంతరం ఈడీ ఎంపీ, సంస్థపైనా క్రిమినల్ కేసు నమోదు చేసింది. ఈ సంస్థ నుంచి ఇతర కంపెనీలకు అక్రమంగా నిధులు బదలాయించినట్లు విచారణలో తేలింది. అక్రమంగా రూ.1,916 కోట్ల పెట్టుబడులు సేకరించి కంపెనీని ప్రారంభించారని ఈడీ స్పష్టం చేసింది. సెబీ అనుమతి లేకుండా కంపెనీని ప్రారంభించి పెట్టుబడిదారులను మోసగించినట్లు ఈడీ తెలిపింది. సేకరించిన పెట్టుబడులలో రూ.1,077 కోట్లను తిరిగి చెల్లించామని, మిగిలిన పెట్టుబడులను వెనక్కి ఇచ్చేందుకు కొంత గడువు కావాలని సంస్థ సెబీని కోరినట్లు పేర్కొంది. ఈ కుంభకోణానికి సంబంధించి 2016 మార్చిలో ఈడీ చార్జిషీటును దాఖలు చేసింది.

కుమారస్వామికి కోపమొచ్చింది..

రాజీనామా చేస్తా..

- సీఎం కుర్చీకోసం ఆరాటం లేదు
- కాంగ్రెస్‌కు సీఎం ఘాటు హెచ్చరిక
- ఎమ్మెల్యే వ్యాఖ్యలపై పీసీసీ ఆగ్రహం



బెంగళూరు : కర్నాటక సంకీర్ణ ప్రభుత్వంలో కాంగ్రెస్, జేడీఎస్ మధ్య ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరిందా? ముఖ్యమంత్రి కుమారస్వామిని రబ్బరుస్టాంపులో ఉండాలని కాంగ్రెస్ కోరుకుంటుందా? అందుకే ఆయనకు కాంగ్రెస్‌పై కోపం వస్తుందా? ఇక్కడ పరిణామాలను గమనిస్తే అదే నిజమనిపిస్తోంది. కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యేల వేధింపులు, అవమానాలను భరించలేని కుమారస్వామి...సీఎం పదవి నుంచి తప్పుకుంటానని హెచ్చరించారు. అధికారం కోసం తాను వెంపర్లాడటం లేదని స్పష్టంచేశారు. సిద్దరామయ్యను మళ్లీ సీఎం చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే ఒకరు డిమాండు చేసిన మరుసటి రోజు కుమారస్వామి పైవిధంగా స్పందించారు. ఆదివారం నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎస్‌టీ సోమశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయని వ్యాఖ్యానించారు. దీనిపై కుమారస్వామి తీవ్రంగా స్పందించారు. 'నా పాలన, పనితీరు ఆమోదయోగ్యం కాకపోతే రాజీనామా చేయడానికి నేను సిద్ధం. సీఎం పదవి కోసం నేను ఆరాటపడటం లేదు. సబర్బన్ ట్రెయిన్, కారిడార్ అభివృద్ధి, రింగ్‌రోడ్డు సహా లక్ష కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను మా ప్రభుత్వం చేపట్టింది' అని కుమారస్వామి వివరించారు. మంత్రి స్వేర్ మెట్రో స్టేషన్‌లో గ్రీన్‌లైన్‌పై ఆరు బోగీల మెట్రో రైలును సోమవారం ప్రారంభించిన అనంతరం కుమారస్వామి విలేకరులతో మాట్లాడారు. కుమారస్వామి ఆ వ్యాఖ్యలు చేసిన సమయంలో అక్కడే ఉన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గుండూరావు స్పందిస్తూ తమ పార్టీ ఎమ్మెల్యే వ్యాఖ్యలు ఆమోదయోగ్యం కాదని అన్నారు. వారికి షోకాజ్‌నోటీసు జారీ చేస్తామని చెప్పారు. 'నేడు రూ.8వేల కోట్ల విలువైన పని జరుగుతోంది. ఇలా బహిరంగ ప్రకటనలు చేయడాన్ని ఖండిస్తున్నాను' అని గుండూరావు స్పష్టంచేశారు. 'సోమశేఖర్ ప్రకటనను నేను ఉదయం చూశాను. ఇది ముమ్మాటికీ క్రమశిక్షణను ఉల్లంఘించడమే. సంకీర్ణ ప్రభుత్వం బెంగళూరులో అనేక అభివృద్ధి పనులు చేస్తోంది' అని అన్నారు. సిద్దరామయ్య ప్రభుత్వం మంజూరు చేసిన పనులు సైతం కొనసాగుతున్నాయన్నారు. ప్రభుత్వంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తాము చర్చించుకుంటామని, ముఖ్యమంత్రి లేదా ఉపముఖ్యమంత్రితో నేరుగా మాట్లాడతామని, క్రమశిక్షణారాహిత్యాన్ని మాత్రం సహించేది లేదని గుండూరావు హెచ్చరించారు. వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సోమశేఖర్‌కు షోకాజ్ నోటీసు పంపి వివరణ తీసుకోవాలని కర్నాటక పీసీసీకి ఆ రాష్ట్ర ఇన్‌చార్జి కేవీ వేణుగోపాల్ ఆదేశించారు. వివరణ సంతృప్తికరంగా లేకపోతే పార్టీ క్రమశిక్షణా చర్యలు తీసుకుంటుందని వేణుగోపాల్ హెచ్చరించారు.

మోడీని దింపడమే లక్ష్యం

ప్రియాంక చరిష్మాగల నేత : శశి థరూర్ స్పష్టీకరణ



జైపూర్ : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోడీ, ఆయన ప్రభుత్వాన్ని ఓడిస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకుడు శశి థరూర్ స్పష్టంచేశారు. మోడీ ప్రభుత్వాన్ని సాగనంపడానికి పెద్ద పెద్ద తుపాకులు అవసరం లేదని అన్నారు. 'పెరడాక్సికల్ ప్రైమ్‌మినిస్టర్' పేరుతో మోడీపై థరూర్ పుస్తకం రాశారు. మోడీలో ఇద్దరు వ్యక్తులు ఉన్నారని, బయటికి కనిపించే మోడీ ఒకరు...లోపల మోడీ ఒకరని థరూర్ వ్యాఖ్యానించారు. బహిరంగ సభల్లో 'అందరితో...అందరి అభివృద్ధి', 'రాజ్యాంగమే నాకు పవిత్ర గ్రంథం' వంటి మాటలతో మోడీ ప్రజలను మోసగిస్తున్నారని ఆరోపించారు. భారత సమాజంలో ఆయనకు మద్దతిచ్చేవారు అత్యంత ప్రమాదకారులని అన్నారు. ప్రియాంకగాంధీ క్రియాశీల రాజకీయ ప్రవేశంపై శశిథరూర్ స్పందిస్తూ ప్రజలను, ఓటర్లను సమ్మోహితులను చేయగల చరిష్మా ఆమెకు ఉందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీకి ఆమెను పెద్ద ఆస్తిగా అభివర్ణించారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు అన్ని ఆటంకాలను కాంగ్రెస్ పార్టీ అధిగమిస్తుందని చెప్పారు. గొప్ప విశ్వసనీయత గల వ్యక్తి ప్రియాంక అన్నారు. ఇప్పటి దాకా ఆమె చాలా సంయమనంతో ఉన్నారని, తెర వెనుక చాలా కార్యక్రమాలు నిర్వహించారని, అమేథీ, రాయబరేలీలకు మాత్రమే పరిమితమయ్యారని గుర్తుచేశారు. ప్రియాంక రాకతో ఇక తాము వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం లేకుండా పోయింద న్నారు. మోడీని గద్దె దించడమే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. శశిథరూర్ సోమవారం పీటీఐకి ఇంటర్వ్యూ ఇచ్చారు. ప్రియాంక ఇప్పటి దాకా బహిరంగంగా వచ్చిన సందర్భాలు చాలా తక్కువని, ప్రైవేట్‌గా పార్టీ కోసం ఆమె చాలా చేశారని థరూర్ పేర్కొన్నారు. గో మూకల దాడులు, ఘర్‌వాపసి, లవ్ జీహాద్ వంటి అనేక అంశాలపై మోడీ మౌనం వహించడాన్ని ఆయన ప్రశ్నించారు. మోడీ హిందీలో అద్భుతంగా ప్రసంగిస్తారు. మాటలు పలకడంలో బాలీవుడ్ నటులు సరిపోరు. సందర్భానుచితంగా గొంతు పెంచుతారు. తగ్గిస్తారు. సినిమా ఫోజులు పెడతారు. ఇది ఆయన రాజకీయ జీవితంలో ఓ భాగమని థరూర్ చెప్పారు.

ఎయిర్‌సెల్- మాక్సీస్ కేసులో

చిదంబరం, కార్తీలకు ఊరట



న్యూఢిల్లీ : ఎయిర్‌సెల్-మాక్సీస్ కేసులో మాజీ ఆర్థికమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిదంబరం, ఆయన కుమారుడు కార్తీ చిదంబరానికి ఊరట కలిగింది. సీబీఐ ప్రత్యేక జడ్జి ఓపీ శైనీ వారి ముందస్తు బెయిలను ఫిబ్రవరి 18 వరకు పొడి గించారు. అంతకుముందు అది ఫిబ్రవరి 1 వరకు మాత్రమే ఉంది. జనవరి 11న జరిగి విచారణలో ఐదుగురు బ్యూరోక్రాట్స్‌తో సహా చిదంబరానికి అరెస్టు నుంచి మినహాయింపును ఇచ్చారు. ఈ కేసులో మొత్తం 18 మంది ఉన్నారని సీబీఐ నవంబరు 16న తెలిపింది. గతేడాది జూలై 19న సీబీఐ చిదంబరం, ఆయన కుమారుడు కార్తీపై ఈ కేసును నమోదు చేసింది. 2006లో చిదంబరం కేంద్ర మంత్రిగా ఉండగా, విదేశీ సంస్థ ఎఫ్ఐపీబీకి ఆయన అనుమతులు మంజూరు చేశారు. అయితే ఈ పనిని కేంద్ర కేబినెట్ కమిటీకి చెందిన ఎకనామిక్స్ అఫైర్స్ (సీసీఈఏ)కు మాత్రమే ఆమోదిం చాల్సిన అధికారం ఉంది. చిదంబరం, కార్తీలు దర్యాప్తుకు సహకరించడం లేదని సీబీఐ, ఈడీలు కోర్టుకు తెలిపాయి.అయితే ఈ ఆరోపణలను తండ్రీ, కొడుకులు వ్యతిరేకిస్తూ, కస్టోడియల్ విచారణ అవసరం లేదన్నారు. దర్యాప్తు సంస్థల తరపున పీకే దూబే, అర్షదీప్ సింగ్‌లు కోర్టుకు హాజరయ్యారు. గతేడాది మేలో చిదంబరం యాంటిసిపేటరీకి దరఖాస్తు చేసుకు న్నారు. అప్పటి నుంచి ముందస్తు బెయిల్‌ను పొడిగిస్తూ వస్తున్నారు. ఇద్దరినీ కస్టడీకి అప్పగించాలని సీబీఐ, ఈడీలు కోరుతున్నాయి. ఎయిర్‌సెల్ మాక్సిస్ కేసులో రూ.3,500 కోట్లు, ఐఎన్ఎక్స్ మీడియా కేసులో రూ. 305 కోట్లు అవినీతికి పాల్పడినట్టు దర్యాప్తు సంస్థలు ఆరోపిస్తున్నాయి. మొదట కేంద్ర మాజీ మంత్రి దయా నిధి మారన్, ఆయన సోదరుడు కళానిధి మారన్‌పై ఈ కేసులు నమోదు అయ్యాయి. 2006 మార్చిలో మారిషి యస్‌కు చెందిన గ్లోబల్ కమ్యూనికేషన్స్ సర్వీస్ హోల్డింగ్ లిమిటెడ్‌కు చిదంబరం ఎఫ్ఐపీబీ అనుమతులు మంజూరు చేశారు.

గోవా టేపులు విశ్వసనీయమైనవే : రాహుల్

న్యూఢిల్లీ : రాఫెల్ కుంభకోణానికి సంబంధించి "గోవా ఆడియో టేపులు" విశ్వసనీయమైనవని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. 'రాఫెల్‌కు సంబంధించి వెల్లడన రహస్యాలు గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ స్వాధీనంలో ఉన్నాయని. ఇందుకు సంబంధించి ప్రధానమంత్రి ఆయనకు అధికారం ఇచ్చారని తెలిపారు. రాఫెల్ ఫైళ్లు పారికర్ ఆధీనంలో ఉన్నాయని గోవా మంత్రి విశ్వజిత్ రాణె గుర్తుతెలియని వ్యక్తితో చెపుతున్న ఆడియోను కాంగ్రెస్ పార్టీ ఇటీవల బయటపెట్టింది. ఆ తరువాత రాఫెల్ కుంభకోణంపై రాహుల్ తన విమర్శనాస్త్రాలకు పదును పెట్టారు. అయితే, ఈ టేపులు కల్పితమని రాణె జనవరి మొదటి వారంలో పేర్కొన్నారు. ఆ తరువాత రాహుల్ ట్విట్టర్‌లో "రాఫెల్‌పై గోవా ఆడియో టేపులు విడుదల చేసి 30 రోజులు గడిచిపోయింది. దానిపై ఎఫ్ఐఆర్ లేదు, విచారణకు ఆదేశించలేదు. మంత్రిపై ఏ విధమైన చర్య తీసుకోలేదు" అని పేర్కొన్నారు. "ఆ టేపులు విశ్వసనీయమైనవి, రాఫెల్‌కు సంబంధించిన రహస్యాలు గోవా ముఖ్యమంత్రి, పారికర్ వద్ద ఉన్నాయి. ప్రధానమంత్రి అధికారం ఆయనకు ఇచ్చారు" అని రాహుల్ తెలిపారు.

జాతీయపార్టీలను తిరస్కరించండి : ఒవైసీ

థానే : రానున్న లోక్‌సభ ఎన్నికల్లో జాతీయపార్టీలను తిరస్కరించాలని దళిత, మైనార్టీ,ఆదీవాసీలకు ఆల్ ఇండియా మజ్లిస్ ఇ ఇత్తాహుల్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ పిలుపు నిచ్చారు. కల్యాణ్ జిల్లాలో జరిగిన వంచిత్ బహుజన్ అఘాదీ ర్యాలీలో ఆయన పై విధంగా పిలుపునిచ్చారు. 70 ఏళ్ల నుంచి దళిత, మైనార్టీ, ఆదీవాసీలు వంచనకు, వేధనలకు గురి అవుతున్నారన్నారు. వంచిత్ బహుజన్ అఘాదీ ఏఐఎంఐఎంకు చెందిన సంస్థ. భారీప బహుజన్ మహా సంఘ్ (బీబీఎం)కు ప్రకాష్ అంబేద్కర్ నాయకత్వం వహిస్తున్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ భారతీయ పౌరులందరికీ సమాన హక్కులు కల్పించారన్నారని ఆయన శ్లాఘించారు. అణగారిన వర్గాల ఓట్లతోనే బీజేపీ, కాంగ్రెస్‌లు అధికారంలోకి వచ్చాయని, అయితే ఆ రెండు పార్టీలు వారికి తీరని అన్యాయం చేశాయన్నారు. దేశానికి వాచ్‌మెన్ కాకుండా, భద్రతాదారుడు కావాలని ఒవైసీ అన్నారు. దేశానికి కాపాలాదారుడిగా ఉంటానని ప్రధాని మోడీ అనేక సార్లు వ్యాఖ్యా నించిన విషయం తెలిసిందే. జంధ్యంధారి అని రాహుల్ గాంధీని విమ ర్శించారు. ప్రకాష్ అంబేద్కర్ మాత్రమే దళితులు,పేదలు,అణగారిన వర్గాలకు న్యాయం చేయ గలరని, కాంగ్రెస్, ప్రధాని మోడీ, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫెడ్నావిస్, ఎన్‌సీపీ చీఫ్ శరద్‌పవార్‌లాంటి వారివల్ల కాదని ఒవైసీ స్పష్టం చేశారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి ఆర్ఎస్ఎస్‌నేత, సామాజిక వేత్త కీ.శే. నానాజీ దేశ్‌ముఖ్, సంగీతకారుడు కీ.శే. భూపెన్ హజారిక వంటి ఉన్నత కులాల వారికి భారత రత్న ప్రకటించారని తీవ్ర విమర్శ చేశారు. దళిత నాయకుడు బాబాసాహెబ్ అంబేద్కర్ భారత రత్నకు అర్హుడని, ఎందుకంటే ఆయన రాజ్యాంగం ద్వారా దేశానికి దిశానిర్ధేశం చేశారని ఒవైసీ శ్లాఘించారు.

కాంగ్రెస్ మాకు మద్దతివ్వాల్సిందే

- ప్రియాంక రాకతో ఆ పార్టీకి మహర్దశ
- ఆలయ వివాదంపై యోగి అహంకార వ్యాఖ్యలు
- ఒక్క కొత్త పథకమూ తీసుకురాని బీజేపీ సర్కారు
- పీటీఐ ఇంటర్వ్యూలో అఖిలేష్ యాదవ్ విమర్శ



లక్నో : వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీపై పోరాటం చేయాలన్న పట్టుదల, కృతనిశ్చయం కాంగ్రెస్ పార్టీకి ఉంటే... ఎస్పీ, బీఎస్పీకి ఆ పార్టీ కచ్చితంగా మద్దతివ్వాల్సిందేనని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ అన్నారు. ప్రియాంక గాంధీ క్రియాశీల రాజకీయ ప్రవేశాన్ని ఆయన స్వాగతించారు. కాంగ్రెస్ పార్టీకి ప్రియాంక ప్రభావంపై స్పందిస్తూ కచ్చితంగా ఆ పార్టీకి మంచి ఊపు, ఉత్సాహం రావడంలో అనుమానం లేదని అఖిలేష్ చెప్పారు. అయితే, నిత్యం అబద్ధాలు ప్రచారం చేసే బీజేపీకి వ్యతిరేకంగా పోరాడాలన్న చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు ఉంటే..ఎస్పీ-బీఎస్పీ కూటమికి అది మద్దతివ్వాలని యూపీ మాజీ సీఎం అన్నారు. కాంగ్రెస్ కోసం తాము ఇప్పటికే రాయ్‌బరేలి, అమేథీ సీట్లు వదిలిపెట్టామని తెలిపారు. అఖిలేష్ యాదవ్ సోమవారం పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో అనేక అంశాలను ప్రస్తావించారు. అఖిలేష్, మాయావతి నిర్ణయాన్ని తాను గౌరవిస్తున్నానని, వారిపై తనకు ఎలాంటి కోపం లేదని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ప్రకటించిన నేపథ్యంలో అఖిలేష్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. తమ పార్టీ వెనకడుగు వేసే ప్రసక్తేలేదని, అది గుజరాత్ అయినా, ఉత్తరప్రదేశ్ అయినా తమది ముందడుగేనని రాహుల్ అన్నారు. ప్రియాంకను యూపీ తూర్పు ప్రాంత ఇనచార్జిగా నియమించడంపై ప్రశ్నించగా 'ఆమె క్రియాశీల రాజకీయ ప్రవేశాన్ని నేను స్వాగతిస్తున్నాను. నవభారత నిర్మాణం కోసం యువత క్రియాశీల రాజకీయాల్లో చేరాల్సిన అవశ్యకత ఉంది' అని అఖిలేష్ చెప్పారు. ప్రయాగ్‌రాజ్‌లోని కుంభ్‌లో కేబినెట్ సమావేశం నిర్వహించాలన్న యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వ నిర్ణయంపై స్పందిస్తూ కుంభ్ నుంచి కన్నౌజ్ వరకూ ఎక్కడైనా కేబినెట్ సమావేశం ఏర్పాటు చేసుకోవచ్చని యూపీ మాజీ సీఎం అన్నారు. కన్నౌజ్ లోక్‌సభ నియోజకవర్గానికి అఖిలేష్ భార్య దింపుల్ యాదవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న విషయం విదితమే. బీజేపీ ప్రభుత్వం ఎక్కడైనా కేబినెట్ సమావేశాలు నిర్వహించుకోవచ్చని, అయితే, తన హయాంలో ప్రారంభించిన పథకాలు మినహా తనకు తాను సొంతంగా కొత్త పథకాలు తీసుకువస్తే ప్రజలకు మంచిదని అఖిలేష్ హితవు పలికారు. తన హయాంలో కుంభ్ ఏర్పాట్లు అద్భుతంగా చేశామని, ముస్లిం నాయకులు, అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారని గుర్తుచేశారు. 'విశ్వాసంతో ప్రజలు కుంభ్‌కు వస్తారు. నా హయాంలో పట్టణాభివృద్ధిశాఖమంత్రి మొహమ్మద్ ఆజం ఖాన్, ఆరోగ్యమంత్రి అహ్మద్ హసన్, చీఫ్ సెక్రటరి జావేద్ ఉస్మానీ అద్భుత ఏర్పాట్లు చేశారు. మత ప్రాతిపదికన సమాజాన్ని విభజించే బీజేపీ మాదిరిగా కాకుండా ఎస్పీ ప్రజలను ఐక్యం చేసేదిగా కుంభమేళాను చూస్తోంది' అని అఖిలేష్ చెప్పారు. రామమందిర నిర్మాణం సమస్యను తమ ప్రభుత్వం 24 గంటల్లో పరిష్కరిస్తుందని యోగి ఆదిత్యనాథ్ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ రానున్న 90 రోజుల పాటు పంటలను సర్వనాశనం చేస్తున్న ఆంబోతుల నుంచి రైతులను సీఎం కాపాడితే మంచిదని మాజీ సీఎం సూచించారు. రామమందిర సమస్యను సుప్రీంకోర్టు సత్వరమే పరిష్కరించాలని, అనవసర జాప్యంతో ప్రజా విశ్వాసం కోల్పోతుందని, అందుకు వెంటనే సుప్రీంకోర్టు దీనిపై తీర్పు ఇవ్వాలని యోగి ఆదిత్యనాథ్ గతవారం వ్యాఖ్యానించారు. సత్వరమే మందిర సమస్యను పరిష్కరిస్తారా? లేక ఆ సమస్యను తమకు అప్పగిస్తారా అని కూడా అన్నారు. తమకు అప్పగిస్తే 24 గంటల్లోనే రామజన్మభూమి వివాదాన్ని పరిష్కరిస్తామని, 25వ గంటను కూడా తీసుకోబోమని చెప్పారు. రిపబ్లిక్ దినోత్సవం నాడు ముఖ్యమంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడమంటే..సీఎం ఏ తరహాగా ఆలోచిస్తున్నారో ఊహించండని అఖిలేష్ అన్నారు.



ప్రధానిపై దుమ్మెత్తిపోసి సాధించేదేమిటి

విశాలాంధ్ర - అన్నవరం : భారతదేశంలో అత్యున్నత ప్రజాస్వామ్య విధానంలో ఎన్నుకోబడిన ప్రధానమంత్రి నరేంద్రమోడీపై దుమ్మెత్తిపోసేలా విమర్శించడం వల్ల ముఖ్యమంత్రి చంద్రబాబు సాధించేదేమిటని రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు వ్యాఖ్యానించారు. తూర్పు గోదావరి జిల్లా అన్నవరం శ్రీవీరవెంకట సత్యనారాయణస్వామి సన్నిధిలో సోమవారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక ఓ రెసిడెన్సీలో విలేకర్లతో మాట్లాడుతూ బీసీ వ్యక్తి ప్రధానమంత్రిగా కొనసాగుతున్నా గౌరవించలేని చంద్రబాబు జయహో బీసీ సభలో రాష్ట్ర బీసీలకు ఎంతో గౌరవాభిమానాలు ఇస్తున్నట్లు జిత్తులమారి నక్క వినయం ప్రదర్శిస్తున్న తీరును ప్రజలు గమనించాలన్నారు. ప్రత్యేక హోదా హైడ్రామాలో బాబు మాటలను ప్రజలు స్పష్టంగా గమనించారన్నారు. దుబారా ఖర్చులో రాష్ట్ర ప్రజల నెత్తిన 2.50 లక్షల కోట్ల అప్పులు పెట్టి కేంద్రానితో ఖయ్యానికి దిగి కుంటి సాకులు చెప్పడం బాబుకే చెల్లిందన్నారు. సమావేశంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ టి.వి.కె.రామలింగేశ్వరావు, కంచుమర్తి రాజన్న, మమ్మ ప్రభాష్, ఎర్రా అచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

ఎంటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడుగా శ్రీనివాసరావు



విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ (ఎం.టి.ఎఫ్.ఏపీ) రాష్ట్ర అధ్యక్షులుగా ఎస్.శ్రీనివాసరావును ఎన్నుకున్నట్లు ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిడి రవి సిద్ధార్థ తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత అధ్యక్షులు ఎస్.రామకృష్ణ అనేక అక్రమాలకు పాల్పడ్డారన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 23వ తేదీన రాష్ట్ర కార్యవర్గం, సాధారణ సమావేశాల్లో సభ్యుల అభిప్రాయాల మేరకు రామకృష్ణను ఫెడరేషన్ నుంచి బహిష్కరిస్తూ తీర్మానించామన్నారు. అదే సమయంలో నూతన అధ్యక్షునిగా శ్రీనివాసరావును ఎన్నుకున్నామన్నారు. తానే అధ్యక్షునిగా రామకృష్ణ ప్రచారం చేసుకుంటున్నారని, ఆయన తీసుకునే నిర్ణయాలతో తమకు సంబంధం లేదన్నారు. సమావేశంలో ఫెడరేషన్ కృష్ణాజిల్లా అధ్యక్షులు ఇమామ్ భాషా తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలో బీసీ లాయర్ల దీక్ష

విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : గత ఎన్నికల సమయంలో రాష్ట్రంలో న్యాయ వాదులకు ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయడంతోపాటు వారి సంక్షేమానికి రూ.100 కోట్లు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పల్లపు కృష్ణ డిమాండ్ చేశారు. న్యాయవాదులకు ఇచ్చిన హామీల అమలు కోరుతూ అసోసియేషన్ అధ్వర్యంలో సోమవారం విజయవాడ ధర్నాచౌక్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ న్యాయవాదులపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందన్నారు. గత ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చిన నేటి పాలకులు ఒక్కటీ అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణ ప్రభుత్వం న్యాయవాదుల సంక్షేమానికి రూ.100 కోట్లు కేటాయించిన విషయాన్ని ఆంధ్రా పాలకులు గుర్తించాలన్నారు. తక్షణం న్యాయవాదులకు హెల్త్ కార్డు,గ్రూపు ఇన్సూరెన్స్ అమలు చేయాలన్నారు. లా అఫీసర్ల నియామకాలలో (ఏజీపీ,ఏపీపీ) రిజర్వేషన్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టాలన్నారు. అమరావతిలో న్యాయవాదులకు నివేశన స్థలాలు కేటాయించాల న్నారు. జూనియర్ న్యాయవాదులకు 5 సంవత్సరాలలోపు నెలకు రూ.5 వేలు చొప్పున స్టైఫండ్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే పెద్దఎత్తున అందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.శివ ప్రసాద్, గ్రేటర్ అమరావతి కమిటీ అధ్యక్షులు ఎస్.కె.గౌస్ భాషా, ఏపీఏ డబ్ల్యూజే ఏసీ రాష్ట్ర చైర్మన్ ఎపి.లాలి, జిల్లా అధ్యక్షులు ఎం.అంక శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కె.నరసింహారావు, కార్యదర్శి భార్గవరాముడు తదితరులు పాల్గొన్నారు.

20.18 లక్షల ఇళ్ల నిర్మాణం



విశాలాంధ్ర - భీమునిపట్నం : రాష్ట్రంలో రూ.32 వేల కోట్ల వ్యయంతో 20 లక్షల 18 వేల గృహాలు నిర్మిస్తున్నట్లు రాష్ట్ర మంత్రి కాలవ శ్రీనివాసులు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఇళ్ల నిర్మిస్తున్నామ న్నారు. విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గంలోని సైబర్ వ్యాలీ, ఓజోన్ వ్యాలీలో హుధూద్ బాధితుల కోసం రూ.15 కోట్లతో నిర్మించిన 352 గృహాలను సోమవారం మంత్రులు గంటా శ్రీనివాసరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. నగరంలోని అరిలోవ ప్రాంతంలో గృహనిర్మాణ సంస్థ జిల్లా కార్యాలయ నూతన భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.ఆయా చోట్ల కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ 2022 నాటికి రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ ఉచితంగా ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. పెన్షన్ మొత్తాలను పది రెట్లు పెంచామన్నారు. విశాఖ జిల్లాలో రూ.6,800 కోట్లతో రూ.1.98 లక్షల గృహాలు నిర్మిస్తున్నామని మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.1,054.84 కోట్లు ఖర్చు చేసి 69,454 గృహాలు నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చిక్కాల విజయ్‌బాబు, ఏఎంసీ చైర్మన్ కోరాడ నాగభూషణ్‌రావు, గిడ్డంగుల సంస్థ డైరెక్టర్ మణిశంకరనాయుడు, డీఎల్‌డీఏ చైర్మన్ గాదు వెంకటప్పుడు తదితరులు పాల్గొన్నారు.

రూ.8 లక్షలలోపు ఆదాయ పన్ను మినహాయింపు ఇవ్వాలి



విశాలాంధ్ర - విశాఖ సిటీ బ్యూరో : అగ్రవర్ణ పేదల ఆదాయ పరిమితిని రూ.8 లక్షలుగా కేంద్ర ప్రభుత్వం పరిగణించడంతో ఈ మొత్తం లోపు అందరికీ ఆదాయపు పన్ను మినహాయింపు ఇవ్వాలని వైసీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీవీ వామనరావు డిమాండ్ చేశారు. విశాఖలోని యూనియన్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాకులాడుతున్నాయితప్ప పాలనలో చిత్తశుద్ధి లేదన్నారు. దేశంలో ప్రజలందరికీ సమన్యాయం అందించాల్సిన పాలకులు మనుగడ కోసం ఎన్నికల వేళ తాయిలాలు ప్రకటిస్తున్నారయన్నారు. అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు రాజకీయమేనన్నారు. ఆదాయ పన్ను పరిమితిని రూ.8 లక్షలుగా ప్రకటించిన ప్రభుత్వం ఆదాయం రెండున్నర లక్షల రూపాయలు దాటిన వారంతా ఆదాయపు పన్ను చెల్లించాలనడం సరికాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి వుంటే చివరి బడ్జెట్ సమావేశాల్లో దేశవ్యాప్తంగా అందరికి సమానంగా రూ.8 లక్షల ఆదాయ పన్ను పరిమితి వుండేలా అన్ని పార్టీల ఎంపీలు గళమెత్తాలని వామనరావు విజ్ఞప్తి చేశారు.

శ్రీకాళహస్తీశ్వరాలయానికి రూ.1.11 కోట్ల విరాళం



విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తిలోని శ్రీకాళహస్తీశ్వరాలయానికి పట్టణానికి చెందిన సుబ్రహ్మణ్యం, రాధికమ్మ దంపతులు రూ.1.11 కోట్లను విరాళంగా అందజేశారు. మంగళవారం ఆలయ ఈవో రామ రామస్వామిని కలిసిన కుటుంబసభ్యులు తమ తల్లిదండ్రులు వెంకట సుబ్బయ్య, రామలక్ష్మమ్మ జ్ఞాపకార్థం రూ. 1,11,11,112 విలువైన చెక్కును అందజేశారు. దేవస్థానంలో నిత్య అన్నదాన కార్యక్రమానికి వినియోగించాలని కోరారు. ఈ సందర్భంగా దంపతులను ఈవో రామస్వామి ఘనంగా సన్మానించారు. స్వామి, అమ్మవార్ల తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ లోకేష్, కరుణాకర్ స్వామి, గోపి తదితరులు పాల్గొన్నారు. శ్రీకాళహస్తి పట్టణవాసిగా భారీ మొత్తంలో విరాళం ఇవ్వడంతో ఆలయాధికారులు ఆ దంపతులను అభినందించారు.

కోట్ల కుటుంబం పార్టీని వీడడం దురదృష్టకరం



విశాలాంధ్ర - నంద్యాల సిటీ : కోట్ల కుటుంబం కాంగ్రెస్ పార్టీని వీడడం దురదృష్టకరమని ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షులు రఘువీరారెడ్డి అన్నారు. కర్నూలు జిల్లా నంద్యాలలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు సోమవారం వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కోట్ల అంటే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటే కోట్ల కుటుంబమని, అటువంటి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి పార్టీని వీడటంతో కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు బాధపడుతున్నారన్నారు. దివంగత ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి ఆత్మ క్షోభిస్తుందన్నారు. ఆయన పార్టీ మారడాన్ని ఎవరూ జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. తాను కూడా కోట్ల సూర్యతో మాట్లాడానని, పునరాలోచించుకోమని కోరానన్నారు. ఈ సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి మునియప్పన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బైరెడ్డి రాజశేఖరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నీరజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట.. ఓ 'రంగస్థలం'

- ఎమ్మెల్యే మేడా వైసీపీలో చేరికతో ఉత్కంఠ
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న అమర్‌నాథరెడ్డి వర్గీయుల
- కేసులు పెట్టించిన వ్యక్తికి మద్దతివ్వలేమని తిరుగుబాటు
- టికెట్ అమర్‌నాథరెడ్డికే ఇవ్వాలని డిమాండు
- వైసీపీ కీలక నేతలకు జగన్ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో - కడప : వైఎస్ఆర్ కడపజిల్లా రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ టికెట్ రగడ రాజుకుంటోంది. ఇటీవల పార్టీలో చేరిన టీడీపీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డికి టికెట్ ఖాయమన్న ప్రచారం జోరందుకున్న నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అకేపాటి అమర్‌నాథరెడ్డి తనకే టికెట్ కావాలని పట్టుబడుతున్నారు. ఈ క్రమంలో అకేపాటికి మద్దతుగా బూత్ కన్వీనర్లు సైతం తిరుగుబాటుకు సిద్ధం కావడంతో నియోజకవర్గ రాజకీయం మరింత రసవత్తరంగా మారుతుంది. కష్టకాలంలో పార్టీ బాధ్యతలను మోస్తూవచ్చిన అమర్‌నాథరెడ్డి తాడోపేడో తేల్చుకునేందుకు జిల్లా నేతలను వెంటబెట్టుకుని వైసీపీ అధినేత జగన్ వద్దకు వెళ్లారు. ఈ చర్చల్లో అమర్‌నాథరెడ్డికి ఎమ్మెల్సీ పదవి ఆఫర్ ఇచ్చినట్లు ప్రచారం. చర్చల అనంతరం బయటకొచ్చిన అకేపాటి అధినేత నిర్ణయం మేరకే నడుచుకుంటామంటూ స్పష్టతనిచ్చారు. దీంతో ఎమ్మెల్యే మేడా తన అనుచరవర్గంతో కలిసి ఈ నెల 31వ తేదీన లోటస్ పాండ్‌లో వైసీపీ అధినేత జగన్ ఎదుట పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు.

అకేపాటి వర్గీయుల తీవ్ర అసంతృప్తి

పార్టీ అధినేతతో చర్చల అనంతరం జిల్లాకు చేరుకున్న అకేపాటి వైసీపీ మండలాల నాయకులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, బూత్ కన్వీనర్లతోపాటు మద్దతుదారులతో ఇటీవల సమావేశమైన నేపథ్యంలో అకేపాటి వర్గీయులు నిరసన స్వరం వినిపించారు. గడచిన నాలుగేళ్లుగా ఎమ్మెల్యే మేడా అణచివేతతో అష్టకష్టాలు పడిన తాము ఆయనకు మద్దతుగా పనిచేసేది లేదని తెగేసి చెప్పినట్టు సమాచారం. పోలీసు కేసుల్లో ఇరికించి ఇబ్బందులపాల్జేసిన వ్యక్తికి ఎలా మద్దతివ్వాలని ప్రశ్నించడంతో గందరగోళం నెలకొంది. అకేపాటి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సిద్ధవటం, నందలూరు, ఒంటిమిట్ట, రాజంపేట, వీరబల్లె, సుండుపల్లె మండలాలల్లోని ఆయన వర్గీయులు భగ్గుమన్నారు. తమ నేతకు టికెట్ దక్కుతుందో.. లేదోన్న భావనతో మేడా రాకను తీవ్రంగా వ్యతిరేకించారు.



రాజంపేటలో కార్యకర్తలతో మాట్లాడుతున్న అమర్‌నాథరెడ్డి (ఫైల్‌ఫొటో)

అమర్‌నాథరెడ్డి ప్రసంగిస్తుండంగానే కొందరు కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. కడపకు వచ్చిన వైఎస్ జగన్ రాజకీయ కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ఎదుట తీవ్ర స్థాయిలోనే ఆకేపాటి వర్గీయులు తమ స్వరం వినిపించారు. మేడా పెట్టిన ఇబ్బందులను ఉదాహరణలతో వివరిస్తూ అలాంటి వ్యక్తికి మద్దతు ఇవ్వబోమని తెగేసి చెప్పినట్టు వినికిడి. అమర్నాథరెడ్డికే రాజంపేట టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఆదివారం రాజంపేటకు వచ్చిన కడప మేయర్ సురేష్‌బాబు కూడా అమర్‌నాథరెడ్డి వర్గీయుల ఆవేదనపై స్పందిస్తూ మొదటి నుంచి పార్టీని అంటిపెట్టుకున్న ఆయనకు తగిన న్యాయం జరుగుతుందని, జగన్ నిర్ణయం కోసం ఎదురు చూడాలని సూచించారు. టిక్కెట్ తమకే ఇస్తారన్న నమ్మకంతో ఉన్నానని, ఈ నెల 31వ తేదీ వరకు వేచిచూసిన తరువాత నిర్ణయం తీసుకుంటామని కార్యకర్తలు ఆవేశంతో వాఖ్యానించినట్టు సమాచారం.

హైదరాబాద్‌కు కీలక నేతలు

ఎమ్మెల్యే మేడా వైసీపీలో చేరికతో ప్రతికూల పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రాజంపేట పట్టణ కీలక నేతలకు పార్టీ అధినేత వైఎస్ జగన్ నుంచి పిలుపువచ్చింది. రాజంపేట పట్టణ నేతలు చొప్పా ఎల్లారెడ్డి, పోలా శ్రీనివాసులురెడ్డితో పాటు మరికొందరికి మంగళవారం హైదరాబాద్‌లో తనను కలవాలని సమాచారం అందినట్లు తెలిసింది. అధినేతతో భేటీ అనంతరం వీరి ఎలా నడుచుకుంటారో వేచిచూడాలి.

భారీ ఏర్పాట్లలో 'మేడా'

ఎమ్మెల్యే మేడా అనుచరగణంతో ఈ నెల 31న వైఎస్ జగన్ ఎదుట పార్టీలో చేరేందుకు భారీ ఏర్పాటు చేసుకుంటున్నారు. అకేపాటి వర్గీయుల హెచ్చరికల నేపథ్యంలో పరిస్థితి ఎలా మారుతుందోనన్న చర్చ నియోజకవర్గంలో జోరందుకుంది. మేడా మాత్రం తన పని తాను చేసుకుపోతున్నారు. మండలాల్లోని తన వర్గీయులతో పాటు వైసీపీ నాయకులు, కార్యకర్తలను కలిసేందుకు విస్తృత స్థాయిలో చర్చలు సాగిస్తున్నారు. భారీ జనసందోహంతో బయలుదేరి వెళ్లి సత్తా చాటుకోవాలన్న ప్రయత్నాల్లో మేడా నిమగ్నమయ్యారు. ఇప్పటికే వాహనాలను సైతం పెద్దఎత్తున సిద్ధం చేసుకున్నట్లు సమాచారం.



18న పార్లమెంట్ ముట్టడికి కదులుదాం

విశాలాంధ్ర - నెల్లూరుబ్యూరో : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 18వ తేదీన చలో పార్లమెంట్ కార్యక్రమానికి సంఘటితంగా విద్యార్థిలోకం తరలిరావాలని అఖిలభారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగన్న పిలుపు నిచ్చారు. కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న నేపథ్యంలో విద్యావ్యవస్థను పరిరక్షించుకోవడానికి విద్యార్థులు ఉద్యమించాలని కోరారు. నెల్లూరు నగరంలోని రామకోటయ్యభవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ కేంద్రంలో అధికారం చేపట్టిన తర్వాత విద్యను కాషాయీకరణ చేయాలని కుట్ర పన్నుతోందన్నారు. యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్‌ను తొలగించి భారత ఉన్నత విద్యా కమిషన్ తీసుకురావడం ద్వారా విద్యను వ్యాపారీకరణ చేయడానికి కుట్ర చేస్తున్నారన్నారు. దేశవ్యాప్తంగా మూసివేసిన 40 వేల ప్రభుత్వ పాఠశాలలను తెరిపించాలని డిమాండ్ చేశారు. మోడీ అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి నాలుగేళ్ళు పూర్తయినా ఎన్ని కోట్ల ఉద్యోగాలు భర్తీ చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. దేశంలోని వివిధ శాఖల్లో ఖాళీ ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నెల్లూరు జిల్లా అడహక్ కమిటీ కన్వీనర్ మస్తాన్, కో-కన్వీనర్ కిరణ్, ఆసీఫ్, ముస్తాఖ్, నాని, తదితరులు పాల్గొన్నారు.

7 వేల మెడికల్ ఏటీఎంలు

- సాంకేతిక పరిజ్ఞానంతో గ్రామాలకు వైద్యసేవలు
- 65 ఏళ్లు దాటిన వారికి ఇంటి వద్దకే సేవలు

ఏపీ మెడ్‌టెక్ జోన్ సీఈవో జితేంద్రశర్మ

విశాలాంధ్ర - విశాఖపట్నం(మధురవాడ) : రాష్ట్రంలోని మారుమూల గ్రామాలకు వైద్యసేవలను విస్తరణకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దేశంలోనే తొలిసారి ఏడు వేల ఎనీటైమ్ మెడికల్ కేర్(ఏటీఎం) కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జితేంద్రశర్మ తెలిపారు. విశాఖలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(జీఎస్ఐబీ) ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తూ ప్రతిఒక్కరికీ వైద్యసేవలను అందుబాటులోకి తేవడం, 65 సంవత్సరాల వయస్సు దాటిన వారికి ఇంటి వద్దే వైద్యం అందించడానికి ఆంధ్రప్రదేశ్ హోమ్ హెల్త్‌కేర్ ప్రోగ్రాంను త్వరలో రాష్ట్రంలో అమలు చేయనున్నామన్నారు. వైద్యరంగానికి అవసరమైన సాంకేతిక ఉపకరణాలను విదేశాలను నుంచి దిగుమతి చేసుకునే పరిస్థితి మారి దేశీయంగా మెడికల్ టెక్నాలజీ పరికరాల తయారీకి మెడ్‌టెక్ జోన్ ఏర్పాటు అయ్యిందన్నారు. విశ్వవిద్యాలయంలో పరిశోధనా ఫలితాలకు పరిశ్రమల ద్వారా ఇ-అక్షన్ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. ఏపీ మెడ్‌టెక్ జోన్ తరహాలో దేశంలో మరికొన్ని వైద్య ఉపకరణ తయారీ కేంద్రాల ఏర్పాటుకు నీతి అయోగ్ సూచనలు చేసినట్టు చెప్పారు. మేనేజ్‌మెంట్ నిపుణులు, టెక్నాలజీ నిపుణులు సంయుక్తంగా పనిచేయడం ద్వారా నూతన అవకాశాలను సృష్టించాలన్నారు. గీతం ఇన్‌ఛార్జి వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ మాట్లాడుతూ గీతం మెడ్‌టెక్ జోన్‌తో అవగాహన ఒప్పదం కుదుర్చుకోవడానికి సిద్ధంగా ఉందన్నారు. ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ కోర్సుల విద్యార్థులకు నూతన అవకాశాలపై అవగాహన కోసం మెడ్‌టెక్ జోన్‌లో ఏర్పాటైన పారిశ్రామిక యూనిట్‌లు ఉపయోగపడతాయన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ డైరెక్టర్ డాక్టర్ గౌతమ్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ డాక్టర్ రాధా రఘురామపాత్రుని తదితరులు పాల్గొన్నారు.



జితేంద్రశర్మను సత్కరిస్తున్న గీతం వర్సిటీ ప్రతినిధులు



ఏపీపీఎస్సీ చైర్మన్ దిష్టిబొమ్మ దగ్ధంలో ఉద్రిక్తత

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : రిజర్వేషన్ లక్ష్యాలకు తూట్లు పొడుస్తున్న ఏపీపీఎస్సీ చైర్మన్ ఉదయభాస్కర్‌ను తక్షణం భర్తరఫ్ చేయాలని కోరుతూ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కర్నూలు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ఆందోళనలో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఏఐవైఎఫ్ కర్నూలు జిల్లా అధ్యక్షులు నాగ రాముడు అధ్యక్షతన కలెక్టరేట్ ఎదుట ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏపీజీఎస్, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల ఆధ్వర్యంలో నాయకులు కారుమంచి, నాగేష్, ఎం.రాముడు, భరత్ తదితరులు నిరసన చేపట్టారు. ఏపీపీఎస్సీ చైర్మన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సమయంలో అక్కడకు చేరుకున్న మూడో పట్టణ సీఐ హనుమంత నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులకు, విద్యార్థి, యువజన సంఘాల నాయకుల మధ్య వాగ్వివాదం, తోపులాట జరిగింది. దురుసుగా ప్రవర్తించిన పోలీసులు నాయకులను జీపులో ఎక్కించి మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఏఐవైఎఫ్ నాయకులు కారుమంచి శ్రీనివాసులు, ఏపీజీఎస్ నాయకులు మోటా రాముడు, ఏఐఎస్ఎఫ్ నాయకులు మహేంద్ర, డీవైఎఫ్ఐ నాయకులు నాగేష్, ఉశేని, ఎస్ఎఫ్ఐ ప్రకాషతోపాటు ఎనిమిది మందిని అరెస్టుచేసి అనంతరం సొంత పూచికత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి, యువజన సంఘాల నాయకులు మాట్లాడుతూ చైర్మన్ ఉదయభాస్కర్ వ్యక్తిగత నిర్ణయాలతో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసేలా వ్యవహరిస్తున్నారన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న ఉదయభాస్కర్‌ను చైర్మన్ పదవి నుంచి తొలగించాల్సిందేన్నారు. రాష్ట్రంలో గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలను ఆన్‌లైన్ కాకుండా ఒకే రోజు ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి జి.చంద్ర శేఖర్, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పక్రుద్దీన్, బీసన్న, రాఘవేంద్ర, శివప్రసాద్, రాముడు తదితరులు పాల్గొన్నారు.


తరగతి గదిలో పగిలిన యాసిడ్ బాటిళ్లు

- ఆరుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలు
- తిరుపతి రుయాకి తరలింపు
- చిత్తూరు జిల్లా చెర్లోపల్లిలో ఘటన

విశాలాంధ్ర - తిరుపతి : ఉపాధ్యాయుల నిర్లక్ష్యం విద్యార్థుల ప్రాణల మీదకొచ్చిన ఘటన సోమవారం సాయంత్రం చిత్తూరు జిల్లా తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లిలో చోటు చేసుకుంది. తరగతి గదిలోని యాసిడ్ బాటిళ్ళు కిందపడి పగలడంతో పలువురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ఆ సమయంలో ఉపాధ్యాయులు ఎవ్వరూ తరగతి గదిలో లేకపోవడంతో తల్లిదండ్రులు అగ్రహం వ్యక్తం చేశారు. చెర్లోపల్లి జెడ్పీ హైస్కూల్‌లో సాయంత్రం పాఠశాల ముగిసిన తరువాత పదవ తరగతి విద్యార్థులను స్పెషల్ క్లాస్ కోసం డిజిటల్ క్లాస్ రూములోకి పంపారు. ఉపాధ్యాయులు పత్తా లేకుండాపోయారు. ఈ సమయంలో విద్యార్థులు ఒకరిపై ఒకరు తోపులాడుకుంటూ యాసిడ్ బాటిల్స్ పై పడ్డారు. బాటిళ్లు పగిలి పిల్లలకు యాసిడ్ పడటంతో ఆరుగురు పిల్లలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఒక్కసారిగా విద్యార్థులు కేకలతో గందరగోళం నెలకొంది. డిజిటల్ క్లాస్ రూము నుంచి ఒక్కసారిగా బయటకు పరుగులు తీస్తున్న సమయంలో జరిగిన తోపులాటలో పలువురికి గాయాలయ్యాయి. విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు పుదిపట్ల ఎంపీటీసీ సభ్యులు ఐడి సుధాయాదవ్ తన కారులో గాయపడిన పిల్లలను హుటాహుటిన తిరుపతి రుయాకి తరలించారు. ఆరుగురు పిల్లల చర్మం తీవ్రంగా కాలిపోయింది. వైద్యులు సేవలు అందిస్తున్నారు.

ముద్రగడ రాజకీయ పయనమెటో.. !

విశాలాంధ్ర ప్రతినిధి - కాకినాడ : కాపు ఉద్యమ నేత, రాష్ట్ర మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం రాజకీయ భవితవ్యం ఏమిటనే చర్చ ఆశక్తికరంగా మారింది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఆయన పోటీ చేస్తారా.. ఏ పార్టీకి మద్దతు ఇస్తారనే అంశం చర్చనీయాంశం అయ్యింది. ముద్రగడ రాజకీయ పయనం ఎటు వైపు వెళ్తుందంటూ కాపు సామాజికవర్గంతోపాటు ఇతర రాజకీయ పార్టీలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. అధికార తెలుగు దేశం పార్టీ కాపులకు రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చినా నెరవేరకపోవడంతో వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి వ్యతిరేకంగా పనిచేయాలని ముద్రగడ నిర్ణయించుకున్నారు. నాలుగేళ్లుగా టీడీపీపై విరుచుకుపడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఆయన నిరాహార దీక్షలు, పాద యాత్రలను ప్రభుత్వం ముందుకు సాగనివ్వలేదు. ఈ నేపథ్యంలో వైఎస్ఆర్‌సీపీ వైపు మొగ్గుచూపి వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తారనే ప్రచారం సాగుతోంది. జనసేన వైపునకు వెళ్ళే అవకాశాలు లేకపోలేదనే చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లా కత్తిపూడిలో జరగబోయే కాపు ఐక్య వేదిక సమావేశంలో రాజకీయ భవిష్యత్‌పై ప్రకటిస్తానని ముద్రగడ ప్రకటించారు.



ముద్రగడ ఇంటి వద్ద సోమవారం మోహరించిన పోలీసులు

ఆ సమావేశానికి టీడీపీ అడ్డంకులు సృష్టిస్తోందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ఇప్పటికే జిల్లాలోని కాపు ముఖ్య నేతలను పోలీసులు ముందస్తుగా అరెస్టులు చేస్తున్నారు. మరోవైపు ముద్రగడ స్వగ్రామం కిర్లంపూడిలో రెండు రోజులుగా భారీ స్థాయిలో పోలీసు బలగారు పహారా కాస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాపు ఐక్యవేదిక సమావేశం జరగనివ్వకూడదంటూ ఆదేశాలు రావడంతో జిల్లా పోలీసులు యంత్రాంగం ఆ పనిలో నిమగ్నమైనట్టు సమాచారం. వచ్చే ఎన్నికల నేపథ్యంలో తమ వెంట ఉన్న కాపులు ఏ పార్టీకి మద్దతు ఇవ్వాలనే అంశంతోపాటు తన రాజకీయ నిర్ణయం ప్రకటించేందుకు ఈనెల 30న కత్తిపూడిలో కాపు ఐక్యవేదిక సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల కాపులను ముద్రగడ ఆహ్వానించారు. వేలాదిగా తరలివచ్చి సూచనలు ఇవ్వాలని కోరారు. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ తరుణంలో వైసీపీ ముఖ్య నేతలతో ముద్రగడ మంతనాలు సాగిస్తున్నట్టు సమాచారం.

వైసీపీలో వెళ్ళాలంటే కాపులకు రిజర్వేషన్లు కుదరదని ప్రకటించిన జగన్ తిరిగి తూర్పుగోదావరి జిల్లాకు వచ్చి రిజర్వేషన్లకు కృషి చేస్తానని ప్రకటించాలని ముద్రగడ షరతు పెట్టినట్లు ప్రచారం సాగుతోంది. ఈ ప్రకటన అనంతరం పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారంటున్నారు. పిఠాపురం వైసీపీ కోఆర్డినేటర్ పెండెం దొరబాబుపై సర్వేల్లో వ్యతిరేకత నేపథ్యంలో ముద్రగడను రంగంలోకి దింపాలని వైసీపీ నేతలు ముద్రగడతో చర్చిస్తున్నట్టు తెలిసింది. ఆయనతోపాటు పెద్దాపురం నుంచి మాజీ ఎమ్మెల్సీ బొడ్డు భాస్కరరామారావును కూడా ఆయనే వైసీపీ తరపునన పోటీకి ఒప్పించినట్లు కూడా ప్రచారం సాగుతోంది. 31వ తేదీ చలో కత్తిపూడి సమావేశానికి ప్రభుత్వం అడ్డంకులు సృష్టించడంతో ఆ నిర్ణయం వాయిదా పడే అకాశం లేకపోలేదని అనుచరులు ముద్రగడ అనుచరులు అంటున్నారు.

పోలీసు వలయంలో కిర్లంపూడి

- 'చలో కత్తిపూడి'తో పోలీసులు అప్రమత్తం
- ముద్రగడ ఇంటి వద్ద సీసీ కెమేరాలు
- ఊరు చుట్టూ పోలీసులు.. గ్రామస్తుల్లో టెన్షన్

విశాలాంధ్ర - కిర్లంపూడి : తూర్పుగోదావరి జిల్లాలో కిర్లంపూడి గ్రామం మరోసారి పోలీసుల వలయంతో నిండిపోయింది. కాపు ఉద్యమనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఈనెల 31వ తేదీన 'చలో కత్తిపూడి' పేరుతో కాపు జేఏసీ సమావేశానికి పిలుపు నిచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమయింది. తుని ఘటన నేపథ్యంలో మరోసారి ఏమైనా ఘర్షణలు చోటుచేసుకుంటా యన్న అనుమానంతో ఎక్కడికక్కడ పోలీసు బందోబస్తును పటిష్టం చేస్తున్నారు. ముద్రగడ స్వగ్రామమైన కిర్లంపూడిలో మూడు రోజుల నుంచి పోలీసు బందోబస్తు కొనసాగు తున్నప్పటికీ సోమవారం భారీ స్థాయిలో భద్రతా బలగాలు చేరుకున్నాయి. గ్రామం నాలుగు వైపులా రహదారులను నిర్బంధించే ప్రయత్నం చేస్తున్నారు. కిర్లంపూడికి వచ్చే అన్ని దారుల్లో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేస్తున్నారు. గ్రామంలో ఎలాంటి అలజడులకు ఆస్కారం లేకుండా అడుగడుగునా నిఘా పెట్టారు. ముద్రగడ నివాసం ఎదురుగా విద్యుత్ స్తంభానికి మూడు సీసీ కెమేరాలు అమర్చారు. ఇంటిపై నిరంతర నిఘాతో పోలీసులు సమాచారం సేకరిస్తున్నారు. కిర్లంపూడి చుట్టూ పోలీసు బలగాలు మోహరించడంతో ఏ క్షణానికి ఏం జరుగుతుందోనన్న భయం గ్రామస్తులను వెంటాడుతోంది. పెద్దాపురం డీఎస్పీ సీహెచ్ రామారావు, జగంపేట, తుని సీఐలు వై.రాంబాబు, వి.శ్రీనివాసరావు, స్థానిక ఎస్సై జి.నరేష్‌తో పాటు పలువురు ఎస్సైలు బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు

'జయహో బీసీ' అంతా బూటకం : ధర్మాన ప్రసాదరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ ప్రభుత్వం నిర్వహించిన 'జయహో బీసీ' అంతా బూటకమని, సీఎం చంద్రబాబు అసత్యవాది అని వైసీపీ సీనియర్‌నేత ధర్మాన ప్రసాదరావు విమర్శించారు. విజయవాడ వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల్లో చంద్రబాబుకు బీసీల తడాఖా చూపిస్తామన్నారు. 2014 ఎన్నికల మేనిఫెస్టోలో బీసీలకు చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. చంద్రబాబు మాటలు నమ్మి ప్రతిసారి బీసీలు మోసపోతున్నారని దుయ్యబట్టారు. కేంద్రంలో టీడీపీ తరపున ఇద్దరికి మంత్రి పదవులకు అవకాశమిస్తే..వారిలో ఒక్కరైనా బీసీలకు అవకాశమిచ్చారా? అని ప్రశ్నించారు. మత్స్యకారులను ఎస్టీలో చేరుస్తామనే హామీని నెరవేర్చాలని కోరిన వారిపై చంద్రబాబు అవమానించేలా వ్యాఖ్యనించారని గుర్తుచేశారు. రాబోయే ఎన్నికల్లో చంద్రబాబుకు బీసీల తడాఖా చూపిస్తామని దుయ్యబట్టారు. ఫెడరల్ ఫ్రంట్‌పై చర్చించేందుకే వైసీపీ అధినేత జగన్‌తో కేటీఆర్ భేటీ అయ్యారని, దీనిపై టీడీపీ రాద్ధాంతం చేయడం విడ్డూరమని అన్నారు. టీఆర్ఎస్‌తో చంద్రబాబు ఎందుకు పొత్తులకు ప్రయత్నించారో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు.

జీడీపీలో కృష్ణా జిల్లా భేష్ : యనమల

విశాలాంధ్ర -అమరావతి : జీడీపీలో కృష్ణాజిల్లా టాప్‌లో నిలిచింది. 2017-18లో రూ.1,89,121లతో రాష్ట్రంలోనే కృష్ణాజిల్లా మొదటి స్థానంలో నిలవటం అభినందనీయమని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు కొనియాడారు. వెలగపూడి సచివాలయంలో 2019-24 కృష్ణాజిల్లా విజన్ యాక్షన్ ప్లాన్‌ను ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు విడుదల చేశారు. 2023-24 నాటికి ప్రస్తుత ధరల ప్రకారం కృష్ణా జిల్లా జీడీడీపీ రూ.2,55,064 కోట్ల లక్ష్యాన్ని చేరుకోవడం ద్వారా తలసరి ఆదాయం రూ.4,73,307కు చేరుకుంటుందని కలెక్టర్ లక్ష్మీకాంతం వెల్లడించారు. పాల ఉత్పత్తిలో 2017-18లో 15.63 లక్షల టన్నుల ఉత్ప త్తితో జిల్లా గణనీయమైన ప్రగతి సాధించిందని, పోషకాహార లోపం, రక్తలేమి నివారణలో పురోగతి సాధించిందని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయం, చేపలపెంపకం, తయారీరంగం, సేవల రంగాలను ప్రధాన అభివృద్ధి ఇంజన్లుగా గుర్తించారన్నారు. ఐటీ, జక్కంపూడి ఆర్థిక నగరం, జెట్ సిటీ, జాతీయ రహదారుల విస్తరణ, రైల్వే లైన్ల డబ్లింగ్, మచిలీపట్నం ఓడరేవు అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసినట్టు కలెక్టర్ లక్ష్మీకాంతం, మంత్రి యనమలకు వివరించారు. అనంతరం ఫిబ్రవరి 3,4 తేదీల్లో జరగనున్న కొండపల్లి ఉత్సవాల పోస్టర్, ఫిబ్రవరి 10న జరగనున్న ఫెలికాన్ పక్షుల పండుగ పోస్టర్లను మంత్రి యనమల విడుదల చేశారు.



పాత పింఛన్ విధానం పునరుద్ధరించాలి

సీఎంను కోరిన ఏపీ జేఏసీ అమరావతి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించి లక్షలాది మందిగా ఉన్న సీపీఎస్ ఉద్యోగులకు ఊరట కలిగించాలని సీఎం చంద్రబాబును ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఫణిపేర్రాజులు కోరారు. అమరావతిలో సీఎం చంద్రబాబును ఏపీ జేఏసీ చైర్మన్ ఆధ్వర్యంలో కార్యవర్గం సోమవారం కలిసింది. ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్ల స్థలాల కేటాయింపు, మధ్యంతర భృతి, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల అంశాలు, నాలుగో తరగతి ఉద్యోగుల పదవీవిరమణ వయస్సు పెంపు వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈసందర్భంగా బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యోగులకు ఐఆర్‌ను త్వరితగతిన ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఎంప్లాయీస్ హెల్త్‌కార్డులు పూర్తిస్థాయిలో అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు సాధారణ సెలవులు మంజూరు చేయాలని కోరారు. మృతిచెందిన కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబాలకు రూ.15లక్షల ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వీరికి కనీస వేతనం రూ.25వేలు ఇవ్వాలని సూచించారు. డ్రైవర్ల సమస్యలపై ప్రస్తాయిస్తూ ప్రభుత్వ డ్రైవర్ల వ్యవస్థను పునరుద్ధరించాలన్నారు. అద్దెవాహనాల వలన రాష్ట్రానికి ఆర్థికభారంగా ఉన్నందున కియో మోటార్ ఎలక్ట్రానిక్ వాహనాలను వినియోగించాలని సూచించారు. ఈనేపథ్యంలో వైద్యఆరోగ్యశాఖకు జిల్లాకు ఒక వాహనం చొప్పున కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ జేఏసీ అమరావతి ట్రెజరర్ మురళీకృష్ణనాయుడు, ఈశ్వర్, డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డీఎస్ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పిడికిలి బిగిద్దాం

- మహిళాభివృద్ధిలో ప్రభుత్వాలు విఫలం
- చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ ఎన్నికల హామీనే
- 70 సంవత్సరాల స్వాతంత్ర్య అనంతరం స్త్రీలపై వివక్షే
- 33 కాదు 50 శాతం రిజర్వేషన్లు సాధించుకుంటాం
- కాషాయ పాలకుల అఘాయిత్యాలను అడ్డుకుందాం
- నేటి నుంచి ఏలూరులో మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలు



ఎప్పటికప్పుడు మారిపోతున్న సామాజిక పరిస్థితుల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం దొరకక కొత్త సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. జనంలోనే కాకుండా అభివృద్ధిలోనూ సగం అన్న భావనను స్థిరీకరించుకునేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకోవడానికి ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య సిద్ధం అవుతోంది. అందుకు మంగళవారం నుంచి మూడు రోజులపాటు ఏలూరులో జరగనున్న రాష్ట్ర 14వ మహాసభలు వేదికకాబోతున్నాయి. కాషాయ పాలనలో ఎప్పటికప్పుడు ఎదురొస్తున్న సామాజిక దురాచారాలను, పితృస్వామిక భావజాలంతో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఎదుర్కొని కాషాయ పాలకుల తీరును ఎండగట్టేందుకు పిడికిలి బిగించి బూర్జువా తత్వాన్ని ఎత్తిచూపే దిశగా ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య అడుగులు వేస్తోంది. ఈ విప్లవాత్మక, చారిత్రాత్మక అడుగుకు ఏలూరు వేదిక కానుంది. గర్జించు మహిళా... అంటూ మహిళా సమాఖ్య ఇచ్చిన పిలుపునకు స్పందించి ఐదు వేల మంది మహిళలు ఏలూరు నగరంలో కదం తొక్కి, తమ గళాన్ని రాష్ట్రవ్యాప్తంగా వినిపించేందుకు సిద్ధమవుతున్నారు.

విశాలాంధ్ర బ్యూరో - ఏలూరు : మహిళలపై నిరంతరం జరుగుతున్న దాడులు, అత్యాచారాలు ఆందోళన కలిగిస్తున్నాయి... మహిళల రక్షణకు నిర్భయ లాంటి చట్టాలు ఎన్ని ఉన్నా భద్రత కరవవుతోంది... మహిళల సమున్నత అభివృద్ధే ధ్యేయమంటూ ప్రకటనలు గుప్పిస్తున్న ప్రభుత్వాలు ఆచరణలో విఫలమవుతున్నాయి. ఆచారాలు, సంప్రదాయాల పేరుతో మహిళలు అణచివేతకు గురౌతున్నారు... సమానత్వ సాధన అందనంత దూరంలో ఉంది..... పనిలో, గనిలో, కార్ఖానాలో ఇలా ఎక్కడ చూసిన మహిళా కార్మికుల పట్ల చులకన భావం కొనసాగుతూనే ఉంది. చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజరేషన్ అమలుకు నోచుకోవడం లేదు.. మద్య నిషేధం అందనంత దూరంలో. సినిమాలు, టీవీల్లో అసభ్యత, అశ్లీలత పెచ్చు మీరిపోతోంది. మహిళలకు సమానపనికి సమాన వేతనం అందని ద్రాక్షే.. వీటన్నింటి విముక్తి కోసం భారతీయ మహిళల పోరాటాలను స్వాతంత్ర్యానికి ముందునుంచే ప్రారంభించారు... భారతీయ స్త్రీలు స్వేచ్ఛ, సమానత్వాలను కొంత వరకు మాత్రమే సాధించుకో గలిగారు. 70 సంవత్సరాల స్వాతంత్ర్య సాధన అనంతరం కూడా స్త్రీల పట్ల వివక్షత కొనసాగుతూనే ఉంది. దీన్ని వ్యతిరేకిస్తూ దివిలో, భువిలో సగ భాగం ఉన్న తమకు రావలసిన హక్కులు ఇవ్వాల్సిందేనని, 33 కాదు 50 శాతం రిజర్వేషన్లు, హక్కులు సాధించి, మమ్మల్ని మేమే పాలించుకుంటాం అంటూ మహిళలు కొంగు బిగించారు. మోడీ, చంద్రబాబు, జగన్‌ల ప్రచారర్భాటాలు, కుర్చీ లాటను నిగదీస్తామంటూ మహిళా లోకం గళమెత్తింది. తృతీయ ప్రత్యామ్నాయం వైపుగా అడుగులు వడివడిగా వేస్తోంది.

ఎన్ఎఫ్ఐడబ్ల్యు పోరాటాలు :

భారత దేశంలో హక్కుల సాధన చట్టాల అమలు కోసం జరిపిన మహిళా ఉద్యమానికి సుదీర్ఘచరిత్ర ఉంది. మానవ చరిత్రకు పునాదియైన స్త్రీని కాలక్రమంలో ద్వితీయ శ్రేణి పౌరురాలుగా మార్చారు. మానవాద పక్షపాతాన్ని బద్దలగొట్టి, బ్రాహ్మణ పితృస్వామ్య వ్యవస్థను నిరసిస్తూ మహిళలు చాంధసవాదానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. విముక్తి కోసం పోరాటాలు జరిపారు. ఇందులో భాగంగా 1947లో కోల్‌కత్తాలో ఆల్‌ఇండియా ఉమెన్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. 1950లో సాంఘిక, ఆర్థిక, రాజకీయ హక్కులు, సమన్వయం కోసం పశ్చిమ బెంగాల్‌లో వేలాది మంది మహిళలు చేసిన ఉద్యమం నేటి తరానికి ఆదర్శనీయంగా ఉంది. తదనంతం కాలంలో అనేక రకాల వ్యతిరేకతలు వచ్చినప్పటికీ మహిళల ఉద్యమాలు అంతకన్న తీవ్ర స్థాయిలో కొనసాగుతూ వచ్చాయి.

భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) 1954లో ఏర్పడింది. ఇందులో మహిళా ఆత్మ రక్షణ సమితి, పంజాబ్‌లో లోక్ స్త్రీ సభ, ఒరిస్సాలో నారీ మంగళ్ సమితి, మణిపూర్ మహిళా సమితి లాంటి 39 సంస్థలు ఉండేవి. ఇందులో 1.30 లక్షల మంది మహిళా కార్మికులు, గిరిజనులు, దళితులు, వివక్షతకు గురైన వారు సభ్యులుగా ఉండేవారు. ముఖ్యంగా 1980 నుంచి వరకట్న వ్యతిరేక పోరాటాలు, చట్టసభలో రిజర్వేషన్ల కోసం పనిచేస్తున్నాయి. 1990లో ఎన్.ఎఫ్.ఐ.డబ్ల్యు, ఎ.ఐ.డబ్ల్యు.సి., ఐద్వా, సి.డబ్ల్యు.డి.ఎస్., మహిళా దక్షత సమితి, వై.ఎం.సి.ఎ.వంటి ఏడు సంస్థలు కలిసి ఉమ్మడి సివిల్ కోడ్, రిజర్వేషన్ బిల్లు తదితర సమస్యల ప్రాముఖ్యతను సమాజానికి చాటి చెప్పాయి. 1995లో బీజింగ్‌లో జరిగిన 4వ ప్రపంచ మహిళ సదస్సులో ఈ అంశాలను ప్రముఖంగా ఆయా సంస్థలు ప్రస్తావించాయి. స్త్రీ సంఘర్ష్, మానుషి, యాక్షన్ ఇండియా లాంటి చిన్న, చిన్న సంస్థలతో కూడా ఈ సంస్థలు దహేజ్ విరోధి చేతన సంఘ్ పేరుతో వరకట్న వ్యతిరేక ఉద్యమాన్ని చేశారు. విడాకులు, లైగింక వేధింపులు, అత్యాచారాలు, గృహహింస వంటి వాటికి వ్యతిరేకంగా చట్టాల రూపకల్పనలో మహిళా సంఘాలు చేసిన కృషి అనిర్వచనీయం. మహిళల విద్య, ఉపాధి హక్కుల కోసం కూడా ఉద్యమాలు, పోరాటాలు, చేశాయి.

రాష్ట్రంలో మహిళా సమాఖ్య : ఇక రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య 1937లో కృష్ణాజిల్లా పామర్రులో స్థాపించబడింది. నాటి నుంచి నేటి వరకు బాల్య వివాహాలు, మూఢ నమ్మకాలు, సాంఘిక దురాచాలకు వ్యతిరేకంగా, మహిళల ఆరోగ్యం, బాలికావిద్య, వితంతు వివాహాల ప్రోత్సాహం, వరకట్న వేధింపులు, అత్యాచారాల నిరోధం ఇలా అనేక అంశాలపై గ్రామస్థాయి నుంచి పోరాటాలు జరిపి విజయాలు సాధిస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో నిర్ణయాధికారంలో మహిళ భాగస్వామ్యాలను కోరుతూ, చట్టసభల్లో 33 కాదు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, కుటుంబ, సామాజిక, రాజకీయ,ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో సమాన ప్రాతినిధ్యం కోసం ఉద్యమాలు చేస్తున్నది. మహాసభల్లో మహిళల హక్కుల సాధన, చట్టాల అమలు కోసం చేపట్టాల్సిన రాష్ట్ర స్థాయి పోరాటాలు, ఉద్యమాలు, వాటిని అనుసరించాల్సిన విధానాలపై పలు కీలక నిర్ణయాలు తీసుకుంటారు.



సంక్షేమ బోర్డుల సాధనకు

ఫిబ్రవరి 6న మహాధర్నా

హమాలీ, ఆటో, వీధి విక్రయదారులకు ఓబులేసు పిలుపు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : సంక్షేమ బోర్డుల సాధనకై ఫిబ్రవరి 6న విజయవాడలో నిర్వహించే మహాధర్నాకు హమాలీ, ఆటో, వీధి విక్రయదారులు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.ఓబులేసు పిలుపునిచ్చారు. సోమవారం గొల్లపూడి ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం జొన్నభట్ల సత్యనారాయణ భవన్‌లో హమాలీ,ఆటో,వీధి విక్రయదారుల సంయుక్త సమావేశం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.ఓబులేసు,రాష్ట్రగౌరవాధ్యక్షులు చలసాని వెంకట రామారావు, అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్.వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు. రాష్ట్రంలో ఆటో,హమాలీ,చిరు వ్యాపారస్తులు దాదాపు 50లక్షల పైబడి ఉన్నారని, వీరికి సరైన ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ పరంగ ఎలాంటి చట్టాలు, హక్కులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి కోసం రాష్ట్ర సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేసి కార్మికుల సాంఘిక,సామాజిక భద్రతలకు సౌకర్యాలు అందించాలని ఓబులేసు డిమాండు చేశారు. 2017 జులై 10న వెలగపూడి సచివాలయంలో కార్మికశాఖ మంత్రి కార్మిక సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఈ సమస్యలను ప్రస్తావించామని,ఆనాడు సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇంత వరకు నెరవేర్చలేదని మండిపడ్డారు. ఈ నెలాఖరు నుంచి అసెంబ్లీ సమావేశాలు, త్వరలో సార్వత్రిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఆటో,హమాలీ,వీధి విక్రయదారులు ఉద్యమిస్తే తప్ప ఫలితం ఉండదన్నారు. రవీంద్రనాథ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులతో సంబంధం లేకుండానే ఈ రంగాల కార్మికుల యాజమాన్యాల నుంచి, వ్యాపార వర్గాల నుంచి ఒక్క శాతం సెస్ వసూలు చేస్తే సులభంగా 50లక్షల మంది కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయవచ్చునన్నారు.

చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ 1991 నుంచి అమలయిన ఆర్థిక సంస్కరణలతో దేశంలో ప్రభుత్వ రంగాన్ని పాతరేసి ప్రైవేటు సెక్టార్‌కు ప్రాధాన్యత కల్పించినప్పటి నుంచి ప్రభుత్వ రంగ కార్మికులు తగ్గిపోయి స్వయం ఉపాధి రంగం ఏర్పడిందన్నారు. ఇందులో భాగమే డిగ్రీలు,పీజీల్లాంటి ఉన్నత విద్య చదివిన యువకులు ఆటో,ముఠా, వీధివిక్రయ రంగాల్లో పనులు చేసుకుంటూ జీవిస్తున్నారని, ఇలాంటి కార్మికుల పై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరి స్తోందన్నారు. డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో ఈ కార్మికులకు సంక్షేమ చట్టం అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని, లేదంటే ఫిబ్రవరి 6న విజయవాడలో పెద్దఎత్తున మహాధర్నా నిర్వహించి ప్రభుత్వ వైఖరిని ఎండగడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముఠా కార్మికసంఘం నాయకులు సుభాన్‌నాయుడు, వెంకట రెడ్డి, ఆటో యూనియన్ నాయకులు ప్రభాకర్, మల్లిఖార్జున,వీధి విక్రయదారుల సంఘం నేతలు తెడ్డు వెంకటేశ్వరరావు, కొట్టు రమణ, రాష్ట్ర నాయకులు కొరారి రమణ, రావుల అంజిబాబు, శ్రీనివాసరావు, నీలం దుర్గారావు, శ్రీరామచంద్రమూర్తి, ఏఐటీయూసీ నగర అధ్యక్ష,కార్యదర్శులు సాంబశివరావు, తాతయ్య,వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

కోల్‌కతా సభకు దీటుగా


త్వరలో అమరావతి ధర్మపోరాట దీక్ష

అధికారదాహంతోనే దగ్గుబాటి పార్టీలు మార్పు

పార్టీ నేతల టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : కోల్‌కతా సభకు ధీటుగా త్వరలో అమరావతిలో ధర్మపోరాట దీక్ష నిర్వహించనున్నట్లు సీఎం చంద్రబాబు చెప్పారు. ఎలక్షన్ మిషన్ 2019పై పార్టీ నాయ కులు, కార్యకర్తలతో ఆయన సోమవారం ఉదయం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నిన్న మధురైలో ప్రధాని మోడీకి ఎదురైన నిరసనలు 'మూడ్ ఆఫ్ ది నేషన్'కు నిదర్శనమని చంద్రబాబు పేర్కొన్నారు. గజ తుపానుపై మోడీ నిర్లక్ష్యానికి మధురైలో నిరసనలు వెల్లువెత్తాయన్నారు. తమిళనాడుతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌కు బీజేపీకి తీరని ద్రోహం చేసిందని చెప్పారు. మోడీ, అమిత్‌షా రాష్ట్రానికి వస్తే తీవ్ర వ్యతిరేకత, నిరసనలు ప్రజల నుంచి వ్యక్తమవు తాయన్నారు. అమరావతిలో జరిగే చివరి ధర్మపోరాట సభకు జాతీయ పార్టీల నేతలంతా వస్తారని, కోల్‌కతాలో జరిగిన విపక్షాల ర్యాలీకి ధీటుగా అమరావతి సభ ఉండాలని నేతలకు సీఎం స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తలు, నేతలు కలిసి కట్టుగా పనిచేసి అమరావతి ధర్మపోరాట సభను విజయవంతం చేయాలని కోరారు. బీసీల ఐక్యతను దెబ్బతీయాలనే కుట్ర జరుగుతోందని, దీనిపై నేతలు అప్రమత్తంగా వుండాలని సీఎం సూచించారు. బీసీలపై వైసీపీ, టీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఇటీవల 29 కులాలను బీసీ జాబితా నుంచి తొలగించిందని గుర్తు చేశారు. అటువంటి కేసీఆర్‌తో వైసీపీ అధ్యక్షుడు జగన్ కలయిక బీసీ వ్యతిరేకచర్యగా పేర్కొన్నారు.

అధికార దాహంతోనే దగ్గుబాటి పార్టీలు మార్పు : అధికారం దాహం కోసమే దగ్గుబాటి కుటుంబం పార్టీలు మారుతోందని సీఎం చంద్రబాబు విమర్శించారు. ఇప్పటివరకు వారు మారని పార్టీలు లేవని ఎద్దేవా చేశారు. ఆరెస్సెస్‌తోపాటు అన్నిపార్టీల చుట్టూ ప్రదక్షిణలు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్‌లో పురందేశ్వరి కేంద్రమంత్రి అయితే దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఎమ్మెల్యేగా ఉన్నారని, ఆ తర్వాత కాంగ్రెస్‌ను వదిలేసి బీజేపీలో చేరారని గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లీ వైసీపీలో చేరుతున్నారన్నారు. వీళ్ల ఫిరాయిం పులన్నీ అధికారం కోసమేనని చంద్రబాబు మండి పడ్డారు. లక్ష్మీపార్వతి కూడా అందుకే ఆ పార్టీతో కుమ్మక్కయ్యారని చంద్రబాబు దుయ్యబట్టారు. అవకాశవాదంతోనే ఆనాడు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్‌ను వాడుకున్నారని. దాం తోనే ఆయనకు అప్రతిష్ఠ తీసుకొచ్చారని తీవ్రస్థాయిలో విమర్శించారు. అలాంటి వాళ్లందరూ ఇప్పుడు ఒకే గూటికి చేరారన్నారు. వాళ్ల డొల్ల తనాన్ని ప్రజల్లో ఎండగట్టాలని నేతలకు, కార్యకర్త లకు పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరంలో ఆదివారం జరిగిన "జయహో బీసీ" చరిత్రాత్మక సభగా పేర్కొన్నారు. ఆ సభను విజయవంతం చేసిన పార్టీ నాయకులందరికీ అభినందనలు తెలిపారు. జయహో బీసీ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, సభలో బీసీలకు ఇచ్చిన హామీలను విస్తృతంగా ప్రచారం చేయాలని నేతలకు ఆయన దిశానిర్దేశం చేశారు. బీసీ హామీలన్నింటినీ ఫ్లెక్సీలతో ప్రచారం చేయాలని సూచించారు. ఈ వారం రోజులు దీనిపై ఉద్ధృతంగా ప్రచారం నిర్వహించాలని నేతలకు పిలుపునిచ్చారు. రాజమండ్రి సభ "మూడ్ ఆఫ్ ది స్టేట్"కు నిదర్శనమన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఏకపక్షం కానుందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. జయహో బీసి సభ ప్రజలకు తెలుగుదేశంపై ఉన్న నమ్మకాన్ని బయటపెట్టిందని, ఈ నమ్మకాన్ని ఇలానే కొనసాగించాలని సూచించారు. ఈ నెల 30వ తేదీన అఖిలపక్షం ఏర్పాటు చేసే విషయంపై చర్చ జరిగినట్లు తెలిసింది.



నిలిచిన క్రషింగ్

రైతుల్లో పెల్లుబికిన ఆగ్రహం

ఎండీ నిర్బంధం, ఫ్యాక్టరీ గేటుకు తాళం

విశాలాంధ్ర - అనకాపల్లి : విశాఖజిల్లా అనకాపల్లి చెరకు రైతులలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఐదు రోజులుగా తుమ్మపాల చక్కెర కర్మాగారం యాజమాన్యం చెరకు క్రషింగ్‌ను నిలిపివేయటంతో రైతులు ఆందోళనకు దిగారు. క్రషింగ్ కోసం రోజుల తరబడి నిరీక్షిస్తున్నా పటించుకోకపోవటంతో ఎండీని నిర్బంధించిన రైతులు ఫ్యాక్టరీ గేటుకు తాళం వేసి ఆందోళనకు దిగిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. చెరకు క్రషింగ్ చేసేంత వరకు ఆందోళన విరమించేదిలేదని రైతులు స్పష్టం చేశారు. క్రషింగ్‌ను నిలుపుదల చేయటంతో ఫ్యాక్టరీ ఎదుట ఎడ్ల బళ్లు, ట్రాక్టర్లు బారులుతీరాయి. రోజులు గడుస్తున్నా యాజమాన్యం క్రషింగ్‌పై స్పష్టమైన హామీ ఇవ్వకపోవటంతో ఎండీ చాంబర్‌లోకి దూసుకువెళ్లి ఆయన్ని నిర్బంధించారు. ఫ్యాక్టరీ పునరుద్దరణకు రూ.35 కోట్లు మంజూరు చేసి పది రోజులైనా క్రషింగ్ ప్రారంభించకపోవటంపై రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఐదు రోజులుగా కర్మాగారంలో మరమ్మతులు జరుగుతున్నాయంటూ యాజమాన్యం చెబుతోందని పలువురు రైతులు చెప్పారు. క్రషింగ్‌లో జాప్యం జరగటం వల్ల వేలాది రూపాయలు అప్పులు వేసి పండించిన చెరకు నాణ్యత లోపించే ప్రమాదం ఉందన్నారు. చెరకు ఎండలో ఎండటం వల్ల రసంలో నాణ్యత తగ్గి ఎందుకూ పనికిరాదన్నారు. రోజుకు 700 టన్నుల క్రషింగ్ చేస్తామన్న యాజమాన్యం, అందులో సగం కూడా చేయలేదని వాపోయారు. క్రషింగ్ గురించి అడిగితే ఎవరికి వారు పొంతన లేని సమాధానం చెబుతున్నారన్నారు. తక్షణమే క్రషింగ్ జరపాలని, లేకుంటే ఆందోళనను ఉదృతం చేస్తామని హెచ్చరించారు. చక్కెర ఫ్యాక్టరీ ఎండీని రైతులు నిర్బంధించిన విషయం తెలియటంతోనే పోలీసులు హుటాహుటీన అక్కడకు చేరుకున్నారు. సమస్య పరిష్కరిస్తే తప్ప సహకరించేదిలేదని రైతులు తేల్చి చెప్పారు. ఇంత జరిగినా క్రషింగ్‌పై యాజమాన్యం ఎలాంటి ప్రకటన చేయలేదు.

అత్యాధునిక హంగులతో జనసేన ప్రచార రథాలు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: అత్యాధునిక హంగులతో రూపొందించిన జనసేన ప్రచార రథాలను జనసేనపార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ జెండా ఊపి ఆరంభించారు. మంగళగిరిలో ఉన్న పార్టీ కార్యాలయంలో సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. జనసేనపార్టీ గుర్తు, సిద్ధాంతాలు, మేనిఫెస్టో వంటి అంశాలను విస్తృతంగా ప్రచారం చేయడానికి జనసేన ప్రచార రథాలను రంగంలోకి దింపింది. మొత్తం 17 ప్రచార రథాలు రోజుకు 170 గ్రామాల్లో పార్టీ సిద్ధాంతాలు, మేనిఫెస్టోను ప్రచారం చేస్తాయి. ప్రచారంలో భాగంగా పార్టీ గుర్తు గాజుగ్లాస్‌తో ప్రజలకు టీ అందివ్వడంతోపాటు సభ్యత్వం నమోదు క్రతువు జరుగుతుంది.

1న నిరసన ర్యాలీలు: సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రానికి బీజేపీ చేసిన ద్రోహాన్ని నిరసిస్తూ ఫిబ్రవరి1వ తేదీన నిరసనలు తెలియజేయాలని సీపీఎం రాష్ట్రకమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు సోమ వారం ఒక ప్రకటన విడుదల చేసింది. 1వ తేదీన కేంద్ర బడ్జెట్టు ప్రవేశపెట్టే సంద ర్భంగా నిరసనలు తెలిపాలని, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలు దగ్ధం చేయాలని తెలిపింది. సీపీఎంతోపాటు కలిసొచ్చే ఇతర పార్టీలతో ర్యాలీలు నిర్వహిస్తామని పేర్కొంది.

మధ్యాహ్న భోజన పథకాన్ని

ప్రైవేటుకు అప్పగించొద్దు

శైలజ, రమేష్‌బాబు డిమాండు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఏపీ మధ్యాహ్న భోజన పథకం యూనియన్ అధ్యక్షప్రధాన కార్యదర్శులు కళ్ళేపల్లి శైలజ, ఎం.రమేష్‌బాబులు సోమవారం ఒక ప్రకటనలో డిమాండు చేశారు. పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు అప్పగించడం ద్వారా ఆహారంలో పౌష్టిక విలువలు తగ్గిపోతున్నాయని, చల్లబడిన భోజనాన్ని వడ్డించడం ద్వారా పిల్లలు తినలేకపోతున్నారన్నారు. పక్క రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు, కర్ణాటకలో ఈ పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించలేదని గుర్తు చేశారు. ఈ పథకంలో పనిచేస్తున్న మహిళలు పేద కుటుంబాలకు చెందిన వారేనని, 16 ఏళ్లుగా ఈ పథకంలో మహిళలు పనిచేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. దీనిని ప్రైవేటు సంస్థలకు అప్పగించడం ద్వారా 85వేల మంది పేద మహిళలు జీవనోపాధిని కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. 2007 నుంచి పనిచేస్తున్న వర్కర్స్‌కు నెలకు రూ.1000/-లు మాత్రమే గౌరవ వేతనం ఇస్తుండగా, కర్ణాటకలో 2,900/-లు, కేరళలో రోజుకు 400/-లు ఇస్తున్నారని,తమిళనాడులో ముగ్గురు వర్కర్స్‌ను పర్మినెంటుగా నియమించి రూ.5,400/-లు, 4,500/-లు, రూ.3,500/-లు, హర్యానా ప్రభుత్వం 3,500/-ల చొప్పున వేతనాలు ఇస్తున్నారని వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇతర రాష్ట్రాల మాదిరిగా కనీస వేతనం 5,000/-లు ఇవ్వాలని, అధ్యయనం చేసేందుకు కమిటీ వేయాలని కోరారు. వంట గ్యాస్ సబ్సిడీ రద్దుతో వర్కర్స్ ఇబ్బంది పడుతున్నారని, కందిపప్పు, నూనె,ఇతర సరుకులు ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండు చేశారు. నెల నెలా బిల్లులు సక్రమంగా అందించలేకపోవడంతో అప్పులు చేసి పథకాన్ని కొనసాగిస్తున్నారన్నారు. నిత్యావసర ధరలకు అనుగుణంగా విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచి, పథకం అమలుకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, కార్మికులకు కనీస వేతనంతోపాటు వేసవి సెలవులతో సంబంధం లేకుండా 12 నెలలు వేతనం ఇవ్వాలన్న డిమాండ్ల సాధనకై ఫిబ్రవరి 4న జరిగే సామూహిక ధర్నా కార్యక్రమంలో కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని శైలజ,రమేష్‌లు విజ్ఞప్తి చేశారు.


మహిళా మహాసభలకు ఏలూరు ముస్తాబు

(మొదటిపేజీ తరువాయి)

ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన పోరాట పంథా, భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నారు. తొలి రోజు మంగళవారం మధ్యాహ్నాం ఒంటిగంటకు మహాసభల వేదిక చంద్ర రాజకుమారి ప్రాంగణం నుంచి ఐదు వేల మంది మహిళలతో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. ర్యాలీలో భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) ప్రధాన కార్యదర్శి డి అనీరాజా, సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి. జయలక్ష్మి, పెన్మెత్స దుర్గాభవాని, ప్రముఖ సినీ నటి కోళ్ల హేమ, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు నెక్కంటి జగదాంబ, గాళ్ల శారద, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తదితర నాయకులు పాల్గొంటారని ఆహ్వాన సంఘ నేతలు తెలిపారు. ర్యాలీ అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద బహిరంగ సభ జరుగుతుంది. 30వ తేదీన ప్రతినిధుల సభ జరుగుతుంది. 31వ తేదీన రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక ఉంటుంది. మహాసభల ప్రాముఖ్యతను నేతలు రాష్ట్ర మంతటా ప్రచారం చేశారు. మహాసభల నిర్వహణకు ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులుగా పారిశ్రామికవేత్త వంక రవీంద్రనాథ్, అధ్యక్షులుగా ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, ప్రధాన కార్యదర్శిగా గాళ్ల శారద, కోశాధికారిగా డేగా ప్రభాకర్ వ్యవహరిస్తున్నారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఏలూరు ఎంపి మాగంటి వెంకటేశ్వరరావు (బాబు) చీఫ్ పాట్రన్స్‌గా ఆహ్వాన సంఘం ఏర్పాటైంది.

ఈ సందర్భంగా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు వి జయలక్ష్మి, జిల్లా అధ్యక్షులు నెక్కంటి జగదాంబ, జిల్లా కార్యదర్శి గాళ్ళ శారద, ఏలూరు ఏరియా కార్యదర్శి అడ్డగర్ల లక్ష్మీ ఇందిర విశాలాంధ్ర ప్రతినిధికి సమాఖ్య మహాసభల వివరాలను వెల్లడించారు.


తొలి రోజు భారీ ర్యాలీ



మహాసభల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశాం. సీపీఐ జిల్లా సమితి మహాసభల నిర్వహణకు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తోంది. జిల్లావ్యాప్తంగా ఇప్పటికే ప్రచార కార్యక్రమాలను పూర్తి చేశారు. 13 జిల్లాల నుండి 5వేల మంది మహిళలు తొలిరోజు జరిగే భారీ ర్యాలీకి హాజరవుతున్నారు.

గాళ్ల శారద
ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి

మహిళా సమస్యలపై చర్చిస్తాం



మహాసభలకు ఏర్పాట్లన్నీ పూర్తి చేశాం. మహిళల సమస్యలపై మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యక్రమాలు నిర్ణయిస్తాం. ప్రధానంగా మద్య నిషేధం, నిర్భయ చట్టం పటిష్టంగా అమలు చేయడం తదితర అంశాలను ప్రస్తావించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తాం. మహిళలకు సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని మహాసభ ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం.

నెక్కంటి జగదాంబ
ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు

విశాలాంధ్ర

క్రీడలు

భారత్ హ్యాట్రిక్

- మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే.. సిరీస్ కైవసం
- అదరగొట్టిన బ్యాట్స్‌మెన్, బౌలర్లు
- ఏ దశలోనూ పోటీ ఇవ్వని కివీస్



ఇక హాయిగా విశ్రమిస్తా

'చివరి రెండు వన్డేల్లోనూ మేం విజయం సాధిస్తాం. చాలా రోజుల నుంచి బ్రేక్ తీసుకోలేదు. ఆస్ట్రేలియా పర్యటనతో ఊపిరి సలపకుండా గడిపాం. అందుకే విరామం తీసుకుంటున్నాను. న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌ను 3-0తో గెలిచాం కాబట్టి సంతోషంగా బ్రేక్ తీసుకుంటా. విరామ సమయాన్ని బాగా గడుపుతాను. ఎవరో ఒకరు మన స్థానాన్ని భర్తీ చేస్తారు. మనం ఉన్నా లేకున్నా ఆట కొనసాగుతుంది.'

\- కోహ్లి

మౌంట్ మాంగనుయ్: కోహ్లిసేనకు తిరు గులేదు. న్యూజిలాండ్‌పై వరుసగా మూడో వన్డే గెలిచింది. ఐదు వన్డేల సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు ఉండగానే 3-0తో కైవసం చేసుకుంది. ముందు బౌలర్లు.. తర్వాత బ్యాట్స్‌మన్ సమష్టిగా రాణించారు. నిలకడతో అదరగొట్టారు. దెబ్బకు కివీస్ చేసేదేమీ లేక డీలా పడిపోయింది. ఒకప్పుడు ఆసీస్, కివీస్ పరిస్థితుల్లో మ్యాచ్‌లు ఆడాలంటే టీమిండియా చెమటోడ్చాల్సి వచ్చేది. ఇప్పుడు పరిస్థితి మారింది. ఒకవైపు పేస్. మరోవైపు మణికట్టు మాయ. భీకరమైన టాప్, మిడిలా ర్డర్. అందుకే భారత్ వరుసగా రెండో వన్డే సిరీస్‌ను గెలిచింది. స్మిత్, వార్నర్ లేని ఆసీస్‌పై సునాయా సంగా గెలిచిందన్న మాటలకు ఘాటు సమాధానం చెప్పింది కోహ్లిసేన. నిలకడకు పేరైన పటిష్ఠ న్యూజిలాండ్ జట్టుపై జైత్రయాత్ర కొనసాగించింది. ఇక విరాట్ కోహ్లి మరో ఘనత సాధించాడు. 63 వన్డేలకు సారథ్యం వహించగా 47 మ్యాచుల్లో జట్టును గెలిపించాడు. క్లైవ్‌లాయిడ్, రికీ పాంటింగ్ 50 వన్డే విజయాల రికార్డుకు చేరువలో నిలిచాడు.

కోహ్లి-శర్మ బ్యాటింగ్ విన్యాసం

న్యూజిలాండ్ నిర్దేశించిన 244 పరుగుల లక్ష్య ఛేదనలో టీమిండియాకు శు భారంభమే లభించింది. ఓపెనర్ శిఖర్ ధావన్ (28, 27 బంతుల్లో 6×4), రోహిత్ శర్మ (62, 77 బంతుల్లో 3×4, 2×6) పోటీ పడి ఆడారు. కాగా, జట్టు స్కోరు 39 వద్ద గబ్బర్‌ను బౌల్ట్ ఔట్ చేశాడు. ఆ తర్వాత వచ్చిన టీమిండియా సారథి విరాట్ కోహ్లి (60, 74 బంతుల్లో 6×4) మరోసారి తన అందమైన ఆటను ప్రదర్శించాడు. సమయోచిత బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఆచితూచి ఆడుతూనే సొగసైన కవర్‌డ్రైవ్‌లు ఆడాడు. అతడికి తోడుగా రోహిత్ శర్మ అప్పుడప్పుడు భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 113 పరుగుల భాగస్వామ్యం అందించారు. క్రీజులో కుదురుకున్న ఈ జోడీని రోహిత్‌శర్మను ఔట్ చేయడం ద్వారా శాంట్నర్ విడదీశాడు. అప్పుడు స్కోరు 152. మరికాసేపటికే కోహ్లిని బౌల్ట్ పెవిలియన్‌కు పంపించాడు. అప్పటికే చేయాల్సిన రన్‌రేట్ తక్కువగా ఉండటంతో భారత్ విజయం సాధించేందుకు కష్టపడలేదు. అంబటి రాయుడు (40, 42 బంతుల్లో 5×4, 1×6), దినేశ్ కార్తీక్ (38, 38 బంతుల్లో 5×4, 1×6) పోటీపడి ఆడారు. నువ్వానేనా అన్నట్టు బౌండరీలు బాదేశారు. నాలుగో వికెట్‌కు 77 పరుగుల అజేయ భాగస్వామ్యం అందించారు. దీంతో కోహ్లిసేన 43 ఓవర్లకే ఛేదన పూర్తిచేసింది. 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. షమికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ లభించింది.



షమి

మళ్లీ షమి..

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్‌ను భారత బౌలర్లు ఆదిలోనే దెబ్బకొట్టారు. మార్టిన్ గప్టిల్ (13), కొలిన్ మన్రో (7), కేన్ విలియమ్సన్ (28) జట్టు స్కోరు 59 లోపే పెవిలియన్ చేరారు. ఈ క్రమంలో టామ్ లేథమ్ (51, 64 బంతుల్లో 1×4, 1×6)తో కలిసి సీనియర్ ఆటగాడు రాస్ టేలర్ (93, 106 బంతుల్లో 9×4) చెలరేగాడు. శతకానికి చేరువయ్యాడు. వీరిద్దరూ కలిసి నాలుగో వికెట్‌కు 119 పరుగుల విలువైన భాగస్వామ్యం నెలకొల్పారు. ఆచితూచి ఆడుతోనూ చూడచక్కని షాట్లతో విరుచుకుపడ్డారు. ప్రమాదకరంగా మారిన ఈ జోడీలో లేథమ్‌ను ఔట్ చేయడం ద్వారా చాహల్ విడదీశాడు. అప్పుడు జట్టు స్కోరు 178. ఒక వైపు వికెట్లు పడుతున్నా టేలర్ ప్రతిఘటించాడు. 222 పరుగుల వద్ద షమి అతడిని పెవిలియన్ పంపించాడు. కివీస్ 243 పరుగులకు ఆలౌటైంది. షమి 3, భువి, చాహల్, పాండ్య తలో రెండు వికెట్లు పడగొట్టారు.



అంబటికి ఐసీసీ షాక్

రాయుడి బౌలింగ్‌పై వేటు

న్యూఢిల్లీ : భారత ఆటగాడు అంబటి రాయుడి బౌలింగ్‌పై ఐసీసీ నిషేధం విధించింది. అంతర్జాతీయ క్రికెట్‌లో బౌలింగ్ చేయకుండా అతనిపై వేటు వేసింది. రాయుడి బౌలింగ్ అనుమానాస్పదంగా ఉందని ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో బౌలింగ్ యాక్షన్‌కు సంబంధించిన పరీక్షకు హాజరుకావాల్సిందిగా ఐసీసీ ఆదేశించింది. అయితే నిర్ణీత 14 రోజుల్లో అతను హాజరుకాకపోవడంతో ఐసీసీ చర్యలకు ఉపక్రమించింది. ఐసీసీ నిబంధనల్లోని 4.2 క్లాజ్ ప్రకారం అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో బౌలింగ్ చేయకుండా అతనిపై నిషేధం విధించింది. రాయుడు బౌలింగ్ శైలిని పరిశీలించి.. సక్రమంగానే బౌలింగ్ చేస్తున్నాడని నిర్ధారించే వరకూ ఈ సస్పెన్షన్ కొనసాగుతుందని ఐసీసీ స్పష్టం చేసింది. సిడ్నీలో ఈనెల 13న ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో అంబటి రాయుడి బౌలింగ్ శైలిపై ఫిర్యాదు అందింది. అయితే బీసీసీఐ నిబంధనల ప్రకారం దేశవాళీ క్రికెట్‌లో అతను బౌలింగ్ కొనసాగించే అవకాశముంది.

మణికట్టు కనికట్టు తెలిస్తేనే..!

మాజీ కెప్టెన్ అజహరుద్దీన్



హైదరాబాద్: వరుస విజయాలతో జైత్రయాత్ర కొనసాగిస్తున్న కోహ్లిసేనపై మాజీ క్రికెటర్ అజహరుద్దీన్ ప్రశంసల వర్షం కురిపించాడు. మణికట్టు మాంత్రికులు కుల్‌దీప్ యాదవ్, యుజువేంద్ర చాహల్ అద్భుతంగా బంతులు వేస్తున్నారని పేర్కొన్నాడు. వారిద్దరినీ ఎలా ఎదుర్కోవాలో తెలియనంత వరకు టీమిండియాపై ప్రత్యర్థి జట్లు విజయం సాధించడం కష్టమని వెల్లడించాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు వన్డేల సిరీస్‌లో కోహ్లిసేన వరుసగా రెండు మ్యాచ్‌లు గెలిచి పటిష్ఠ స్థితిలో నిలిచిన సంగతి తెలిసిందే. 'మనకు అద్భుతమైన జట్టుంది. నాలుగైదేళ్లుగా తిరుగులేని ప్రదర్శనలు చేస్తోంది. కేవలం వన్డేల్లోనే కాదు మూడు ఫార్మాట్లలో చక్కని పటిష్ఠ జట్టుంది. ఇతర జట్ల ప్రమాణాలు కాస్త తగ్గాయి గానీ భారత్ మాత్రం నానాటికీ బలపడుతోంది. మనతో పోటీ పడేదెవరైనా సరే ఫలితాలు మాత్రం ఒకేలా ఉంటాయి. విరాట్ కోహ్లికి విశ్రాంతి అవసరం. చాన్నాళ్లనుంచి సుదీర్ఘంగా ఆడుతున్నాడు. నిలకడగా పరుగులు చేస్తున్నాడు. అందులోనూ చురుకైన ఫీల్డర్. అందుకే అతడు విశ్రాంతి తీసుకుంటే మంచిదే' అని అజహర్ అన్నాడు.

లక్కీ జాదవ్..!



మౌంట్ మాంగనుయ్: ప్రస్తుతం భారత క్రికెట్ జట్టులో ఆటగాళ్ల మధ్య తీవ్ర పోటీ కొనసాగుతోంది. ఇప్పటికే కొంత మంది జట్టులో రెగ్యులర్ ఆటగాళ్లగా కొనసాగుతుండగా, మరికొంతమంది మాత్రం ఎప్పటికప్పుడు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటూనే ఉన్నారు. అలా ఇప్పటికీ తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న ఆటగాళ్లలో కేదార్ జాదవ్ ఒకడు. కాగా, భారత జట్టుకు జాదవ్ లక్కీగా మారడం ఇక్కడ విశేషం. భారత్ తరపున జాదవ్ ఆడిన చివరి 16 వన్డేల్లోనూ భారత్ పరాజయం చెందకపోవడమే అందుకు కారణం. టీమిండియా మిడిలార్డర్‌లో బ్యాటింగ్ చేస్తున్న కేదార్ జాదవ్ బ్యాట్‌తో భారీ సంఖ్యలో సెంచరీలు సాధించిందీ లేదు, అలా అని బంతితోనూ అమితంగా ఆకట్టుకున్నదీ లేదు. అయితే అతడు తుది జట్టులో ఉంటే మాత్రం జట్టు విజయాలు సాధిస్తుందనేది గణాంకాలు చెబుతున్నాయి. ప్రధానంగా దాదాపు 15 నెలలు కాలంగా జాదవ్ ఆడిన అన్నీ వన్డే మ్యాచ్‌ల్లోనూ భారత్ ఓటమి చూడలేదు. అక్టోబరు 25, 2017 నుంచి కేదార్ జాదవ్ 16 వన్డేల్లో ఆడితే భారత్ ఒక్క మ్యాచ్‌లో కూడా భారత్ ఓడిపోలేదు. గత ఏడాది ఆసియా కప్‌లో ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన ఒక మ్యాచ్ మాత్రమే టై ముగిసింది. అటు బ్యాట్‌తోనూ, ఇటు బంతితోనూ రాణిస్తూ తనకు వచ్చిన అవకాశాల్ని సద్వినియోగం చేసుకుంటున్నాడు. ఇప్పటివరకూ జాదవ్ ఆడిన వన్డే మ్యాచ్‌ల సంఖ్య 52. 2014లో శ్రీలంకతో జరిగిన మ్యాచ్ ద్వారా అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు జాదవ్. అతని వన్డే కెరీర్‌లో రెండు సెంచరీలు, నాలుగు హాఫ్ సెంచరీలు మాత్రమే చేయగా, 24 వికెట్లు తీశాడు.

రంజీ ఫైనల్లో సౌరాష్ట్ర

శతకంతో రాణించిన పుజారా



బెంగళూరు : సౌరాష్ట్ర జట్టు రంజీ ట్రోఫీ ఫైనల్లో అడుగుపెట్టింది. పుజారా (131 నాటౌట్), జాక్సన్ (100) రాణించడంతో కర్ణాటక నిర్దేశించిన 279 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి 5 వికెట్ల తేడాతో విజయం అందుకుంది. 279 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన సౌరాష్ట్ర 23 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. మిడిలార్డర్‌లో ఛతేశ్వర్ పుజారా, జాక్సన్ శతకాలతో ఆదుకోవడంతో సౌరాష్ట్ర విజయం అందుకుంది. 100 చేసిన జాక్సన్ వినయ్ కుమార్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. పుజారా మాత్రం 131 పరుగులతో నాటౌట్‌గా మిగిలి జట్టును గెలిపించాడు. తొలుత బ్యాటింగ్ చేసిన కర్ణా టక 275 పరుగులు చేసి ఆలౌట్ కాగా, బదులుగా సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 236 పరుగులే చేసింది. కర్ణాటక రెండో ఇన్నింగ్స్‌లో 239 పరుగులు చేయ గా తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కలిపి సౌరాష్ట్ర ముందు 279 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. ఈ విజ యంతో సౌరాష్ట్ర రంజీ ఫైనల్లో విదర్భ జట్టుతో పోటీ పడనుంది.

కోహ్లి మరో అరుదైన రికార్డు

బేఓవెల్: టీం ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి ఇటీవల కాలంలో ఎన్నో రికార్డులను బద్దలుకొట్టాడు. మరోవైపు.. ఎన్నో రికార్డులను సృష్టించాడు కూడా. క్రికెట్ చరిత్రలో దిగ్గజ క్రికెటర్లు సాధించిన అరుదైన రికార్డులను కోహ్లి తిరగరాసి తన ఖాతాలో వేసుకున్నాడు. కాగా న్యూజిలాండ్‌తో జరిగిన మూడో వన్డేలో అర్ధ శతకంతో చెలరేగిపోయిన కోహ్లి... మరో అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. లిస్ట్-ఏ క్రికెట్‌లో 100 అర్ధశతకాలు సాధించిన ఐదో భారత క్రికెటర్‌గా కోహ్లి నిలిచాడు. ఈ జాబితాలోనూ క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ మొదటిస్థానంలో ఉన్నాడు.



జకోవిచ్, ఒసాకా టాప్

ఆరో స్థానానికి పడిపోయిన ఫెదరర్

పారిస్ : ఆస్ట్రేలియన్ ఓపెన్ రికార్డు స్థాయిలో ఏడోసారి గెలుచుకున్న జకోవిచ్ తన టాప్ ర్యాంకును మరింత సుస్థిరం చేసుకున్నాడు. జకో 10,955 పాయింట్లతో అందనంత ఎత్తున నిలువగా ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనలిస్ట్ నాదల్ 8,320 పాయింట్లతో రెండో స్థానాన్ని నిలబెట్టు కున్నాడు. ఐతే ప్రీక్వార్టర్స్‌లోనే వెనుదిరిగిన స్విస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ 3వ ర్యాంకును కోల్పోయి ఆరో స్థానానికి పడిపోయాడు. ఫెదరర్ 3వ స్థానాన్ని, జర్మనీ ఆటగాడు అలగ్జాండర్ జ్వేరేవ్ భర్తీ చేశాడు. 4వ ర్యాంకులో డెల్ పోట్రో ఉండగా, ఆస్ట్రే లియన్ ఓపెన్‌లో నిరాశ పరిచిన దక్షిణాఫ్రికా ఆట గాడు కెవిన్ ఆండర్‌సన్ ఒక స్థానం మెరుగుపరుచుకుని 5వ ర్యాంకులో ఉన్నాడు. నిషికొరి రెండు స్థానాలు మెరుగుపడి ఏడో ర్యాంకులో నిలి చాడు. ఫెదరర్‌కు షాకిచ్చి సెమీస్‌లో వెనుదిరిగిన ట్సిసిపస్ మూడు ర్యాంకులు ఎగబాకి 12వ ర్యాంకును అందుకున్నాడు.

ఒసాకా టాప్..

ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ విజేత నవోమి ఒసాకా తొలి స్థానం అందుకుంది. టోర్నీ ముందు నాలుగో స్థానంలో ఉన్న ఒసాకా ఓపెన్ గెలిచి తొలిస్థానాన్ని కైవసం చేసుకుంది. ఆస్ట్రేలి యన్ ఓపెన్ రన్నరప్ క్విటోవా 4 ర్యాంకులు మెరుగు పడి రెండో స్థానానికి చేరింది. హెలెప్ టాప్ ర్యాంకును కోల్పోయి మూడో స్థానానికి, రెండో ర్యాంకు కెర్బర్ ఆరో స్థానానికి పడిపోయారు. సెరీనా 5 స్థానాలు మెరుగుపడి 11వ ర్యాంకు దక్కించుకుంది.

సీబీఐ చీఫ్ ఎవరో..?

- పరిశీలనలో 11 పేర్లు
- జావేద్ అహ్మద్ వైపు మొగ్గు
- జాబితాలో అస్థానా, మోడీ
- రేపు లేదా ఎల్లుండి హెచ్‌పీసీ భేటీ

న్యూఢిల్లీ : కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) డైరెక్టర్ పోస్టు భర్తీపై కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అందులో భాగంగానే 1983, 84, 85 బ్యాచ్‌లకు చెందిన 11 మంది సీనియర్ ఐపీఎస్ అధికారుల పేర్లను పరిశీలిస్తోంది. ఈ జాబితాలో సీబీఐ వివాదానికి కారణమైన ప్రత్యేక డైరెక్టర్ రాకేష్ అస్థానాతోపాటు హరేన్ పాండ్యా హత్య కేసులో 12 మంది నిందితులకు సీబీఐ క్లీన్ చిట్ ఇవ్వటంలో కీలకపాత్ర పోషించిన వైసీ మోడీ కూడా ఉండటం గమనార్హం. 1983 ఐపీఎస్ బ్యాచ్‌లో మధ్యప్రదేశ్ కేడర్‌కు చెందిన రీనా మిత్రా అందరిలోనూ సీనియర్. గతంలో ఐదేళ్లపాటు సీబీఐలో పని చేసిన అనుభవం ఆమెకు ఉంది. ఈ నెల 31న ఆమె పదవీ విరమణ చేయనున్నారు. అయితే చీఫ్ పదవిని ఎంపిక చేసేముందు సీనియర్లను పరిగణనలోకి తీసుకోవాలని ప్రతిపక్షనేత ఖర్గే కేంద్రానికి సూచించారు. దీంతో 11మంది జాబితాను కేంద్రం రూపొందించింది. ప్రధాని మోడీ, లోక్‌సభలో కాంగ్రెస్‌పక్ష నేత మల్లికార్జున ఖర్గే, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) రంజన్ గొగోయ్‌తో కూడిన ఉన్నతస్థాయి కమిటీ (హెచ్‌పీసీ) ఇందుకోసం ఈనెల 24న సమావేశమైంది. అయితే కొత్తబాస్ ఎంపిక జరగకుండానే సమావేశం ముగిసింది. ఈ నెల 30 లేదా 31న మరోసారి హెచ్‌పీసీ భేటీకానుంది. కేంద్రం గుర్తించిన 11 మంది సీనియర్ ఐపీఎస్‌లలో ఎంపీ కేడర్‌కు చెందిన రీనా మిత్రా ప్రస్తుతం కేంద్ర హోం మంత్రిత్వశాఖ ప్రత్యేక కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఆమె 31న పదవీ విమరణ చేయనున్న నేపథ్యంలో అత్యంత సీనియర్‌ను సీబీఐ డైరెక్టర్‌గా నియమించే అంశంపై సమావేశంలో చర్చించనున్నారు. రీనా తర్వాత యూపీకేడర్‌కు చెందిన 1984 ఐపీఎస్ ఆఫీసర్, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) డీజీ రజనీకాంత్ మిశ్రా ఉన్నారు. గతంలో ఐదేళ్లపాటు సీబీఐలో పని చేసిన ఆయన ఆగస్టులో పదవీ విరమణ చేయనున్నారు.

సీనియార్టీని గుర్తించేనా...

సీబీఐ చీఫ్ పదవికి సీనియార్టీని గుర్తిస్తారా, లేక బీజేపీ అనుకూల అధికారులను నియమిస్తారా..? అనే చర్చ దేశవ్యాప్తంగా జరుగుతోంది. సీనియార్టీ విషయానికొస్తే వచ్చే ఏడాది మార్చి వరకు పదవీకాలం ఉన్న యూపీ కేడర్‌కే చెందిన 1984 ఐపీఎస్ అధికారి జావెద్ అహ్మద్ పేరును కేంద్రం పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈయన సీబీఐలో 12 ఏళ్లకుపైగానే పని చేసిన అనుభవం ఉంది. యూపీ డీజీపీగా, కేంద్ర హోంశాఖ కార్యదర్శిగా పని చేశారు. బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా లేరనే ఉద్దేశంతో సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆయన్ని డీజీపీ పదవి నుంచి తొలగించారు. ప్రస్తుతం అహ్మద్ లోక్ నాయక్ జయప్రకాష్ నారాయణ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రిమినాలజీ అండ్ ఫోరెన్సిక్ సైన్స్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. కేంద్రంలోని బీజేపీకి ఆయన అనుకూలంగా ఉండరనే వాదన ఉంది.

మోడీ ఇష్టులిద్దరిపైనా ఆరోపణలు

సీబీఐ చీఫ్ ఎంపిక కోసం కేంద్ర ప్రభుత్వం తయారు చేసిన 11 మంది సీనియర్ ఐపీఎస్ అధికారుల జాబితాలో ప్రధాని మోడీకి అత్యంత ఇష్టులు ఇద్దరున్నారు. వారిలో సీబీఐలో వివాదానికి కేంద్ర బిందువుగా ఉన్న ప్రత్యేక డైరెక్టర్ రాకేష్ అస్థానా ఒకరు. అవినీతి ఆరోపణలకు పాల్పడినందుకు సీబీఐ అస్థానాపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. తనపై ఉన్న ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని ఆయన ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించగా, కోర్టు కొట్టివేసింది. దీంతో సీబీఐ డైరెక్టర్ పోస్టుకు ఆయన పేరును పరిగణనలోకి తీసుకునే అవకాశం లేదు. అసోం-మేఘాలయ కేడర్‌కు చెందిన వైసీ మోడీ ప్రధానికి అత్యంత ఆప్తుడనే ప్రచారం ఉంది. ప్రస్తుతం ఎన్ఐఏ చీఫ్‌గా ఉన్న వైసీ మోడీపై 2011లో గుజరాత్ హైకోర్టు కటువైన పదజాలాన్ని ఉపయోగించింది. హరేన్ పాండ్యా హత్య కేసులో 12 మందిని సీబీఐ నిర్దోషులుగా ప్రకటిం చటాన్ని హైకోర్టు తప్పుపట్టిన విషయం విదితమే. పాండ్యా హత్య కేసును మరోసారి విచారణకు చేపట్టా లని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ నేపథ్యంలో అస్థానా, మోడీ పేర్లను పరిశీలించే అవకాశం లేదు. 1985 ఐపీఎస్ బ్యాచ్‌లో ముగ్గురు పేర్లు కూడా కేంద్ర ప్రభుత్వ జాబితాలో ఉంది. వారిలో ప్రస్తుత రాజస్థాన్ డీజీపీ అరుణ్‌కుమార్, హోంగార్డు డీజీ ఓపీ గల్హోత్ర, యూపీ విజిలెన్స్ డీజీ హెచ్ అవస్థి ఉన్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతస్థాయి కమిటీ భేటీలో ఎవరిని సీబీఐ డైరెక్టర్‌గా నియమిస్తారనేది పెద్ద చర్చనీయాంశంగా మారింది.

కేంద్ర ప్రభుత్వం తయారు చేసిన సీనియర్ ఐపీఎస్‌ల జాబితా

ఐపీఎస్ అధికారి పేరు	రాష్ట్రం	పదవీ విరమణ	ప్రస్తుత పదవి
రీనా మిత్రా (1983)	మధ్యప్రదేశ్	2019 జనవరి	ఎంహెచ్ఏ ప్రత్యేక కార్యదర్శి
రజనీకాంత్ మిశ్రా (1984)	ఉత్తరప్రదేశ్	2019 ఆగస్టు	బీఎస్ఎఫ్ డీజీ
జావేద్ అహ్మద్ (1984)	ఉత్తరప్రదేశ్	2020 మార్చి	ఫోరెన్సిక్ డైరెక్టర్
రాకేష్ అస్థానా (1984)	గుజరాత్	2021 జూలై	సీబీఐ ప్రత్యేక డైరెక్టర్
ఎస్ఎస్ దేశ్‌వాల్ (1984)	హర్యానా	2021 ఆగస్టు	ఐటీబీఐ డీజీ
వీకే జొహ్రీ (1984)	మధ్యప్రదేశ్	2020 సెప్టెంబరు	రా ప్రత్యేక కార్యదర్శి
వైసీ మోడీ (1984)	అసోం, మేఘాలయ	2021 మే	ఎన్ఐఏ డీజీ
రాజేష్ రంజన్ (1984)	బీహార్	2020 నవంబరు	సీఐఎస్ఎఫ్ డీజీ
హెచ్‌సీ అవస్థి (1985)	ఉత్తరప్రదేశ్	2021 జూన్	యూపీ విజిలెన్స్ డీజీ
ఓపీ గల్హోత్ర (1985)	రాజస్థాన్	2019 అక్టోబరు	రాజస్థాన్ హోంగార్డ్స్ డీజీ
అరుణ్ కుమార్ (1985)	ఉత్తరప్రదేశ్	2021 జూన్	రాజస్థాన్ డీజీపీ



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

యూపీ సీఎంపై చర్య తీసుకోవాలి : నారాయణ

న్యూఢిల్లీ : అయోధ్యలోని బాబ్రీమసీదు అంశంపై సుప్రీంకోర్టును సవాల్ చేస్తూ వ్యాఖ్యలు చేసిన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్‌పై చర్యలు తీసుకోవా ల్సిందిగా సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టరు కె. నారాయణ డిమాండు చేశారు. ఆయన వ్యాఖ్యలు న్యాయవ్యవస్థను ధిక్కరించే పద్ధతిలో ఉన్నాయని పేర్కొన్నారు. సీపీఐ ఢిల్లీ రాష్ట్ర సమితి సమావేశం పార్టీ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన నారాయణ మాట్లాడుతూ, గత నెలలో విశాఖపట్నంలో జరిగిన సీపీఐ జాతీయ సమితి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వెల్లడించారు. దేశ ప్రస్తుత రాజకీయాలను వివరించారు. కేంద్రంలోని బీజేపీ-ఆర్ఎస్ఎస్ మతోన్మాద, అవినీతి పాలకులను ఓడించేందుకు జాతీయ స్థాయిలో లౌకిక, ప్రజాతంత్ర శక్తులతో సంఘటనను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. రామమందిరం అంశంపై కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్‌ప్రసాద్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ చేసిన వ్యాఖ్యలను నారాయణ తీవ్రంగా ఖండించారు. కేంద్ర న్యాయ శాఖ మంత్రి, ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి సుప్రీంకోర్టుకు వ్యతిరేకంగా సవాల్ విసరడం న్యాయవ్యవస్థను వారు లక్ష్యంచేసుకున్నట్లు అర్థమౌతోందన్నారు. ఇందుకు ప్రధాని మోడీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండు చేశారు. అయోధ్య అంశంపై సుప్రీంకోర్టు ఈనెలలో విచారణ జరపబోతున్న నేపథ్యంలో వీరి వ్యాఖ్యలు సుప్రీంకోర్టును బ్లాకమెయిల్ చేసే విధంగా ఉన్నాయన్నారు. యూపీ ముఖ్యమంత్రి వ్యాఖ్యలు సభ్యసమాజానికి వ్యతిరేకం, సెక్యులరిజానికి వ్యతిరేకమని చెప్పారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న ఆదిత్యనాథ్‌పై చర్య తీసుకోవాల్సిందిగా నారాయణ డిమాండు చేశారు. జేఎన్‌యూ విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు, సీపీఐ నాయకుడు కన్హయ కుమార్ తదితరులపై ఢిల్లీ పోలీసులు, కేంద్రం తప్పుడు చార్జిషీట్ దాఖలు చేయడాన్ని కూడా ఖండించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలలో ఉమ్మడిగా పోటీచేసేందుకు ఢిల్లీ స్థాయిలో లౌకిక, వామపక్ష, ప్రజాతంత్ర శక్తులతో విశాల వేదికను నిర్మించాలని సమావేశం నిర్ణయించింది. ఢిల్లీ ప్రభుత్వాన్ని వేధించడం మానుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండు చేసింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.